సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 12

మంగళవారం 4-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



చెన్నై సూపర్ కింగ్స్ విజయం

చెన్నైలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో 12 పరుగుల తేడాతో లక్నో ఓటమి -12లో



మేనత్త పోచవ్వ

'బలగం' మేనత్తగా పరకాయ ప్రవేశం చేసిన సురభి విజయలక్ష్మి -11లో



ఎంతటివారినైనా ఎదుర్కోండి

అవినీతిపరులు ఎంతటి శక్తివంతులైనాసరే ముందడుగువేసి పోరాడాలని సీబీఐ అధికారులకు ప్రధాని మోదీ కర్తవ్యబోధ చేశారు.

వివరాలు 6లో ▸



నేడు కోర్టుకు ట్రంప్

హష్ మనీ చెల్లింపుల కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం మన్‌హటన్ గ్రాండ్ జ్యూరీ ముందు హాజరుకానున్నారు.

వివరాలు 6లో ▸



ఉమ్మడి గళం వినిపిద్దాం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందుకు ఉమ్మడిగా పోరాడాల్సిందేనని డీఎంకే చీఫ్ స్టాలిన్ అభిప్రాయపడ్డారు.

వివరాలు 6లో ▸



ప్రైమరీలో నెగ్గితేనే పార్టీ అభ్యర్థి

అభ్యర్థులను పార్టీ నేతలు, కార్యకర్తలే ఎంపిక చేయడం ద్వారా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది.

వివరాలు 6లో ▸

ఎన్ని'కళ' కమలం

ఎన్నికల కార్యాచరణ ప్రణాళికకు బీజేపీ తుదిరూపు

నవంబర్ వరకు వరుస కార్యక్రమాలకు సిద్ధం

6న పోలింగ్ బూత్ కమిటీలతో వర్చువల్‌గా మోదీ భేటీ

8న రాష్ట్రానికి రాక.. సికింద్రాబాద్‌లో సభ

మేలో మరోసారి రాష్ట్రానికి ప్రధాని

ఆ తర్వాత పార్టీ సమ్మేళనాలు, సమావేశాలు

జూన్ 1 నుంచి 'ఇంటింటికీ బీజేపీ' పేరిట ప్రచారం

ఆగస్టు, సెప్టెంబర్‌లలో మహిళా, యువ, రైతు వర్గాలతో భేటీలు

అక్టోబర్, నవంబర్‌లలో రాష్ట్రవ్యాప్తంగా విజయసంకల్ప యాత్రలు

రాష్ట్రంపై ఫుల్ ఫోకస్ పెట్టిన జాతీయ నాయకత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీ 'ఎలక్షన్ మోడ్'లోకి వచ్చింది. వచ్చే 7, 8 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, దానికి సంబంధించిన కసరత్తును పూర్తి చేసింది. పార్టీపరంగా చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికకు తుదిరూపు ఇచ్చింది. తెలంగాణపై పూర్తి ఫోకస్ పెట్టిన బీజేపీ అధినాయకత్వం ప్రత్యక్ష పర్యవేక్షణలో వరుస కార్యక్రమాల నిర్వహణకు సంసిద్ధమైంది. ఈ నెల 6వ తేదీ మొదలుకుని వరుస కార్యక్రమాలతో వేడెక్కించనుంది. 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రంలోని పోలింగ్ బూత్ కమిటీల సభ్యులతో ఎన్నికల సన్నద్ధతపై ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడనున్నారు. రాష్ట్రంలో కేంద్రం చేపట్టిన/చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు 8న రాష్ట్రానికి

మిగతా 2వ పేజీలో ▶



30న 100 సెంటర్లలో మన్ కీ బాత్

ఏప్రిల్ 30న మోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వంద సెంటర్లలో నిర్వహిస్తారు. ఇక మే నెలలో కేంద్రం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. మే రెండో వారంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 500 మంది ముఖ్య కార్యకర్తలతో సమ్మేళనాలు ఉంటాయి. మే 15 నుంచి జూన్ 15 వరకు నియోజకవర్గ కేంద్రాల వారీగా రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై 'సాలుదొర-సెలవు దొర' పేరిట భేటీలు ఉంటాయి. జూన్ 1 నుంచి ఇంటింటికీ బీజేపీ పేరిట ఎన్నికల ప్రచారం ముమ్మరం చేస్తారు. జూలైలో కేంద్రం చేసిన కార్యక్రమాలు ప్రధానంగా ప్రస్తావిస్తూ కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ఎండగడతారు. ఆగస్టు, సెప్టెంబర్‌లలో మహిళా, యువ, రైతు వర్గాలతో సమావేశాలు ఉంటాయి. అక్టోబర్, నవంబర్‌లలో రాష్ట్రవ్యాప్తంగా విజయ సంకల్ప యాత్రలు నిర్వహిస్తారు.

'బలగం' సిద్ధం చేద్దాం

- మండల, జిల్లా కమిటీల ఏర్పాటుపై టీపీసీసీ దృష్టి
- 20లోపు మండల కమిటీలకు ప్రతిపాదనలు పంపాలి

- వివరాలు 2లో

నిజమే.. నిధులు మళ్లించాం!

ఏపీ సీఐడీ విచారణలో రామోజీ పరోక్షంగా అంగీకారం

- సొంత పెట్టుబడులుగా పెట్టాం.. అది మార్గదర్శి ఆర్థిక ప్రణాళికంటూ దబాయింపు
- విచారణ తప్పించుకునేందుకు అనారోగ్యం అంటూ డ్రామా
- రామోజీ ఆరోగ్యం బాగానే ఉందన్న సొంత డాక్టర్
- దీంతో వీడియో రికార్డింగ్ ద్వారా విచారించిన సీఐడీ
- విచారించాల్సింది మార్గదర్శి మేనేజర్లనంటూ రామోజీరావు వితండ వాదన
- ఎట్టకేలకు మంచంపై పడుకునే సమాధానాలు
- 8 గంటల విచారణ ప్రక్రియ వీడియో రికార్డింగ్
- ఈ నెల 6న శైలజను విచారించనున్న అధికారులు
- తదుపరి రామోజీ, శైలజను ఏపీలో విచారించేందుకు సీఐడీ సన్నాహాలు

సాక్షి, అమరావతి

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ–1గా ఉన్న సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావు సీఐడీ విచారణను తప్పించుకునేందుకు ఆడిన డ్రామాలు ఫలించలేదు. విచారించాల్సింది తనను కాదని, మార్గదర్శిలో కిందిస్థాయి సిబ్బందినంటూ తప్పించుకునేందుకు ఆయన వేసిన ఎత్తుగడలు పారలేదు. తన ఆరోగ్యం బాగా లేదని రామోజీరావు చెబుతున్నవి సాకులేనని

మిగతా 10వ పేజీలో ▶



రామోజీరావును విచారించిన అనంతరం బయటకు వస్తున్న ఏపీ సీఐడీ అధికారులు

టెన్త్ పేపర్ అవుట్

తెలుగు పరీక్ష ప్రారంభమైన 7 నిమిషాలకే వాట్సాప్ ద్వారా బయటకు..

- తాండూరు–1 హైస్కూల్‌లో ఓ ఇన్విజిలేటర్ నిర్వాకం
- ప్రశ్నపత్రం ఫొటోలు తీసి చెంగోల్ జెడ్పీహెచ్ఎస్ టీచర్‌కు పంపిన వైనం
- అతని ద్వారా వేరే వాట్సాప్ గ్రూపులకు చేరిన పేపర్
- ప్రైవేటు స్కూళ్ల పాత్రపై పోలీసుల అనుమానం
- నలుగురిని సస్పెండ్ చేసిన కలెక్టర్.. ఇద్దరు టీచర్లపై కేసు
- మాస్ కాపీయింగ్‌పై ఆధారాలు లభించలేదని వెల్లడి
- మిగతా పరీక్షలు యథాతథం: విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్/ వికారాబాద్/ తాండూరు: టెన్త్ పరీక్షల తొలిరోజు.. పరీక్ష ప్రారంభమైన 7 నిమిషాలకే ప్రశ్నపత్రం బయటకు వచ్చింది. ఓ పాఠశాలలోని ఇన్విజిలేటర్ క్వశ్చన్ పేపర్ ఫొటోలు తీసి వాట్సాప్ ద్వారా మరో పాఠశాలలోని టీచర్‌కు పంపాడు. అతను ఇతర గ్రూపులకు పంపడంతో విషయం వెలుగు చూసింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రాథమిక విచారణ అనంతరం ఇద్దరు ఉపాధ్యాయులు సహా నలుగురిపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. ప్రైవేట్ స్కూళ్ల పాత్రపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తుండగా.. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు విద్యాశాఖ ఆదేశించింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు

మిగతా 3వ పేజీలో ▶



ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన కార్యాలయం బోర్డు

జలవిద్యుత్ ఉత్పత్తిలో 'పులిచింతల' రికార్డు

- 2022–23లో 160 మిలియన్ యూనిట్ల లక్ష్యానికి రెట్టింపు ఉత్పత్తి - 5లో

భావి తరాల కోసం 'కూల్ రూఫ్'

- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో చల్లటి పైకప్పుల విధానానికి శ్రీకారం చుడుతున్నాం
- తెలంగాణ కూల్ రూఫ్ పాలసీ–2023–28 ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



కూల్ రూఫ్ విధానంపై కేటీఆర్‌కు వివరిస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో కూల్‌రూఫ్ పాలసీ అమలుకు శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావాన్ని నివాస గృహాలు, వాణిజ్య కార్యాలయాలపై తగ్గించేందుకు తీసుకొచ్చిన 'తెలంగాణ కూల్‌రూఫ్ విధానం 2023–28'ను మంత్రి కేటీఆర్ సోమవారం పురపాలక శాఖ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 600 చదరపు గజాలకుపైగా విస్తీర్ణంలో నిర్మించే అపార్ట్‌మెంట్లు, ఇతర వాణిజ్య సముదాయాల్లో

మిగతా 2వ పేజీలో ▶

రాహుల్‌గాంధీకి బెయిల్



పరువునష్టం వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి సూరత్ సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రెండేళ్ల జైలు శిక్షను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన అప్పీల్‌పై ఏప్రిల్ 13న విచారణ చేపట్టనున్నట్టు అదనపు సెషన్స్ జడ్జి ఆర్.పి.మొగేరా పేర్కొన్నారు. ఏప్రిల్ 10వ తేదీలోగా ప్రతిస్పందన దాఖలు చేయాల్సిందిగా ఆదేశిస్తూ ప్రతివాది బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీకి నోటీసులు జారీ చేశారు.

- వివరాలు 6లో▶



పోలవరం ముంపుపై 10న సమావేశం

- ఏపీ, తెలంగాణతో నిర్వహించాలని ప్రాజెక్టు అథారిటీకి సీడబ్ల్యూసీ ఆదేశం
- గత అధ్యయనాలు, మ్యాపులపై ఇరు పక్షాలు చర్చించాలని దిశానిర్దేశం
- అప్పటికీ తెలంగాణ సందేహాలు నివృత్తి కాకుంటే ఎఫ్ఆర్ఎల్ సర్వే రాళ్ల గుర్తింపుపై ఉమ్మడి సర్వే నిర్వహించాలి

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టులో పూర్తి స్థాయి నిల్వ మట్టం (ఎఫ్ఆర్ఎల్) మేరకు నీళ్లను నిల్వ చేస్తే ఉండనున్న ముంపు ప్రభావాన్ని సూచించే ఎఫ్ఆర్ఎల్ సర్వే రాళ్లను గుర్తించడానికి సంయుక్త సర్వే నిర్వహించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఆదేశాలు

మిగతా 2వ పేజీలో ▶

సిబ్బందే లీక్ చేస్తారని ఊహించలేదు


సిట్‌కు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి వివరణ

- ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో మూడు గంటలకుపైగా కొనసాగిన విచారణ
- వాంగ్మూలం నమోదు.. త్వరలో కోర్టుకు సమర్పణ



సాక్షి, హైదరాబాద్: కమిషన్‌లో పనిచేస్తున్న వ్యక్తులే పేపర్ల లీకేజీకి పాల్పడతారని ఊహించలేకపోయినట్లు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి సిట్ అధికారుల విచారణలో పేర్కొన్నారు. ఇప్పటివరకు తమ దృష్టికి వచ్చిన దాని ప్రకారం ప్రవీణ్, రాజశేఖర్, రమేష్, షమీమ్‌లపై గతంలో ఎలాంటి ఆరోపణలు లేవని... ఈ నేపథ్యంలో ఇలాంటి లీకేజీ జరుగుతుందని ఊహించలేదని వివరణ ఇచ్చారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ స్కాంను దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు సోమవారం కమిషన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి వాంగ్మూలం నమోదు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవి కావడంతో చైర్మన్‌కు నోటీసులు పంపకుండా స్వయంగా

మిగతా 3వ పేజీలో ▶



మరీ అంత తగ్గాల్సిన అవసరం లేదనుకుంటా సార్!!

రెండు రోజులు వర్షాలు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంపై ఉపరితల ద్రోణి ప్రభావం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. సోమవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. మహబూబ్‌నగర్‌లో గరిష్టంగా 38.8 డిగ్రీల సెల్సియస్, మెదక్‌లో కనిష్టంగా 20.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే నమోదవుతాయని వాతావరణ శాఖ సూచించింది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	41.2	26.4
అనంతపురం	40.7	22.8
కర్నూలు	40.5	27.0
రాజమహేంద్రవరం	40.0	25.0
ఆదిలాబాద్	38.3	22.5
మహబూబ్‌నగర్	38.8	24.9
మెదక్	37.8	20.8
నిజామాబాద్	37.7	23.6
రామగుండం	37.0	25.0
హైదరాబాద్	36.9	25.3
భద్రాచలం	36.8	26.0
ఖమ్మం	36.6	25.2
హకీంపేట్	36.5	24.5
నల్లగొండ	36.5	22.0
దుండిగల్	36.4	22.8
హనుమకొండ	35.0	23.5



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళలు

మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్న ఇల్లెందు మండలంలోని కొమరారం గ్రామం

ఆందోళనల పద్ధతి మారుస్తున్న రాజకీయ పార్టీలు

కొత్త మండలాల సాధన కోసం ఆటల పోటీలు | **భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో నిరసన**

ఆటల పోటీలతో ఉద్యమం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: డిమాండ్ల సాధనకు రాజకీయ పార్టీలు కొత్త పంథాను ఎంచుకుంటున్నాయి. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్త మండలాల కోసం ఉద్యమిస్తున్న ఆయా పార్టీలు, సంఘాలు ధర్నాలు, ర్యాలీలతో లాభం లేదని గ్రహించి వినూత్న పద్ధతిలో ప్రయత్నిస్తున్నాయి. ఇల్లెందు కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్‌తో పాటు కొమరారం, బోడు కేంద్రంగా నూతన మండలాల ఏర్పాటుకోసం వామపక్షాలు, ఇతర పార్టీలు ఏళ్ల ఉద్యమిస్తున్నాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కూడా సాధారణ పద్ధతుల్లోనే సంతకాల సేకరణ, ధర్నాలు, దీక్షలు, పాదయాత్రలు చేపట్టాయి. అయితే ఇందులో రాజకీయ పార్టీల నాయకులు భాగస్వాములు అవుతున్నారు తప్పితే ప్రజల భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో లేదని నేతలు గ్రహించారు. దీంతో పార్టీలు.. ప్రజలను కూడా భాగం చేసేందుకు సరికొత్త ఎత్తుగడ కింద ఆటల పోటీలను ఆయుధంగా ఎంచుకున్నాయి. ఈ క్రమంలో పురుషులకు వాలీబాల్ పోటీలు, ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి మండలాల స్థాయిలో మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించాయి. గతంలో కూడా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిగినా.. అవి ఏదైనా జాతీయ పండుగలను పురస్కరించుకుని లేదా ఆయా పార్టీలకు చెందిన నేతల స్మారకార్థం జరిగేవి. కానీ తొలిసారిగా ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లను పరిష్కరించాలంటూ ఆటల పోటీలు నిర్వహించడం విశేషం.

2016 నుంచి డిమాండ్లు..

2016 అక్టోబర్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా విభజన సందర్భంగా ఇల్లెందు కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్‌తో పాటు కొమరారం మండలం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను రాజకీయ పక్షాలు భుజానికి ఎత్తుకున్నాయి. సుమారు మూడు నెలల పాటు వివిధ రాజకీయ పక్షాలు ఆందోళనలు, నిరసనలు నిర్వహించాయి. ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఈ అంశాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. అయితే, ఈ డిమాండ్లపై ప్రభుత్వం సర్వే నిర్వహించింది తప్పితే ఎలాంటి పురోగతి లేదు. ఆ తర్వాత కాలంలో ఏజెన్సీ ప్రాంతమైన టేకులపల్లి మండలాన్ని విభజించి బోడు కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు అంశం కూడా తెరపైకి వచ్చింది.

మలి దశలో ఉద్యమం తీరుతెన్నులు

- ఈ ఏడాది జనవరిలో ఇల్లెందు అఖిలపక్షం ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం, సంతకాల సేకరణ, ఇతర రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు.
- ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు నెలపాటు ప్రజాపంథా ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేశారు.
- మార్చి 4 నుంచి 12 వరకు ఇల్లెందు మండలం మర్రిగూడెం నుంచి ఇల్లెందు వరకు 32 కిలోమీటర్లు సీపీఐ (ఎంఎల్) – న్యూడెమొక్రసీ ఆధ్వర్యాన పాదయాత్ర చేపట్టారు.
- మార్చి 28, 29వ తేదీల్లో పురుషులకు మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు.
- ఈనెల 1, 2వ తేదీల్లో ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి మండలాల స్థాయిలో మహిళలకు కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు.

పోలవరం ముంపుపై 10న సమావేశం

▶ మొదటి పేజీ తరువాయి

జారీ చేసింది. ఈ నెల 10న తెలంగాణ, ఏపీతో సమావేశం నిర్వహించాలని పీపీఏను ఆదేశించింది. ముంపుపై ఇరు రాష్ట్రాలు గతంలో చేపట్టిన అధ్యయనాలు, రూపొందించిన మ్యాపులపై చర్చించాలని దిశా నిర్దేశం చేసింది. ఈ సమావేశంలో తెలంగాణ అధికారుల సందేహాలు నివృత్తి కాకుంటే ఎఫ్ఆర్ఎల్ రాళ్ల గుర్తించడానికి సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని ఆదేశించింది.



మరోవైపు పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం చేసే ప్రసక్తే లేదని తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అధికారులకు సీడబ్ల్యూసీ తేల్చి చెప్పింది. గోదావరి నదికి గరిష్టంగా 36 లక్షల క్యూసెక్కుల వరద వస్తే.. 50 లక్షల క్యూసెక్కులు నీరు వస్తుందని అధ్యయనం ద్వారా అంచనా వేసినట్లు గుర్తుచేసింది. సీడబ్ల్యూసీ చైర్మన్ కుష్విందర్ వోరా అధ్యక్షతన అన్ని రాష్ట్రాలతో సోమవారం మూడో సమావేశం జరిగింది. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ నాగేంద్రరావు, కొత్తగూడెం సీఈ శ్రీనివాస్‌రెడ్డి, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, తెలంగాణ ఇంటర్ స్టేట్ బోర్డు గోదావరి డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సైతం ముంపు ప్రభావంపై గోపాలకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదికను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తేల్చిచెప్పాయి. కొత్తగా అధ్యయనం చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశాయి.

సమావేశంలో తెలంగాణ వాదనలు ఇవీ..

- ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం మేరకు నీటిని నిల్వ చేసినప్పుడు తెలంగాణ భూభాగంలో ముంపును గుర్తించాలి.
- డ్రైనేజీ, స్థానిక ప్రవాహాలు నిలిచిపోవడం వల్ల ఏర్పడే ప్రభావాలతోపాటు జూలై 2022లో వచ్చిన వరదలపై తాజాగా ఉమ్మడి అధ్యయనం చేపట్టాలి.
- మణుగూరు భార జల కేంద్రం, భద్రాచలం ఆలయ రక్షణకు చర్యలు చేపట్టాలి.
- కొత్తగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలి. భద్రాచలం పట్టణంలో 8 అవుట్ ఫాల్ రెగ్యులేటర్‌ల స్థాయిలను ధ్రువీకరించాలి.
- కిన్నెరసాని, ముర్రేడువాగుల్లోని వరద ప్రవాహం గోదావరిలో కలవకుండా పోలవరం బ్యాక్‌వాటర్ అడ్డుపడడంతో స్థానికంగా ఏర్పడుతున్న ముంపు ప్రభావంపై ఎన్జీటీ ఉత్తర్వుల మేరకు సర్వే జరపాలి. వీటితో పాటు మరో ఏడు ఇతర పెద్దవాగులపై సర్వే చేయాలి.
- ఛత్తీస్‌గఢ్ తరహాలో ఏదైనా ఏజెన్సీతో పీపీఏ జాయింట్ సర్వేను తక్షణమే చేపట్టాలి. పూడిక ప్రభావం సహా నది క్రాస్–సెక్షన్లను కొత్తగా తీసుకొని ఉమ్మడి సర్వే చేసి ముంపును అంచనా వేయాలి.
- పోలవరం ప్రాజెక్టు కారణంగా 2022 జూలైలో తెలంగాణలో సంభవించిన వరదల ప్రభావాన్ని సీడబ్ల్యూసీ అంగీకరించడం లేదు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ఆపరేషన్ షెడ్యూల్ నిబంధనలకు కట్టుబడి ప్రాజెక్టు పూర్తయ్యాక ఆ ప్రభావం ఉండదని వాదిస్తోంది. పోలవరం బ్యాక్‌వాటర్‌తో వరద ప్రభావం ఉండనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి సర్వే తర్వాత పుణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్, ఇతర నిపుణులతో వీలైనంత త్వరగా సంబంధిత మోడల్ అధ్యయనాలను చేయించాలి.
- ఆలోగా పోలవరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయడం, నిర్వహించడం చేపట్టకూడదు.

ఎన్ని'కళ' కమలం

▶ మొదటి పేజీ తరువాయి

రానున్నారు. మే నెలలో కూడా ప్రధాని మరోసారి రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉంది. ఈ పర్యటనలో భాగంగా వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్క్, రైల్వే వ్యాగన్ తయారీ యూనిట్ తదితర పనులకు శంకుస్థాపన చేస్తారని సమాచారం.

పలు అంశాలపై ఆందోళన కార్యక్రమాలు

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంతో పాటు.. కేసీఆర్ సర్కార్ వైఫల్యాలు, ఎన్నికల హామీలు అమలు చేయపోవడం, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, తదితర అంశాలపై మండలాలు, నియోజకవర్గాల వారీగా ఆందోళన కార్యక్రమాల నిర్వహణకు బీజేపీ నిర్ణయించింది. రాష్ట్రంలోని 34,902 పోలింగ్ బూత్ కమిటీల నియామకాన్ని ఈ నెల 5వ తేదీలోగా పూర్తి చేయనుంది. 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి పోలింగ్ బూత్‌లో పార్టీ పతాకావిష్కరణ నిర్వహించనుంది. అదేరోజు ఉదయం 9 గంటలకు బూత్ కమిటీలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడతారు. 11న పూలే జయంతి, 14న డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అగ్రనేతల ఫుల్ ఫోకస్

ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనలు దాదాపు ఖరారవగా..కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా కూడా రాష్ట్రంలో పర్యటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని సంసిద్ధం చేయడం, నేతల మధ్య సమన్వయాన్ని మెరుగు పరచడం తదితర అంశాలపై బీజేపీ అధినాయకత్వం దృష్టి పెట్టింది. 'మిషన్ తెలంగాణ–90' (తొంభై సీట్లలో గెలుపు లక్ష్యం) కార్యాచరణ ప్రణాళిక అమలు ఎలా జరుగుతోంది? అన్న దానిపై, అలాగే పోలింగ్ బూత్ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అమిత్‌షా ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నట్టు విశ్వసనీయ సమాచారం. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీని గట్టెక్కించే పనిలో నిమగ్నమైన అమిత్‌షా, తెలంగాణలో పార్టీని అధికారంలోకి తేవడానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఫిబ్రవరిలో 'స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్' జరిగిన తీరుపై సవివరమైన నివేదిక సమర్పించాల్సిందిగా రాష్ట్ర పార్టీని నడ్డా ఆదేశించినట్టు తెలిసింది. జిల్లాల వారీగా చేపడుతున్న కార్యక్రమాలు, ఎన్నికలకు సన్నద్ధమౌతున్న తీరుపై జిల్లాల అధ్యక్షులతో నేరుగా సమీక్షలు నిర్వహించనున్నట్టు సమాచారం. 'బూత్ సశక్తికరణ్ అభియాన్' ఎంతవరకు వచ్చింది? తదితర అంశాలను కూడా సమీక్షించనున్నారని తెలిసింది.

పూలే దంపతుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: జాజుల

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావుకు జాజుల లేఖ రాశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంగా బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్..మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి విగ్రహాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, దాదాపు 9 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ విగ్రహాలను ఏర్పాటు చేయలేదన్నారు. ఈ నెల 11న పూలే జయంతి సందర్భంగా విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జాజుల కోరారు.

క్లుప్తంగా...

బీసీ బిల్లు కోసం జూలైలో పార్లమెంట్ ముట్టడి



సాక్షి, న్యూఢిల్లీ: బీసీ బిల్లు ప్రవేశపెట్టాలంటూ జూలైలో పార్లమెంట్‌ను ముట్టడించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ బిల్లు సాధనకు నాలుగు లక్షల మంది బీసీలతో ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. బీసీల డిమాండ్ నెరవేర్చాలంటూ సంఘం కన్వీనర్ జబ్బాల శ్రీనివాస్ నేతృత్వంలో సోమవారం ఇక్కడి జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన మహాధర్నాను ఉద్దేశించి ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో సామాజిక కులాలన్నింటికీ జనాభా ప్రకారం వాటాలు ఇవ్వడమే సామాజిక న్యాయమని అన్నారు. ఉత్పత్తి కులాలైన బీసీలు దేశ సంపద సృష్టిస్తున్నారే, కానీ దానిని అనుభవించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల స్థితిగతులపై మరోసారి అధ్యయనం జరిపించి రాజ్యాంగబద్ధమైన హక్కులు, వాటా కల్పించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని కేంద్రం గణాంకాలే చెబుతున్నాయన్నారు. ఎస్సీ ఎస్టీల జనగణన చేస్తున్నప్పుడు బీసీల విషయంలో అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. ప్రత్యేక మంత్రిత్వశాఖ, పదోన్నతుల్లో రిజర్వేషన్లు తదితర డిమాండ్లను కేంద్రం వెంటనే ఆమోదించాలని ఆర్.కృష్ణయ్య కోరారు.

ప్రజల్లోకి వెళ్లాలి: కాసాని

సాక్షి, హైదరాబాద్: పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ పార్టీ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉన్నప్పుడే గుర్తింపు లభిస్తుందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి వివిధ పార్టీలకు చెందిన పలువురు మహిళా నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీపీతో వివిధ వర్గాలకు రాజకీయాల్లో గుర్తింపు లభించిందన్నారు. పార్టీలో నాయకులుగా తయారైన వారు ప్రస్తుతం అన్ని పార్టీలలో ఉన్నారన్నారు.

సింగరేణి టర్నోవర్ రూ.32,830 కోట్లు

గత ఏడాదికంటే 23 శాతం వృద్ధి ● సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ 2022–23లో 23 శాతం వృద్ధితో రూ.32,830 కోట్ల టర్నోవర్ సాధించి రికార్డు సృష్టించింది. 2021–22లో సంస్థ రూ.26,619 కోట్ల టర్నోవర్ సాధించింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు 2013–14లో సాధించిన రూ.12 వేల కోట్ల టర్నోవర్‌తో పోల్చితే 2022–23లో 173 శాతం వృద్ధిని నమోదు చేసినట్టు సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను సంస్థ అధికారులు, కార్మికులను అభినందించారు. 10 కొత్త గనులను ప్రారంభించడం తోపాటు బొగ్గు అమ్మకాలను 8 రాష్ట్రాలకు విస్తరించడం, సంస్థ థర్మల్, సోలార్ విద్యుత్ రంగాల్లో కూడా ప్రవేశించడంతో టర్నోవర్ గణనీయంగా పెరిగిందన్నారు. 2022–23లో బొగ్గు అమ్మకాల్లో 25 శాతం వృద్ధి రేటుతో రూ. 28,459 కోట్లను, థర్మల్ విద్యుత్ విక్రయాల్లో 13 శాతం వృద్ధితో రూ.4,371 కోట్లను సాధించింది. 2021–22లో బొగ్గు అమ్మకాలతో రూ. 22,740 కోట్లను, థర్మల్ విద్యుత్ విక్రయాలతో రూ. 3,879 కోట్లను ఆర్జించింది. 2023–24లో 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, ఆ తర్వాతి రెండేళ్లలో 80 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంటుందని శ్రీధర్ పేర్కొన్నారు. మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తయితే 2026–27 నాటికి సంస్థ రూ.50 వేల కోట్ల టర్నోవర్‌ను చేరుకుంటుందన్నారు.

4 గనులను తిరిగి కేటాయించే అవకాశం

కేంద్రం వేలంలో పెట్టిన 4 సింగరేణి గనులను తిరిగి సంస్థకి కేటాయించే విషయంలో సానుకూలత కనిపిస్తోందని శ్రీధర్ పేర్కొన్నారు. ఐదేళ్లలో ప్రైవేటు బొగ్గు కంపెనీలతో ప్రభుత్వ బొగ్గు సంస్థలకు గట్టి పోటీ తప్పదని, దీనిని తట్టుకోవాలంటే ఉత్పత్తి వ్యయం భారీగా తగ్గించుకోవాలని సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన సమీక్షలో సూచించారు.

'స్వమిత్వ' అమలుకు చర్యలు తీసుకోండి

సీఎం కేసీఆర్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్వమిత్వ(గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు సంబంధించిన ఆస్తి ధ్రువీకరణపత్రాలు అందించే) పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రజలకు వారి గృహ సంబంధిత ఆస్తి ధ్రువీకరణ పత్రాలు అందించి, తద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావాలన్న ఉద్దేశంతో కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. 2021 ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా "సర్వే ఆఫ్ విలేజెస్ ఆబాది – మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ (స్వమిత్వ)"పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారని తెలిపారు. ఈ పథకం కింద పొందిన ఆస్తి ధ్రువీకరణ పత్రాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు, ఇతర ప్రయోజనాలను పొందటానికి వీలుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ రికార్డులు గ్రామీణాభివృద్ధి ప్రణాళికకు ఉపయోగపడతాయని, వీటి ద్వారా ఆస్తి వివాదాలు కూడా తగ్గిపోయే అవకాశం ఉందని తెలిపారు. మార్చి 2025 నాటికి దేశంలోని అన్ని గ్రామాల్లో ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ 19న కేంద్రంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఒప్పందం అనంతరం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకున్న రాష్ట్రంలోని 5 గ్రామాల్లో డ్రోన్ సర్వేను విజయవంతంగా నిర్వహించి, ఆస్తులకు సంబంధించిన మ్యాపులను రూపొందించారని పేర్కొన్నారు.

వీఆర్వో పోస్టుల రద్దు జీవో కొట్టేయండి

హైకోర్టులో వీఆర్వోల వాదన

సాక్షి, హైదరాబాద్: వీఆర్వో పోస్టులను తొలగిస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవోను కొట్టివేయాలని కోరుతూ వీఆర్వోల తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందించడంలో వీఆర్వోల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. రెవెన్యూశాఖలో ఖాళీలున్నా తమను ఇతర శాఖల్లోకి పంపడం అన్యాయమని వీఆర్వోలు హైకోర్టులో పలు పిటిషన్లు వేశారు. 2022 జూలై 23న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 121ను రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్లపై గతంలో విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం.. వీఆర్వోలను ఇతర శాఖలకు తరలించడంపై స్టే విధించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం సోమవారం మళ్లీ విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు పూర్తయ్యాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు కౌటూరు పవన్‌కుమార్, చిక్కుడు ప్రభాకర్, పీవీ కృష్ణయ్య వాదనలు వినిపించారు. సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను ఏప్రిల్ 20కి వాయిదా వేసింది.

భావి తరాల కోసం 'కూల్‌రూఫ్'



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

కూల్ రూఫ్ పాలసీని తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు. కూల్‌రూఫ్ పాలసీ ఉంటేనే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇచ్చేలా నిబంధనలను మారుస్తామన్నారు. 600 గజాల్లోపు విస్తీర్ణంలో నిర్మించుకొనే ఇళ్లకు కూల్‌రూఫ్ విధానాన్ని ఆప్షన్‌గా ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లపై కూల్‌రూఫ్ విధానం అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లు మొదలైన వాటిని ఈ విధానం ద్వారానే నిర్మించనున్నట్లు వివరించారు.

తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొనే...

రాష్ట్రంలో దాదాపు 50 శాతం జనాభా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తోందని, దేశంలోనే మూడవ అతిపెద్ద పట్టణీకరణ రాష్ట్రంగా ఉన్న తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కూల్‌రూఫ్ విధానాన్ని అమల్లోకి తెచ్చినట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు. 2030 నాటికి హైదరాబాద్‌లో 200 చదరపు కిలోమీటర్లు, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో 100 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కూల్ రూఫింగ్ కిందకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం జీహెచ్ఎంసీ పరిధిలో 5 చదరపు కిలోమీటర్ల మేర, ఇతర పట్టణాల్లో 2.5 కిలోమీటర్ల మేర కూల్ రూఫ్‌ను అమలు చేస్తామన్నారు.

పట్టణాల్లో వేడిని తగ్గించాలి..

పట్టణాల్లో జరిగే నిర్మాణాల వల్ల ఉత్పన్నమవుతున్న వేడిని ఎదుర్కోవడానికి వాతావరణ అనుకూలమైన శీతలీకరణ పరిష్కారాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పాతకాలంలో పెంకుటిళ్లు, డంగు సున్నం, మట్టి గోడలు వేడిని ఆపాయని... ప్రస్తుతం భవన నిర్మాణాల్లో విచ్చలవిడిగా వినియోగిస్తున్న ఇనుము, స్టీల్, ఇతర ఖనిజాలతో వేడి పెరిగిందన్నారు. భవిష్యత్ వాతావరణ సవాళ్లను పరిష్కరించే దిశలో రూఫ్ కూలింగ్ పాలసీ తప్పనిసరని చెప్పారు.

పెట్టుబడి తిరిగి వచ్చేస్తుంది..

కూల్‌రూఫ్ విధానం అమలు కోసం చదరపు మీటర్‌కు రూ. 300 మాత్రమే ఖర్చవుతుందని మంత్రి కేటీఆర్ వివరించారు. ఈ విధానం వల్ల ఏసీ ఖర్చులు, కరెంట్ బిల్లులు తగ్గే అవకాశం ఉన్నందున పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందన్నారు. తన ఇంటి మీద కూల్ రూఫింగ్ కోసం పెయింటింగ్ చేసినట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు. కూల్ రూఫ్ కోసం ముందుకొచ్చే వారికి శిక్షణ అందించేందుకు పురపాలక శాఖ సిద్ధంగా ఉందన్నారు. త్వరలో 'మన నగరం'అనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు చెప్పిన మంత్రి కేటీఆర్... దీనిలో భాగంగా భవన నిర్మాణ వ్యర్థాలను సేకరించి వాటిని కూల్ రూఫింగ్‌కు దోహదపడే సామగ్రిగా మార్చి ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జీహెచ్ఎంసీ మేయర్ జి. విజయలక్ష్మి, కూల్‌రూఫ్ నిపుణులు, ప్రొఫెసర్ విశాల్ గార్గ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూయార్క్ లక్ష్యంకన్నా మిన్నగా...

విదేశాల్లోకన్నా అధిక విస్తీర్ణంలో తెలంగాణలో కూల్‌రూఫ్ పాలసీని తీసుకురావాలని నిర్ణయించినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. అమెరికాలోని న్యూయార్క్ కూల్‌రూఫ్ నిర్దేశిత లక్ష్యం 10 లక్షల చదరపు అడుగులు లేదా 0.1 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం అయితే కేవలం హైదరాబాద్, ఔటర్ రింగ్‌రోడ్డు కింద 1,000 చదరపు కిలోమీటర్ల కంటే ఎక్కువ వైశాల్యం ఉందని, ఔటర్ లోపల 20 శాతం ప్రాంతాన్ని కూల్ రూఫింగ్ కిందకు తీసుకురానున్నట్లు చెప్పారు.



'బలగం' సిద్ధం చేద్దాం

మండల, జిల్లా కమిటీల ఏర్పాటుపై టీపీసీసీ దృష్టి

- ఈ నెల 20లోపు మండల కమిటీలకు ప్రతిపాదనలు పంపాలి
- ఒక్కో కమిటీలో అధ్యక్షుడు సహా 27 మంది
- ప్రతి గ్రామం నుంచి ఇద్దరు లేదా కనీసం ఒకరికి చోటు
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళా రిజర్వేషన్లు పాటించాలి
- మండల కమిటీలు పూర్తి కాగానే జిల్లా కమిటీల నియామకం

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి బలగాన్ని సిద్ధం చేస్తోంది. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం మండల, జిల్లా కమిటీల ఏర్పాటుపై టీపీసీసీ దృష్టి సారించింది. అందులో భాగంగా ఈనెల 20లోపు రాష్ట్రంలోని అన్ని మండలాల పార్టీ కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని పార్లమెంటు ఇన్‌చార్జులను ఆదేశించింది. సామాజిక సమతుల్యతను పాటించడంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు ప్రాతినిధ్యం లభించేలా చూడాలని సూచించింది. మండల కమిటీల ఏర్పాటు అనంతరం జిల్లా కమిటీలను కూడా నియమించనున్న టీపీసీసీ.. సంస్థాగత నిర్మాణ ప్రక్రియను రెండు నెలల్లో ముగించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

డీసీసీల సమన్వయంతో...


పార్టీ జిల్లా అధ్యక్షులను సమన్వయం చేసుకుంటూ ప్రతిపాదనలు పంపాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. ఈ మేరకు సోమవారం పార్లమెంటు ఇన్‌చార్జిలకు లేఖలు రాశారు. ప్రతి కమిటీలో మండలాధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారితో పాటు ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, 21 మంది సభ్యులను తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు కలిపి 25 శాతం, ఓబీసీలకు 25 శాతం తగ్గకుండా పదవులు ఇవ్వాలని, మండల కమిటీ సభ్యుల్లోని 21 మందిలో కనీసం ఆరుగురు మహిళలుండాలని స్పష్టం చేశారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఇద్దరు లేదంటే కనీసం ఒక్కరైనా కమిటీలో ఉండాలని, అన్ని వర్గాలకు కమిటీల్లో ప్రాతినిధ్యం లభించేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 20 కల్లా గాంధీభవన్‌కు ప్రతిపాదనలు అందితే.. ఆ తర్వాత 10 రోజుల్లో కమిటీలను అధికారికంగా ప్రకటించనున్నారు. అప్పటిలోగా కమిటీలు ఎక్కడ ప్రకటించినా చెల్లుబాటు కావని, మండల కమిటీలను ఏర్పాటు చేసే అధికారం డీసీసీ అధ్యక్షులకు లేదని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

వెంటనే జిల్లా కమిటీలు

మండల కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లా కమిటీలను నియమించనున్నారు. 'ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల సభ్యత్వం పూర్తికాగా, ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో ఎన్‌రోలర్లు క్రియాశీలంగా పనిచేస్తున్నారు. వీరితో పాటు మండల, జిల్లా కమిటీలను ప్రకటించడం ద్వారా ప్రతి ఒక్కరినీ ఎన్నికలకు సమాయత్తం చేయడంలో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టాం..'అని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు చెప్పారు. పోలింగ్ బూత్ స్థాయిలో ఎన్‌రోలర్లు, గ్రామ స్థాయిలో ఉండే పార్టీ నేతలు, మండల, జిల్లా కమిటీలు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు.. ఇలా అన్ని స్థాయిల్లో ఎన్నికలకు అవసరమైన బలగాన్ని సిద్ధం చేసుకుంటున్నామని అన్నారు.

ప్రధానికి పోస్టుకార్డు ఉద్యమం


టీపీసీసీ ఆధ్వర్యంలో ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సంపన్నుల జాబితాలో 609వ స్థానంలో ఉన్న వ్యక్తి ఎనిమిదేళ్లలో రెండో స్థానానికి ఎలా రావచ్చనే ఫార్ములా ఏంటో తమకూ చెప్పాలని టీపీసీసీ నేతలు ప్రధాని మోదీని కోరారు. తమ పార్టీ తరఫున ఎన్నికైన వ్యక్తి ఈ ప్రశ్నలను పార్లమెంటులో అడిగేందుకు అవకాశమివ్వాలని, దేశంలో ఓటర్లయిన తమకైనా బదులివ్వాలంటూ సోమవారం ఆయనకు లేఖ రాశారు. అదానీ స్కాంపై జేపీసీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో టీపీసీసీ చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమాన్ని సోమవారం గాంధీభవన్‌లో ప్రారంభించారు. ఏఐసీసీ కార్యదర్శి నదీమ్‌జావెద్, ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ మల్లు రవి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు శివసేనారెడ్డి, బల్మూరి వెంకట్, నాగరిగారి ప్రీతం, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్‌తోపాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎం ఉన్నారా?.. పాలన సాగుతోందా?

● బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసలు ప్రభుత్వాధినేతగా సీఎం ఉన్నారా? అసలు పాలన సాగుతోందా? అని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. మొత్తం పాలనను పడకేసేలా ఫక్తు రాజకీయాలు చేస్తూ సీఎం.. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. సోమవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ టెన్త్ ప్రశ్నపత్రం లీక్ కావడం ఏంటని నిలదీశారు. దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రప్రభుత్వం ఒక్క పరీక్ష కూడా సరిగా నిర్వహించలేని స్థితికి చేరుకున్నందున ఐటీశాఖ మంత్రికి కేబినెట్‌లో కొనసాగే నైతికహక్కు ఉందా? అని లక్ష్మణ్ ప్రశ్నించారు. కేటీఆర్ పొద్దున లేస్తే టెక్నాలజీ గురించి మాట్లాడతారని ఎద్దేవాచేశారు. సీఎంకు ఊర్లు తిరగడానికి సమయం ఉంటుంది కానీ, పేపర్ లీకేజీలు, తదితర విషయాలపై సమీక్షలకు టైమ్ ఉండదా? అని నిలదీశారు. కాగా, ఈనెల 8న ప్రధాని రాష్ట్ర పర్యటనను ముఖ్యంగా సికింద్రాబాద్ బహిరంగసభను దిగ్విజయం చేయాలని పార్టీ నేతలకు లక్ష్మణ్ సూచించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మోదీ కార్యక్రమానికి పార్టీపరంగా చేయాల్సిన సన్నాహాలపై జిల్లాల పార్టీ నేతలతో చర్చించారు.

క్లుప్తంగా...

విద్యామంత్రి రాజీనామా చేయాలి: సంజయ్

పదో తరగతి తెలుగు పేపర్ లీకేజీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: పదోతరగతి తెలుగు పరీక్ష పేపర్ లీకేజీకి రాష్ట్రప్రభుత్వమే బాధ్యత వహించాలని, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ కోసం కొందరు టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నా నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ఒక ప్రకటనలో విమర్శించారు. పదో తరగతి తెలుగు పేపర్ లీకేజీపై న్యాయ నిపుణులతో చర్చించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ లీకేజీ వెనకాల ఎంతటి వారున్నా వదిలిపెట్టవద్దని, బాధ్యులైన వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మిగిలిన పరీక్షలైనా ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు రాసేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వంలో పరీక్షల పేపర్ లీకేజీలు సర్వసాధారణంగా మారినట్లు కన్పిస్తోందని, తెలంగాణలో లీకేజీల జాతర నడుస్తోందని ఎద్దేవా చేశారు. పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించలేని చేతగాని ప్రభుత్వం ఇంకా కొనసాగుతుండటం దురదృష్టకరమని మండిపడ్డారు. 11 పేపర్లుగా కొనసాగుతున్న టెన్త్ పరీక్షల విధానాన్ని 6 పేపర్లకే కుదించడంతో విద్యార్థుల్లో ఇప్పటికే ఒత్తిడి కన్పిస్తోందని, ఈ లీకేజీ ఘటనతో విద్యార్థుల్లో మరింత గందరగోళం నెలకొందని పేర్కొన్నారు.

పేపర్ లీకేజీ కాదు.. సంతలో అమ్మారు: ప్రవీణ్



కేయూ క్యాంపస్/నయీంనగర్/హనుమకొండ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ చేయలేదు.. పరీక్ష పత్రాలను సంతలో అమ్మినట్లు అమ్మారని బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి నిరుద్యోగ భరోసా కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు సుబేదారి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్పీ డీసీఎల్ వద్ద జూనియర్ లైన్‌మన్‌లు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపారు. ప్రవీణ్ ఆయాచోట్ల మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో సీఎం కుటుంబం కూడా ఉందన్నారు. అందుకే ఈ వ్యవహారంపై కేసీఆర్ ఇప్పటికీ నోరు విప్పడం లేదని విమర్శించారు. మంత్రి కేటీఆర్ మాత్రం ఇద్దరి ఉద్యోగుల పేర్లు చెబుతున్నారన్నారు. ఈ స్కామ్‌లో మొదటి నిందితుడిగా టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని చేర్చాల్సి ఉంటుందని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. దీనిపై రాష్ట్రపతికి కూడా ఈరోజే లేఖ రాశామన్నారు. జేఎల్ఎం నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని లేకుంటే ఇక్కడే కూర్చుంటామని చెప్పారు. రాష్ట్రం తగులబడుతుంటే బాధ్యత కలిగిన సీఎం కేసీఆర్ ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా పిరికి పందలా పారి పోయారని, ఇతర రాష్ట్రాల్లో తిరుగుతున్నారని ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే బహుజన రాజ్యంలో మండలానికి ఒక ఏసీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో అసలైన దొంగలు సురక్షితంగా ఉన్నారన్నారు.

విద్యాశాఖలో నలుగురు బదిలీ

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యాశాఖలో నలుగురిని బదిలీ చేస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వయోజన విద్య విభాగం డైరెక్టర్ విజయలక్ష్మీభాయ్‌ని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (ఎస్ఐటీ) డైరెక్టర్‌గా బదిలీ చేశారు. మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ జి.ఉషారాణిని వయోజన విద్య విభాగానికి, మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్‌గా సీహెచ్.రమణ కుమార్‌ను, పరీక్షల విభాగం డైరెక్టర్‌గా ఎ.కృష్ణారావును బదిలీ చేశారు.

నోటికొచ్చిందే ఫీజు!

ఇంటర్ అడ్మిషన్లలో కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల దందా

➡ హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ ఓ ప్రైవేటు ఉద్యోగి. ఆయన కుమారుడు ధీరజ్ ఓ ప్రైవేటు స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. ధీరజ్‌ను ఇంటర్మీడియట్‌లో చేర్చేందుకు శ్రీనివాస్ ఎల్‌బీనగర్ వైపున్న ఓ కార్పొరేట్ కాలేజీని (రెసిడెన్షియల్) సంప్రదించారు. ఏడాదికి రూ.2.10 లక్షల ఫీజు అని చెప్పడంతో నోరెళ్లబెట్టాడు. చేసేదేం లేక సమీపంలోని మరో కార్పొరేట్ యాజమాన్యానికి చెందిన కాలేజీలో సంప్రదించారు. అక్కడ ఏడాదికి రూ.2.20 లక్షలని చెప్పడంతో అవాక్కయ్యారు. డిసెంబర్, జనవరి సమయంలోనే వస్తే రూ.1.90 లక్షలకే సీటు ఇచ్చేవారమని, ఇప్పుడు సీట్లు నిండిపోతుండటంతో ఫీజు పెరిగిందని సదరు కళాశాలల సిబ్బంది చెప్పడం గమనార్హం.

➡ కరీంనగర్ జిల్లాకు చెందిన సుబ్రమణ్యం సింగరేణిలో చిన్న ఉద్యోగి. తన కుమార్తె మీనాక్షి కోసం షామీర్‌పేట ప్రాంతంలోని ఓ రెసిడెన్షియల్ కాలేజీలో సంప్రదించగా.. ఫస్టియర్‌కు రూ.2.40 లక్షలు, సెకండియర్‌కు రూ.2.60 లక్షలు ఫీజు ఉందని చెప్పారు. ఆలోచించుకొని రెండు రోజుల్లో వస్తానని సుబ్రమణ్యం చెప్పివచ్చారు. రెండు రోజుల తర్వాత మళ్లీ కాలేజీకి వెళ్లేసరికి సీట్లు లేవన్నారు. వస్తానని చెప్పాను కదా ఎలాగైనా సీటు కావాలని కోరగా.. సిబ్బంది సార్‌తో మాట్లాడతామని చెప్పి వెళ్లారు. కాసేపటికి వచ్చి ఫస్టియర్‌కు రూ.2.60 లక్షలు, సెకండియర్‌కు రూ.2.80 లక్షలు ఫీజుకు ఓకే అంటే సీటు ఇస్తామని తెగేసి చెప్పారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ

.. ఇది ఆ రెండు, మూడు కాలేజీల్లోనో, ఇద్దరు ముగ్గురు తల్లిదండ్రుల పరిస్థితి మాత్రమేనో కాదు.. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్, ప్రముఖ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్డగోలుగా వసూలు చేస్తున్న ఫీజుల బాగోతం, లక్షల కొద్దీ ఫీజులు కట్టడం కోసం సతమతం అవుతున్న తల్లిదండ్రుల ఆందోళన.

రూ.లక్షల్లో ఫీజులు.. ఇష్టారాజ్యంగా నిర్ణయాలు

- తల్లిదండ్రుల ఆశను సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలు
- ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ 2.70 లక్షల వరకు వసూళ్లు
- ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు
- పిల్లల భవిష్యత్తు కోసమంటూ నోరు మెదపని తల్లిదండ్రులు
- అప్పులు చేసి అయినా ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి



ఆశనే బలహీనతగా మార్చుకొని..

ఫలానా కాలేజీలోని ఫలానా బ్రాంచీలో ఇంటర్మీడియట్ చదివిస్తే జేఈఈలో, ఎంసెట్‌లో మంచి ర్యాంకులు వస్తాయని.. తద్వారా బీటెక్ సీటు మంచి కాలేజీలో వస్తుందన్న ఆశతో తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్, ప్రముఖ ప్రైవేటు కాలేజీల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఆశను కాలేజీలు సొమ్ము చేసుకుంటున్నాయి. నోటికే వచ్చిందే ఫీజు అన్నట్టుగా అడ్డగోలుగా నిర్ణయించి, రూ.10వేలు అడ్వాన్స్‌గా తీసుకొని రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి. అసలు పదో తరగతి పరీక్షలైనా జరగకముందే.. సీట్లు అయిపోతున్నాయంటూ తల్లిదండ్రులను ఆందోళనలోకి నెట్టేసి, అధిక ఫీజులను దండుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా అడిగేవారు లేరని, ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడమే లేదని విమర్శలు వస్తున్నాయి.

హైదరాబాద్ పరిసరాల్లోనే అత్యధిక కాలేజీలు

రాష్ట్ర ఇంటర్ విద్యాశాఖ పరిధిలోని 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, సంక్షేమ శాఖల పరిధిలోని 850 వరకు ఉన్న గురుకుల కాలేజీలతో పాటు 1,550 వరకు ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో ఐదు కార్పొరేట్, ప్రముఖ విద్యా సంస్థలకు చెందిన కాలేజీలే 300 వరకు ఉండగా.. వీటిలో 220 కాలేజీల దాకా హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోనే కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఏటా ఇంటర్ చదివే దాదాపు 5లక్షల మంది విద్యార్థుల్లో సగం మంది ఈ కాలేజీల్లోనే చేరుతున్నారు. ఆయా కాలేజీల్లో చదివిస్తే తమ పిల్లలకు మంచి చదువు వస్తుందని, మంచి ర్యాంకు వస్తుందన్న ఆశలతో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ అడిగినంత ఫీజు చెల్లిస్తున్నారు.

ఫీజు విధానం ఊసే లేక..

ఇంటర్ బోర్డు నిర్ణీత ఫీజుల విధానాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నాయి. ఇంటర్మీడియట్ వ్యవస్థ ఏర్పాటైనప్పుడు నిర్ణయించిన ఫీజు రూ.3 వేలలోపే. ఆ తర్వాత దానిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం సాధారణ ప్రైవేటు కాలేజీలు స్థాయిని బట్టి రూ.20 వేల వరకు వసూలు చేస్తుండగా.. కార్పొరేట్ కాలేజీలు హాస్టల్ వసతి కలుపుకొని రూ.1.50 లక్షల నుంచి రూ.2.70 లక్షల వరకు తీసుకుంటున్నాయి. 2009లో లవ్ అగర్వాల్ ఇంటర్ విద్య కమిషనర్‌గా ఉన్న సమయంలో ఫీజుల విధానానికి చర్యలు చేపట్టినా ముందుకు సాగలేదు. 2013లో ఐఏఎస్ అధికారి జేఎస్‌వీ ప్రసాద్ కమిటీ.. గ్రామీణ ప్రాంతాల్లో కనీసంగా రూ.3,500, పట్టణ ప్రాంతాల్లో గరిష్ఠంగా రూ.6,500 ఫీజు నిర్ణయించాలని సూచించింది. ఆ సిఫార్సులు ఆచరణలోకి రాలేదు. తర్వాత సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేశ్‌కుమార్ నేతృత్వంలోని కమిటీ కూడా ఇంటర్మీడియట్ ఫీజుల విధానాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వానికి నివేదించినా స్పందన లేదు.

పేపర్ లీకేజీపై ఈడీ ఆరా!

- టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లావాదేవీలపై ఈసీఐఆర్ నమోదు చేసే యోచన
- ఇప్పటికే ఈడీకి ఫిర్యాదు చేసిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తదితరులు



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రంగంలోకి దిగనున్నట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో ఈడీ అధికారులు కేసును దర్యాప్తు చేయనున్నట్టు తెలిసింది. పేపర్ లీకేజీలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని, విదేశాల నుంచి హవాలా రూపంలో నగదు లావాదేవీలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇటీవలే ఈడీ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కొందరు అభ్యర్థులు విదేశాల నుంచి గ్రూప్–1 పరీక్షకు హాజరయ్యారు. వీరంతా పేపర్ లీకేజీ ముఠాల నుంచి పేపర్ కొనుగోలు చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. వీటి నేపథ్యంలో మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

సిట్‌కు సమాంతరంగా ఈడీ దర్యాప్తు?

ఇప్పటికే సిట్ అధికారులు ఐపీసీ సెక్షన్లతోపాటు ప్రివెన్షన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మాల్‌ప్రాక్టీస్ యాక్ట్ కింద దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును ఆధారంగా చేసుకుని ఈడీ అధికారులు పీఎంఎల్‌ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్)కింద హవాలా లావాదేవీలపై ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేయనున్నట్టు తెలిసింది. సిట్ దర్యాప్తునకు సమాంతరంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. కాగా, ఈ కేసులో కీలక నిందితులు సహా మొత్తం 15 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈసీఐఆర్ నమోదు తర్వాత ఈడీ అధికారులు నిందితులను తమ కస్టడీకి తీసుకుని విచారణ చేసే అవకాశాలున్నట్టు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

సిబ్బందే లీక్ చేస్తారని ఊహించలేదు

▶ మొదటి పేజీ తరువాయి

టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి అధికారులు వెళ్లారు. సిట్ చీఫ్‌గా ఉన్న అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్ నేతృత్వంలో సీసీఎస్ ఏసీపీ కె.నర్సింగ్‌రావుతో కూడిన బృందం టీఎస్‌పీఎస్సీకి వెళ్లి మూడు గంటలకుపైగా చైర్మన్‌ను ప్రశ్నించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన ప్రవీణ్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లను అధికారులు తమ వెంట తీసుకువెళ్లారు. ప్రధానంగా టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల తయారీ, వాటి భద్రత తదితర అంశాలపైనే జనార్దన్‌రెడ్డిని విచారించారు.

పర్యవేక్షణ బాధ్యత నాదే: చైర్మన్

ప్రశ్నపత్రాల తయారీ, భద్రత పర్యవేక్షణ తనదేనని విచారణ సందర్భంగా చైర్మన్ పోలీసులకు తెలిపారు. ప్రతి పరీక్షకు సంబంధించి ప్రశ్నపత్రాల తయారీకి సెట్టర్స్‌గా పిలిచే నిపుణుల సహాయం తీసుకుంటామని, వారినే వ్యక్తిగతంగా కాన్ఫిడెన్షియల్ విభాగానికి ఆహ్వానిస్తామని వివరించారు. అక్కడకు వచ్చే వరకు ఒక సెట్టర్ విషయం మరొకరికి తెలియకుండా జాగ్రత్తలు ఉంటాయన్నారు. వారు రూపొందించిన ప్రశ్నపత్రం కాపీలను కస్టోడియన్ శంకరలక్ష్మి కంప్యూటర్‌లో భద్రపరుస్తారని, ఓ డిజిటల్ కాపీని సెక్షన్‌లోని లాకర్‌లో ఉంచడం ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ అని జనార్దన్ రెడ్డి సిట్ అధికారులకు తెలియజేశారు. తనతో పాటు కాన్ఫిడెన్షియల్ సెక్షన్ అధికారులే ప్రశ్నపత్రం తయారీలో ప్రత్యక్షంగా పాల్గొంటారని ఆయన వివరించారు. లీకేజీ వ్యవహారంలో కస్టోడియన్ నిర్లక్ష్యం సహా వివిధ అంశాలపై అంతర్గత విచారణ కూడా జరుగుతోందని, అది పూర్తయ్యాక వెలుగులోకి వచ్చే వివరాల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చైర్మన్ పేర్కొన్నారని తెలిసింది. వాంగ్మూల పత్రాలపై ఆయన సంతకాలు తీసుకున్న దర్యాప్తు అధికారులు వాటిని కోర్టులో దాఖలు చేయనున్నారు.

పరీక్షలు రాసిన ఉద్యోగులపైనా ఆరా

పరీక్షలకు హాజరైన టీఎస్‌పీఎస్సీ ఉద్యోగుల్లో ఎందరు అనుమతి పొందారనే అంశాన్నీ సిట్ సేకరిస్తోంది. కమిషన్ ఉద్యోగులు, సభ్యులకు బంధువులు, స్నేహితులు, కుటుంబీకుల్లో ఎవరైనా టీఎస్‌పీఎస్సీ పరీక్షలు రాశారా? వారి పరిస్థితి ఏంటి? తదితర వివరాలపైనా దృష్టిపెట్టింది. కమిషన్ కార్యాలయానికి వెళ్లిన సిట్ అధికారులు కాన్ఫిడెన్షియల్ సెక్షన్, కస్టోడియన్ చాంబర్‌తోపాటు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి, రమేష్, షమీమ్‌లు కూర్చునే సీట్ల వద్దా తనిఖీలు చేశారు. అక్కడ నుంచి కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

భద్రత పెంచాలని సూచించాం..

మా దర్యాప్తులో టీఎస్‌పీఎస్సీలో ఉన్న అనేక లోపాలను గుర్తించాం. ల్యాన్‌లో మార్పుచేర్పులు, యాక్సస్ కంట్రోల్, త్రీ స్టెప్ వెరిఫికేషన్ ఇలా అనేక ఆవశ్యకతలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లాం. సైబర్ ఆడిట్ సిఫార్సుల ప్రకారం భద్రత పెంచాలని సూచించాం.

– ఓ ఉన్నతాధికారి

తొలిరోజు 'పరీక్ష'లు



పరీక్ష బాగా రాశానని తల్లి స్నేహితురాలికి నవ్వుతూ బదులిస్తున్న ప్రణవ్‌తేజ్



తల్లి మృతదేహాన్ని చూసి నిశ్చేష్టుడై విలపిస్తున్న ప్రణవ్ తేజ్



విద్యార్థిని బైక్‌పై పరీక్ష కేంద్రానికి తీసుకొస్తున్న ప్రధానోపాధ్యాయుడు శంషొద్దీన్



ఉట్నూర్ పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థి గణేశ్

ఖమ్మం సహకారనగర్/ఆదిలాబాద్ రూరల్/కంగ్టి(నారాయణఖేడ్): ఖమ్మంలో ఉంటూ కండక్టర్‌గా పనిచేసే ఎక్కిరాల దేవమణిని ఆమె భర్త రాంబాబు కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం రాత్రి రోకలిబండతో మోది చంపేశాడు. ప్రైవేటు కళాశాల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న వీరి కుమారుడు ప్రణవ్‌తేజ్‌కు ఇది తెలిస్తే టెన్త్ తొలిరోజు పరీక్షకు హాజరు కాలేడని భావించిన బంధువులు.. విషయం చెప్పలేదు. పరీక్ష పూర్తయ్యాక నేరుగా మార్చురీ వద్దకు తీసుకెళ్లి తల్లి మృతదేహాన్ని చూపించడంతో ఒక్కసారిగా ఖిన్నుడయ్యాడు. అంతకు కొద్దిక్షణాల ముందే పరీక్ష బాగా రాశానని తనకెదురైన తన తల్లి స్నేహితురాలికి నవ్వుతూ ప్రణవ్ బదులివ్వడాన్ని చూసి బంధువులు కంటతడి పెట్టారు.

- సంగారెడ్డి జిల్లా కంగ్టిలోని పరీక్ష కేంద్రానికి అక్కడి జెడ్పీ స్కూలు నుంచి 217 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. అయితే సమయమవుతున్నా ఓ విద్యార్థి రాలేదు. వెంటనే అతడి చిరునామా గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు శంషొద్దీన్.. బైక్‌పై దగుల్‌వాడిలోని విద్యార్థి ఇంటికి వెళ్లి కేంద్రానికి తీసుకొచ్చారు. ఒక్క విద్యార్థి కూడా గైర్హాజరు కాకూడదనే కలెక్టర్ ఆదేశాలతోనే ఇలా చేసినట్టు సిబ్బంది చెప్పారు.
- మర్సుకోల గణేశ్ (ఆదిలాబాద్ జిల్లా అంకోలి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి) సోమవారం ఉదయమే ఫిట్స్ రావడంతో ముఖం, కాలుకు గాయాలయ్యాయి. పరీక్షకు హాజరు కాలేకపోతే విద్యా సంవత్సరం వృథా అవుతుందని భావించిన హిందీ ఉపాధ్యాయుడు అశోక్.. బాధిత విద్యార్థి ఇంటికెళ్లి బైక్‌పై ఉట్నూర్ కేంద్రానికి తీసుకొచ్చారు. గణేశ్.. గాయాలతోనే పరీక్ష రాశాడు.
- నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ఇన్విజిలేటర్ కవిత సెల్‌ఫోన్‌తో విధులకు హాజరవడంతో ఆమెను విధుల నుంచి తప్పించి, ఆరు నెలల పాటు సస్పెన్షన్ వేటు వేశారు.

అరకొర వసతులతో అవస్థలు

పలు పరీక్ష కేంద్రాల్లో కనీస వసతుల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు జెడ్పీ పాఠశాల పరీక్ష కేంద్రంలో విద్యుత్ లేక విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు. చివరకు ఉదయం 10.10 గంటల సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 56 మంది విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరంలోని ఉప్పుసాక కేంద్రానికి కాలినడకనే చేరుకోవాల్సి వచ్చింది. ఇదే మండలంలోని యానంబైలు పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు 3 కిలోమీటర్లు నడిచి కిన్నెరసాని ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రానికి వెళ్లారు. మరికొన్నిచోట్ల ప్రైవేటు వాహనాల్లో విద్యార్థులు కిక్కిరిసి ప్రయాణించడం కనిపించింది.

యువత కోసం 'టీ సేవ్'



- రాజకీయాలు పక్కన పెట్టి ప్రతిపక్షాలు అన్నీ ఏకం కావాలి
- అధ్యక్షుడిగా కోదండరామ్ ఉన్నా అభ్యంతరం లేదు
- వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల

సాక్షి, హైదరాబాద్: యువత కోసం తెలంగాణ స్టూడెంట్స్ యాక్షన్ ఫర్ వేకెన్సీస్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ఫోరం(టీ సేవ్)ను ఏర్పాటు చేద్దామని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రతిపాదించారు. ఇందులో అన్ని రాజకీయ పార్టీలు ఉంటాయని పేర్కొంటూ.. ప్రతిపక్షాలన్నీ భాగస్వామ్యం కావాలని ఆమె కోరారు. సోమవారం లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో షర్మిల మీడియాతో మాట్లాడారు. టీ సేవ్‌కు ఎవరు నాయకత్వం వహించినా తనకు అభ్యంతరం లేదన్నారు. ''రాజకీయాలకు అతీతంగా ఉన్న వ్యక్తులను పెట్టినా ఫర్వాలేదు.. ఎన్నో ఉద్యమాలను లీడ్ చేసిన కోదండరామ్ అయినా అభ్యంతరం లేదు''అని స్పష్టం చేశారు. రాజకీయాలకతీతంగా నిరుద్యోగుల కోసం నిలబడాల్సిన అవసరముందని... ఇందుకు జెండాలు వేరైనా ఒక్క ఎజెండాతో కలిసి పోరాడదామని పిలుపునిచ్చారు. ఈ నెల 10వ తేదీన సమావేశమై నిర్ణయం తీసుకుందామని, ఈ విషయంలో ప్రతిపక్షాలు అన్నీ కలిసి రావాలని ఆమె కోరారు. ''టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్‌పై సిట్ వేశామని చెబుతున్నారు. అప్పట్లో డ్రగ్స్ కేసు, నయీం కేసు, జూబ్లీహిల్స్ మైనర్ రేప్ కేసు.. ఇలా ఎన్నో కేసులను నీరుగార్చారు.. ఇప్పుడు లీకేజీపై కూడా వేసిన సిట్ వల్ల ఏం ప్రయోజనం లేదు''.. అని షర్మిల వ్యాఖ్యానించారు. కేసీఆర్ రెండో సారి సీఎం అయిన తర్వాత ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 6 నెలల్లో ఉద్యోగాలు భర్తీ చేస్తామని మంత్రి హరీష్ రావు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఎలక్షన్ ఇయర్‌లో భర్తీ చేస్తామంటే నమ్మడానికి మేమే మన్నా పిచ్చోళ్లమా అని ఆమె నిలదీశారు.

లీకేజీపై బీజేపీ టాస్క్‌ఫోర్స్ విచారణ

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై ఏర్పాటైన బీజేపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు వివరాలను సేకరించారు. కమిటీ చైర్మన్ విఠల్, సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు సోమవారం ఓయూ క్యాంపస్‌లో పర్యటించారు. వర్సిటీ గ్రంథాలయంలో విద్యార్థులు, నిరుద్యోగులతో సమావేశమయ్యారు. పేపర్ లీకేజీ వ్యవహారం, తదనంతర పరిస్థితులపై వారు తెలిపిన వివరాలను నమోదు చేశారు. అనంతరం టాస్క్‌ఫోర్స్ చైర్మన్ విఠల్ మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారం రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణమని, దీనిపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి లేదా సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

టెన్త్ పేపర్ అవుట్

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్సెస్సీ బోర్డు ముట్టడికి యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, వికారాబాద్ కలెక్టర్ వివరాలు వెల్లడించారు.

అసలేం జరిగింది?

పదవ తరగతి పరీక్షలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. తొలిరోజు తెలుగు పరీక్ష కోసం విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 9.30 నుంచి 12.30 గంటల వరకు జరిగే పరీక్ష కోసం 9.30కి ఇన్విజిలేటర్లు వారికి ప్రశ్నపత్రాలు ఇచ్చారు. వికారాబాద్ జిల్లా తాండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల–1లోని 5వ నంబర్ పరీక్ష హాల్లో కూడా అలాగే ఇచ్చారు. ఆ గదిలో శ్రీనివాసులు ఇన్విజిలేటర్‌గా పనిచేస్తున్నారు. అయితే అదే పాఠశాలలో రిలీవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బందెప్ప రూమ్ నంబర్ ఐదుకు వచ్చాడు. గైరుహాజరైన ఓ విద్యార్థికి చెందిన క్వశ్చన్ పేపర్ తీసుకుని శ్రీనివాసులుకు తెలియకుండా తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నాడు. తొలుత పొరపాటున ఓ వాట్సాప్ గ్రూప్‌కు పంపి వెంటనే డిలీట్ చేశాడు. 9.37 సమయంలో చెంగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు సమ్మప్పకు వాట్సాప్ ద్వారా పంపాడు. అతని ద్వారా ప్రశ్నపత్రం వేరే ఇతర వాట్సాప్ గ్రూపులకు, 11: 30 ప్రాంతంలో ఓ మీడియా వాట్సాప్ గ్రూప్‌కు వెళ్లింది. విలేకరులు కొందరు మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు అలాంటిదేమీ లేదని అన్నారు. కానీ పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థుల వద్ద ఉన్న పేపర్‌తో పోల్చి చూస్తే నిజమేనని తేలింది. దీంతో వారు అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

క్రిమినల్ కేసుల నమోదు

ఈ వ్యవహారంలో నలుగురిని సస్పెండ్ చేశామని, వీరిలో ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారిస్తున్నామని వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి సోమవారం సాయంత్రం విలేకరులకు చెప్పారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు, విద్యాశాఖ అధికారులు, అదనపు కలెక్టర్‌ను రంగంలోకి దింపామని తెలిపారు. విచారణలో తాండూరు–1 స్కూల్ నుంచి పేపర్ లీకైనట్లు గుర్తించామన్నారు. పేపర్ ఫోటోలు తీసిన బందెప్పతో పాటు అతను పేపర్ సెండ్ చేసిన సమ్మప్పను విధుల నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు నమోదు చేశామని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లను అనుమతించిన సెంటర్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ శివకుమార్ (ముద్దాయిపేట, యాలాల మండలం), చీఫ్ సూపరింటెండెంట్ కె.గోపాల్ (తాండూరు హైస్కూల్–1)ను కూడా సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రశ్నపత్రాన్ని ఫొటోలు తీసిన విషయాన్ని గమనించడంలో విఫలమైన శ్రీనివాస్‌ను ఇన్విజిలేషన్ విధుల నుంచి తొలగించటంతో పాటు అతనిపై కూడా తదుపరి విచారణ చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించామని తెలిపారు. లీకైన పేపర్‌ను ఉపయోగించి మాస్ కాపీయింగ్ చేసినట్లుగా ఎక్కడా ఎలాంటి ఆధారాలు లభించలేదని కలెక్టర్ వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగానే పేపర్ ఫొటోలు తీసి మరో ఉపాధ్యాయుడికి పంపినప్పటికీ.. విద్యార్థులు ఆ పేపర్ ద్వారా కాపీయింగ్‌కు పాల్పడినట్టు తేలలేదని స్పష్టం చేశారు.

ప్రశ్నపత్రం బయటకు వాస్తవమే..

టెన్త్ ప్రశ్నపత్రం లీక్‌పై పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన స్పందించారు. తాండూరు హైస్కూల్–1 నుంచి ప్రశ్నపత్రం మరో టీచర్‌కు వెళ్లిన మాట వాస్తవమేనని ఆమె తెలిపారు. అయితే పరీక్ష సమయంలో ఇతరులెవరూ లోపలికి రాలేదని, లోపలి నుంచి ఎవరూ బయటకు వెళ్లలేదని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపారని, బాధ్యులపై చర్యలు తీసుకున్నారని, విచారణ కొనసాగుతోందని చెప్పారు. మిగతా పరీక్షలన్నీ యథాతథంగా జరుగుతాయని తెలిపారు.

ప్రైవేటు స్కూళ్లతో మిలాఖత్?

ప్రశ్నపత్రం బయటకు వెళ్లిన వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత స్థాయి అధికారులు కూడా పరీక్ష హాల్లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లడం నిషేధం. అలాంటిది ఓ ఇన్విజిలేటర్ ఎలా తీసుకెళ్ళాడనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. అయితే అతని సెల్‌ఫోన్ ద్వారా వెళ్లిన ప్రశ్నపత్రం ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులకు కూడా వెళ్లినట్టు అనుమానిస్తున్న పోలీసు వర్గాలు ఈ దిశగా విచారణ చేపట్టాయి.

ఎస్సెస్సీ బోర్డు ముట్టడికి యత్నం

టెన్త్ ప్రశ్నపత్రం లీకేజీపై నిరసన వ్యక్తం చేస్తూ ఎన్ఎస్‌యూఐ ఎస్సెస్సీ బోర్డు ముట్టడికి ప్రయత్నించింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు చేసిన ప్రయత్నం ఉద్రిక్తతకు దారితీసింది. విద్యార్థులు కార్యాలయ బోర్డును ధ్వంసం చేశారు. దీంతో విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ మాట్లా డుతూ టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ మరువక ముందే మరో ప్రశ్నపత్రం లీక్ అవ్వడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ కార్యాలయం ఎదుట కూడా ఆందోళనకారులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు.

టెన్త్ జవాబు పత్రాల బండిల్ మాయం

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో టెన్త్ జవాబుల పత్రాల బండిల్ (కట్ట) మాయమైంది. ఎస్సై తెలిపిన వివరాలు... ఉట్నూరులో సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు 1,011 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష అనంతరం జవాబుపత్రాలను కట్టి, సీల్‌వేసి సెంటర్ నుంచి తీసుకెళ్లి ఉట్నూర్ పోస్టాఫీస్‌లో అప్పజెప్పారు. అక్కడి సిబ్బంది వాటిని ఆటోలో ఉట్నూర్ బస్టాండ్‌కు తరలించారు. బస్సులో వేసే ముందు వాటిని లెక్కించగా 11 బండిల్స్‌కు బదులు పది మాత్రమే ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, పోస్టాఫీస్ సిబ్బంది వాటిని వెతికే ప్రయత్నం చేశారు.

తొలి రోజు 99.60% హాజరు

సాక్షి, హైదరాబాద్: తాండూరులో ప్రశ్నపత్రం లీకేజీ కలకలం మినహా రాష్ట్రవ్యాప్తంగా టెన్త్ పరీక్షలు సోమవారం తొలిరోజు ప్రశాంతంగా జరిగినట్టు విద్యాశాఖ ప్రకటించింది. 99.60 శాతం హాజరు నమోదైనట్లు పదవ తరగతి పరీక్షల విభాగం తెలిపింది. మొత్తం 4,85,954 మంది టెన్త్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 4,84,019 మంది హాజరయ్యారని, 1,935 మంది గైర్హాజరయ్యారని తెలిపింది.



బందెప్పను విచారిస్తున్న తహసీల్దార్, ఎంఈఓ

గతంలోనూ వివాదాస్పదుడే..

తాండూరు నంబర్–1 పాఠశాలలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న బందెప్పకు వివాదాస్పదుడిగా పేరుంది. పాఠశాలకు చెందిన ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ.. ఐదేళ్ల క్రితం తల్లిదండ్రులు స్కూల్ ఆవరణలోనే దేహశుద్ధి చేశారు. అప్పట్లో అతనిపై పోక్సో చట్టం కింద కేసు కూడా నమోదయ్యింది. తాజాగా ప్రశ్నప్రతం లీక్ వ్యవహారంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



ఒక దేశ గొప్పతనం అక్కడి జంతువులను ఎలా చూసుకుంటున్నారు అనేదాన్ని బట్టి అర్థమవుతుంది.
– మహాత్మా గాంధీ

సాక్షి
మంగళవారం, ఏప్రిల్, 4

హడావిడిగా ఆరోగ్య చట్టం!

అత్యవసర సమయాల్లో రోగులు ముందుగా డబ్బు చెల్లించకపోయినా కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులలో తక్షణ వైద్య సేవలు అందేలా రాజస్థాన్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఆరోగ్య హక్కు చట్టంపై (రైట్ టు హెల్త్) అక్కడి వైద్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది! ఈ చట్టాన్ని నిరసిస్తూ లక్ష మందికి పైగా ప్రైవేటు డాక్టర్లు నిరవధికంగా సమ్మెను కొనసాగిస్తున్నారు. దాదాపు మూడు వేల ప్రైవేటు ఆసుపత్రులు వైద్య సేవల్ని నిలిపివేశాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ.ఎం.ఎ.) కూడా వైద్యుల నిరసనకు మద్దతు తెలపడంతో రాజస్థాన్‌లో గత రెండు వారాలుగా ప్రజారోగ్య వ్యవస్థ దాదాపుగా స్తంభించిపోయింది. అత్యవసర చికిత్స కోసం రోగులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆందోళన విరమించేది లేదని వైద్యులు, చట్టాన్ని వెనక్కు తీసుకునే ప్రసక్తి లేదని ప్రభుత్వం పట్టుపట్టి మెట్టు దిగడం లేదు.

2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే ఆరోగ్య హక్కు చట్టాన్ని తెచ్చామని రాజస్థాన్ ముఖ్య మంత్రి అశోక్ గెహ్లోత్ చెబుతున్నారు. ఎప్పుడో ఇచ్చిన హామీని మళ్లీ ఎన్నికలు వస్తున్న తరుణంలో నెరవేర్చడం వెనుక రాజకీయ ప్రయోజనాలు మాత్రమే కాక, రాష్ట్రంలో ప్రైవేటు ఆసుపత్రులన్నవే లేకుండా చేయాలన్న తలంపు కూడా ప్రభుత్వానికి ఉండివుండొచ్చని వైద్యులు ఆరోపిస్తున్నారు. మార్చి 21న రాజస్థాన్ అసెంబ్లీలో ఆరోగ్య హక్కు బిల్లు ఆమోదం పొందింది. వెనువెంటనే వైద్యుల నిరసనలు మొదలయ్యాయి. మార్చి 28న వైద్యులకు మద్దతుగా ఐ.ఎం.ఎ. రంగంలోకి దిగింది.

రాజస్థాన్ తెచ్చిన ఈ కొత్త ఆరోగ్య బిల్లు ప్రకారం, ఒక వ్యక్తి అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల కోసం వచ్చినప్పుడు ప్రైవేటు వైద్యులు వైద్య సేవల్ని నిరాకరించకూడదు. డబ్బు చెల్లించలేక పోయినా తక్షణం చికిత్సను అందించి తీరాలి. చికిత్సానంతరం ఆ బిల్లుల్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. అత్యవసర వైద్యం నిరాకరించిన ఆసుపత్రి లేదా వైద్యుడు తొలిసారి 10 వేలు, మళ్లీ అదే తప్పు చేస్తే 25 వేలు జరిమానా చెల్లించాలి. తప్పు మీద తప్పుకు ఆ మొత్తం అలా పెరిగిపోతూ ఉంటుంది.

అయితే రోగులకు ప్రభుత్వం కల్పించిన ఈ ఆరోగ్య హక్కు... వైద్యుల జీవించే హక్కును కాలరాసేలా ఉందని, రోగుల అత్యవసర పరిస్థితి ఎలాంటిదైనా కూడా తప్పనిసరిగా చికిత్సను అందించాలన్న చట్ట నిబంధన కారణంగా తమకిక కనీస విశ్రాంతి కూడా దొరకదన్నది వైద్యుల ఆందోళన. వైద్యాన్ని నిరాకరించిన డాక్టరుపై న్యాయపరమైన చర్యలకు దిగేందుకు సైతం అనుమతిస్తున్న తాజా బిల్లు కారణంగా వైద్యులకు వేధింపులు తప్పవనీ, తమపై తప్పుడు కేసులు కూడా నమోదయ్యే ప్రమాదం ఉందనీ ప్రైవేటు వైద్యులు కలవరపడుతున్నారు. అదే సమయంలో చట్టం లోని అంశాల విషయమై ప్రభుత్వం నుంచి మరింత స్పష్టతను డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కోసారి మామూలు తలనొప్పిగా అనిపించినది కూడా అత్యవసర స్థితిగా మారి మెదడులో రక్తస్రావానికి దారి తీస్తే అప్పుడేమిటి? అప్పుడు ఎంత బిల్లయినా ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందా? మరి వైద్య పరీక్షలకు అయ్యే ఖర్చుల మాటేమిటి? తలనొప్పి, కడుపునొప్పితో వచ్చినవారికి పరీక్షలన్నీ చేశాక అది ఎమర్జెన్సీ కేసు కాదని తేలితే ఆ వైద్య పరీక్షల ఖర్చును ప్రభుత్వం భరిస్తుందా? బిల్లును పంపిన ఎన్నాళ్లకు ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది? ఇవీ... సమ్మె బాట పట్టిన వైద్యుల ప్రాథమిక సందేహాలు. ప్రభుత్వం ఈ సందేహాలన్నిటినీ నివృత్తి చేయవలసిన అవసరం ఉంది. చట్టం ఉద్దేశం మంచిదే కావచ్చు. చట్టంలో అస్పష్టత లేనప్పుడే అది అమోద యోగ్యం అవుతుంది.

దేశంలోనే తొలిసారి రాజస్థాన్ ఇలాంటి చట్టం తెచ్చిందని ఆరోగ్యశాఖ మంత్రి ప్రసాద్ లాల్ మీనా గొప్పగా చెబుతున్నారు! అయితే ఇదేమీ పూర్తిగా కొత్తది కాదు. 2021లోనే తమిళనాడు ప్రభుత్వం... అన్ని ఆసుపత్రులూ బాధితులకు విధిగా అత్యవసర వైద్య సేవలను అందించేలా ఒక పథకం ప్రవేశపెట్టింది. ఆ పథకం కింద... బిల్లు చెల్లించలేని రోగుల తరఫున ప్రభుత్వమే ఆసుపత్రులకు రీయింబర్స్ చేస్తుంది. అయితే వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకంతో పోల్చడానికి ఈ రీయింబర్స్‌మెంట్ సరిపోదు. ఆరోగ్యశ్రీ పథకం వీటితో పోల్చితే అత్యంత ప్రభావవంతమైనది, విజయవంతమైనది. దీన్ని ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం మరింత మెరుగుపర్చడంతో పాటు ప్రభుత్వ వైద్యరంగాన్ని కూడా బలోపేతం చేయడంతో అది అన్ని రాష్ట్రాలకూ మోడల్‌గా ఆవిర్భవించింది.

రాజస్థాన్ విషయానికి వస్తే ఆరోగ్య హక్కు చట్టాన్ని అక్కడి ప్రభుత్వం హడావిడిగా తెచ్చినట్లు స్పష్టం అవుతోంది. అటు ప్రభుత్వ వైద్యరంగాన్ని పటిష్ఠం చేయడానికి ఏ ప్రయత్నం చేయకుండా, ఇటు ఆరోగ్యశ్రీ వంటి ఒక బృహత్తర పథకాన్ని ఆలోచించకుండా, ఆ రంగానికి సంబంధించిన ప్రముఖులతో చర్చించకుండా, వైద్యుల భయాలను సంపూర్ణంగా నివృత్తి చేయకుండా, రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిల్లును ఆమోదించినట్లు కనిపిస్తోంది. ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. బిల్లు అమలులోకి రావాలంటే గవర్నర్ ఆమోదం పొందాలి. ఆరోగ్య హక్కు చట్టం పరిధిలోకి వచ్చే ఆసుపత్రులేవో ప్రభుత్వం నిర్ణయించాలి. అప్పుడే రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ గురించి స్పష్టత వస్తుంది. ఈ అన్ని దశలలోనూ వైద్యులతో ప్రభుత్వం తప్పక చర్చించాలి. చర్చలకు హామీ ఇస్తూ, సమ్మె విరమించి వెంటనే విధులకు హాజరవాలని వైద్యులను కోరవలసిందీ, ఇందుకు తగిన చొరవ తీసుకోవలసిందీ ప్రభుత్వమే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు. చైత్ర మాసం, తిథి: శు.త్రయోదశి ఉ.7.44 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: పుబ్బ ఉ.9.24 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం: సా.5.12 నుండి 6.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.11 వరకు తదుపరి రా.10.53 నుండి 11.38 వరకు, అమృతఘడియలు: రా.3.30 నుండి 5.12 వరకు.

సూర్యోదయం : 5.57
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

కుల మతాల 'అంటు' లేని కాలం!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

మనిషి ఆధునికుడైనకొద్దీ విశాలం కావాల్సింది పోయి, సంకుచితంగా మారుతున్నాడు. తన కులం, తన ప్రాంతం అని గీతలు గీసుకుంటున్నాడు. ఈ మానవ స్వభావాన్ని అడ్డుపెట్టుకొని, దాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం మరింత రెచ్చగొట్టే రాజకీయ పార్టీలు ఉండనే ఉన్నాయి. దీంతో మనకు కులం, మతం అనేవి నిత్య పీడనగా మారిపోయాయి. కానీ ఇలాంటి అడ్డుగోడలు లేని కాలం ఉంటే ఎంత బాగుంటుంది! కేరళలోని 'పట్టణం'లో జరిపిన తవ్వకాలు ఇది కేవలం ఊహ కాదనీ, చారిత్రక నిజమనీ రుజువు చేస్తున్నాయి. కులమతాలతో సంబంధం లేని కాలం... దేవుళ్ళు, ఆయుధాలతో నిమిత్తం లేకుండా కేవలం ప్రకృతి జీవనంతో పెనవేసుకున్న ప్రజా సామాజిక జీవన వ్యవస్థ అక్కడ విరాజిల్లుతూ వచ్చిందని వెల్లడయ్యింది. దీనికి ప్రధాన కారణం – ప్రజలు తమను ప్రకృతి నుంచి వేరుగా భావించకపోవడమే.

మహాకవులు వేమన, పోతన ఎన్ని జీవన సత్యాలను పోతపోసి పోయారో చెప్పలేం:

"మర్మమెరుగలేక మతములు కల్పించి
ఉర్వి దుఃఖులగుదు రొకరికొకరు
గాజు ఇంట కుక్క కళవళ పడురీతి" అని వేమన అంటే, పోతనామాత్యుడు:

ఈ లోకం నుండి లోకేశులు, లోకస్థులు వెళ్లిపోయిన తరువాత లోకం కాని లోకాన్ని, చివరి 'అలోకా'న్ని అంటే పెను చీకటిని కూడా దర్శించడమేగాక, ఆ తరువాత వెలుగునిచ్చేవాడినే సరాసరి సేవిస్తానని ప్రకటించాడు! పోతన వాడిన 'పెను చీకటి' అంటే వైజ్ఞానిక శాస్త్రం నిరూపించిన 'డార్క్ మ్యాటర్' అనే!

కనుకనే వేమన 17వ శతాబ్దం నాటికే 'నీ శరీరంలోని జీవ తత్వాన్ని తెలుసుకోలేక అదెక్కడో వేరే ఉందని భావించి వెతుకుతావెందుకు వెర్రివాడా' అని ప్రశ్నించాడు. 'భానుడు (సూర్యుడు) ఒక వైపున దివ్యంగా కాస్తుండగా, వేరే దీపం పట్టుకొని చూడ్డం దేనికి' అని మెత్తగా చురక వేశాడు. ఈ పద్ధతి 'తెలివి' లేదా మూఢత్వం ఎలా ఉంటుందో కూడా మరో ఉదాహరణ ద్వారా వేమన చూపించాడు:

"తాము నిలుచు చోట దైవము లేదని
పామర జనులు తిరుపతుల తిరిగి
జోము (ఉన్న సుఖం) వీడి చేతి సొమ్మెల్ల పోజేసి
చెడి గృహంబు తాను చేరు వేమ"!

అంతేగాదు, ఈ ప్రపంచాన్ని 'అణువులే' శాసిస్తున్నాయన్న ఆధునిక వైజ్ఞానిక దృష్టిని కూడా ఆనాడే కనబరిచాడు వేమన!

ప్రకృతి ఆరాధకులు

ఇంత 'సోది'తో పాఠకులను ఎందుకు విసిగించవలసి వచ్చిందంటే, భారతదేశ చరిత్రలో ఇనుపరాతి యుగం, అనంతర ఇనుపరాతి యుగాలలో కేరళలో కులమతాలతో సంబంధం లేని కాలం... దేవుళ్ళు, ఆయుధాలతో నిమిత్తం లేకుండా కేవలం ప్రకృతి జీవనంతో పెనవేసుకున్న ప్రజా సామాజిక జీవన వ్యవస్థ విరాజిల్లుతూ వచ్చిందని వెల్లడయ్యింది. 'పట్టణం' పేరుగల ఊరిలో జరిపిన తవ్వకాల్లో కొలది రోజుల క్రితం ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇంతగా కుల, మతాలతో నిమిత్తం లేకుండా ఎదుగుతూ వచ్చిన ఆ కేరళ 'పట్టణం' చరిత్ర కేవలం ప్రకృతి ఆరాధనా చరిత్ర! అక్కడ జరిపిన తవ్వకాల ప్రకారం తెలుస్తున్న ఆ ప్రాచీన స్థల చరిత్రను బట్టి, సంస్థాగతమైన కులమతాల చరిత్రకు అది పూర్తి విరుద్ధ ప్రాంతంగా తేలింది! కుల వ్యవస్థలో అంతర్భాగంగా అంతస్తులుగా ఇముడుకుపోయిన అసమానత్వం ఇక్కడ పరిశోధకులకు కనిపించిన దాఖలా లేకపోవడం విశేషం! కాగా, ఈ అసమానతా ధోరణులు, కుల వ్యవస్థ నేటి కేరళలోనూ, మిగతా భారత రాష్ట్రాలలోని ఆధునిక వ్యవస్థల్లోనూ పెచ్చరిల్లడమే ఆశ్చర్యకరమని పరిశోధకులు పి.జె. చెరియన్, పి. దీపక్ రాస్తున్నారు.

రెండో మాట



విభజనల జాడలు లేవు

ఇక్కడి తవ్వకాలలో జరిపిన పరిశోధన ప్రకారం, ఇక్కడ దొరికిన లక్షలాది సిరామిక్ (పింగాణీ) ముక్కలు... మధ్యధరా సముద్ర ప్రాంత దేశాలలో, నైలునది, రెడ్ సీ, భారతదేశ తూర్పు, పశ్చిమ ప్రాంతాల, దక్షిణ చైనా సముద్ర ప్రాంతాలలో లభించిన పింగాణీ ముక్కలను పోలి ఉండటం విశేషం. ఈ అవశేషాలన్నీ క్రీ.పూ. 5వ శతాబ్ది నుంచి క్రీ.శ. 5వ శతాబ్ది మధ్యకాలం నాటివి. అంతేగాదు, ఈనాటి మాదిరిగా కాకుండా 'పట్టణం' నివాసులు కుల, మత హద్దులెరుగని శాంతికాముక ప్రజలుగా పరిశోధకులు నిర్ధారించారు. కులపోరులుగానీ, మతయుద్ధాలుగానీ ఆ ప్రజలు ఎరుగరు. ఈ పరిశోధనలో పాల్గొన్న పరిశోధక ఉద్దండులలో ఆక్స్‌ఫర్డ్ ప్రముఖులతోపాటు హైదరాబాద్ మాలిక్యులార్ బయాలజీ పరిశోధకులు కూడా ఉన్నారు. ఈనాడు సమాజాన్ని, సామాజిక వ్యవస్థల్ని కుల మతాల విభజనతో కుళ్లబొడిచి చీల్చుతున్న వైనం 'పట్టణం' చరిత్రలో మచ్చుకు కూడా మనకు కనిపించదని పరిశోధకులు తేల్చారు. దీనికి కారణం – సంస్థీకృత లేదా వ్యవస్థీకృత కులం, మతం అక్కడ లేకపోవడమే. అంతేగాదు, ఆనాటి ప్రజలు బహుముఖీన వ్యాపక వ్యవస్థలో ఉండి కూడా కులాతీతంగా, మతాతీతంగా జీవనం గడపడం అత్యంత ఆశ్చర్యకరమని పరిశోధకుల నిర్ణయం. దీనికి ప్రధాన కారణం – ప్రజలు తమను ప్రకృతి నుంచి వేరుగా భావించకపోవడమే.

అలాంటి సామాజిక వ్యవస్థతో పోల్చుకుంటే, ఈనాటి సమకాలీన ప్రపంచంలో పెక్కు సమస్యలకు ప్రధాన కారణం ప్రకృతి సహజ వనరులను విచ్చలవిడిగా దోచుకుపోవడమే. ఈ పరిస్థితిని 'పట్టణం' లాంటి ఆదర్శ సామాజిక వ్యవస్థ వ్యతిరేకించింది. సహజ వనరుల దోపిడీకి అడ్డుకట్ట వేసింది. అందుకే ప్రయివేట్ దోపిడీ వ్యవస్థను తమ స్వార్థ ప్రయోజనాల కోసం పాలకులు (వాళ్లు ఏ 'బ్రాండు'కు చెందినా) పెంచి పోషించే వ్యవస్థల్లో ఆ ఆదర్శ కులాతీత, మతాతీత సామాజిక వ్యవస్థలు నిలబడలేవు.

ప్రశ్నించే హక్కు మాయం

ఎక్కడివరకో అక్కర్లేదు – భారత పార్లమెంట్‌లో సగానికి (250 మందికి)పైగా అవినీతిపరులున్నారని అవినీతి నిరోధక జాతీయ పరిశోధనా సంస్థ అక్షరసత్యంగా జాబితాతో సహా పేర్కొన్నప్పటికీ వారిపై పాలక వ్యవస్థ చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. పైగా ఆ 'మచ్చ'ను రూపుమాపడానికి బదులు తానూ పూసుకొని సిగ్గువిడిచి తిరుగుతోంది. ఈ జాడ్యం అంతటితో ఆగలేదు. అసలు ప్రశ్నించే హక్కునే దేశ పౌరులకు దూరంచేసి రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన సమాచార హక్కు చట్టాన్నే మడిచి మడత పెట్టేసి తిరుగుతున్నారు పాలకులు. చివరికి రాజ్యాంగ చట్టం అనుమతించిన ప్రశ్నించే హక్కును కూడా పౌరులకు దూరం చేసేందుకు సాహసించారు.

అలాగే, మత మార్పిళ్లు ఎందుకు జరుగుతున్నాయో బుర్రపెట్టి ఆలోచించుకోమని వివేకానందస్వామి నెత్తిన నోరు పెట్టుకుని అనేక సార్లు బోధించినా, మనస్సుల్ని 'హిందుత్వ' మతతత్వానికి తాకట్టు పెట్టుకున్న పాలక వ్యవస్థలు విభిన్న మతాల వారిపై దౌర్జన్యాలను, దాడులను కొనసాగిస్తూనే ఉన్నాయి. చివరికి మంత్రుల 'డిగ్రీ'లను ప్రశ్నించడమే నేరమైపోయింది. రుజువు అడిగినందుకు సమాధానం చెప్పి నోరు మూయించే బదులు, అడిగిన వాడి నోటికి 'తాళం' వేసే సంస్కృతికి అలవాటు పడుతున్నారు. 'ఒక దేశం, ఒకే ఎన్నిక, ఒక ప్రధాని' అన్న నినాదంతో బయలుదేరిన పాలనా రథం చివరికి సుప్రీం కోర్టును కూడా తాను చెప్పిన జడ్జీలను నియమించాలన్న ఫర్మానాను అమలు పరచాలన్న మంకుపట్టుకు దిగింది. ఇందుకు వ్యతిరేకిస్తున్న సుప్రీంకోర్టుపై కన్నెర్ర చేస్తోంది కేంద్రం. ఈ విపరిణామాలు దేశానికీ, ప్రజా క్షేమానికీ, నిర్మలమైన పాలనా పద్ధతులకూ– ఒక్క ముక్కలో 'భారత ప్రజలమైన మేము' అన్న విస్పష్ట ప్రకటనతో ప్రజలు రూపొందించుకున్న రిపబ్లికన్ రాజ్యాంగ లక్ష్యాలకే పరమ విరుద్ధమైనవి. ఆ వెరపు ఉంటే దేశ పాలనా వ్యవస్థ తన చేష్టలను సవరించుకుని, 'పట్టణం' బాటలోకి రావాలి. గుణపాఠం తీసుకోవాలి. ఎందుకో మళ్లీ వేమన్నే గుర్తుకొస్తున్నాడు:

"అల్పబుద్ధి వానికి అధికారమిచ్చిన
దొడ్డవారి నెల్ల తొలగ గొట్టు"!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇంత అప్పా?



పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్ నివేదిక ప్రకారం, భారత ప్రజల రుణం 151 లక్షల కోట్ల రూపాయలు అయ్యింది. ఇది మన వార్షిక ఆదాయం కన్నా అరింతలు ఎక్కువ. ప్రజలు అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సిన సమయం ఇది!

– జవహర్ సిర్కార్, రాజ్యసభ ఎంపీ (తృణమూల్)

ఇంటి దారి



న్యూజిలాండ్ మాజీ ప్రధాని జసిండా ఆర్డెన్‌తో సమానంగా విషం చిమ్మే, ఇంకో వామపక్ష 'యూత్ ఐకాన్' ప్రధాని సన్నా మారిన్ ఫిన్‌లాండ్ సాధారణ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. మంచి విమోచన!

– అభిజిత్ అయ్యర్ మిత్రా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

అదేనా ప్రమాణం?



మీరు ఆఫ్రికన్‌గా ఉండి నాగరీకులుగా ఉండొచ్చు, మీరు ఇండియన్‌గా ఉండి నాగరీకులుగా ఉండొచ్చు, మీరు అరబ్‌గా ఉండి నాగరీకులుగా ఉండొచ్చు. నాగరికత అంటే పాశ్చాత్యీకరణ కాదు.

– అడేమోలా, పాన్–ఆఫ్రికనిస్ట్

తేడా తెలియదా?



చివరకు సైనిక కమాండర్ల సమావేశాన్ని కూడా ప్రధానమంత్రి రాజకీయాలు మాట్లాడటానికి వాడుకోవడం దురదృష్టకరం. అధికారిక, రాజకీయ వేదికల మధ్య తేడా చూడటాన్ని ఆయన తప్పకుండా నేర్చుకోవాలి.

– యశ్వంత్ సిన్హా, కేంద్ర మాజీ మంత్రి

ప్రదర్శన అవసరమా?



1977లో ఇందిరా గాంధీని అరెస్ట్ చేసినప్పుడు తనకు సంకెళ్లు వేసి జైలుకు తీసుకెళ్లాలని ఆమె పట్టు పట్టారు. ఎంపీగా రాజీనామా చేసినప్పుడు సోనియా గాంధీ దూకుడుతో కూడిన బల ప్రదర్శనకు దిగారు. ఇప్పుడు సూరత్ కోర్టులో అప్పీల్ కోసం రాహుల్ గాంధీ భారీ దళాన్ని వెంటబెట్టుకుని వెళ్లారు. ఇలాంటి సానుభూతి నిర్మించుకోవాలా? అది ఆయనకుగానీ, కాంగ్రెస్‌కు గానీ సాయం చేస్తుందా?

– పల్లవీ ఘోష్, సీనియర్ ఎడిటర్

ఇలాగా పోల్చడం?



ఒక మూర్ఖ ఉదారవాద అమ్మాయి ఒక సదాచార దిగంబర జైన గురువునూ, శరీరాన్ని వెల్లడించే దుస్తుల్లో ఢిల్లీ మెట్రోలో తిరుగుతున్న అమ్మాయినీ పోల్చుతోంది. దిగంబర గురువు దుస్తులను పరిత్యజించింది, ప్రాపంచిక సుఖాలను పరిత్యజించడం కోసం. కానీ ఆ అమ్మాయి విషయంలో అది పూర్తిగా వ్యతిరేకం. నైతికంగా కలుషితమైన జనాన్ని ఆధ్యాత్మికవేత్తలతో పోల్చడం మానండి.

– రాధారమణ్ దాస్, ఇస్కాన్ ప్రతినిధి

రస ప్రియులం



చూడండి, ఇక ఉపేక్షించేది లేదు. దీన్ని నాలోపల చాలా రోజుల్నించీ ఉంచుకున్నాను. ఇక చెప్పకపోతే నావల్ల అయ్యేట్టులేదు. సాంబార్ కంటే రసం గొప్పది. అంతే, చెప్పేశాను.

– శ్రేయా ధన్వంతరి, నటి

ఇన్‌బాక్స్

విద్యాహక్కు చట్టం

6 నుండి 14 సంవత్సరాలు గల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించడం కోసం భారత పార్లమెంట్ 2009 ఆగస్ట్ 4న ఆమోదించిన విద్యాహక్కు బిల్లు... ఆగస్టు 26 నాడు రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టం అయ్యింది. 2010 ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చింది. ఆర్టికల్ 21(ఏ)లో దీనిని పొందుపర్చారు. దీంతో విద్యను ప్రాథమిక హక్కుగా అందించే 135 దేశాల సరసన ఇండియా చేరింది. 7 అధ్యాయాలు, 38 సెక్షన్లు, ఒక అనుబంధ సెక్షన్ పొందు పరిచారు. బడుల మంజూరు, విద్య పని దినాలు, ఉపాధ్యాయ విధులు, ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు సీట్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

చట్టం అమలులోకి వచ్చి 14 సంవత్సరాలు అవుతున్నా నేటికీ పూర్తి స్థాయిలో అమలుకు విద్యా హక్కు చట్టం నోచుకోలేదు. బడుల మంజూరు చేయాలని చట్టంలో ఉంటే హేతుబద్ధీకరణ పేరుతో బడులు మూసివేయడం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా టెట్ పరీక్ష నిర్వహించాలని చట్టంలో ఉంటే సంవత్సరాలు గడిచాక టెట్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని చట్టంలో ఉంటే 10 సంవత్సరాలకు ఒకటి రెండుసార్లు నోటిఫికేషన్ జారీ చేస్తున్నారు. ఇలా ప్రతి విషయంలో విద్యా హక్కు చట్టం అమలు చేయడం లేదు. ఇప్పటికైనా విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు చేయాలి.

– రావుల రామ్మోహన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాస్వామ్యానికి గాంధీలు కావాలి!

అభిప్రాయం



సీతక్క
(ధనసరి అనసూయ)

రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై వేసిన అనర్హతవేటుతో దేశ ప్రజాస్వామ్యం చీకటిలోకి జారుకుంది. దేశంలో గాంధీల పేరు వినపడకుండా పన్నిన రాజకీయ కుట్రలో ఇది ఒక భాగం. రాహుల్ గాంధీ గత బడ్జెట్ సందర్భంగా బీజేపీ ప్రభుత్వ తీరును ఎండగట్టినందుకు కక్ష సాధింపు చర్యగా దీన్ని భావించవచ్చు. ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఆలోచించాల్సిన తరుణమిది.

తొమ్మిదేళ్ల పాలనలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు పార్లమెంట్‌లో ప్రశ్నిస్తోందని, ఈ కొత్త నాటకానికి తెరలేపింది బీజేపీ. లండన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో దేశ ప్రజల హక్కులను, ప్రజాస్వామ్య విలువలను బీజేపీ కాలరాస్తున్న విధానాలపై రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఇందుకు రాహుల్ క్షమాపణ చెప్పాలనే వాదనకు బీజేపీ దిగింది. అప్పటి నుంచే రాహుల్‌పై బీజేపీ కుట్ర మొదలైంది. అందుకు ఇతర కారణాలు కూడా లేకపోలేదు. ప్రధాని దేశ ప్రజల ఆస్తులను తన స్నేహితుడు అదానీకి అక్రమంగా కట్టబెడుతున్నారని రాహుల్ గాంధీ అనేకసార్లు ఆరోపించారు. ఇవి కేవలం ఆరోపణలు కాదు. 'అదానీ కంపెనీతో కుదుర్చుకునే ఏ ఒప్పందమైనా భారత ప్రభుత్వంతో కుదుర్చుకున్నట్టుగానే భావించా'లంటూ శ్రీలంక విదేశాంగ మంత్రి 'అలీ సబ్రీ' చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం. అదానీ గ్రూప్‌లోని ఏడు కంపెనీలలో రూ. 30,127 కోట్ల పెట్టుబడులు పెట్టింది ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ. జనవరిలో హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడిన తర్వాత ఎల్ఐసీ షేర్ల విలువ బాగా పడిపోయింది. వేల కోట్ల రూపాయలు నష్టం వచ్చింది. దానికి బాధ్యత వహించాల్సింది కేంద్ర ప్రభుత్వమే కదా.

2014–2022 మధ్య కాలంలో దేశం అభివృద్ధి చెందలేదు, కానీ కార్పొరేట్ కంపెనీలు మాత్రం బాగా ఎదిగాయి. దేశ ప్రజలపై ధరల భారం తగ్గలేదు. ప్రజల ఆదాయం, ఆస్తులు పెరగలేదు, కానీ కార్పొరేట్ల ఆదాయం లక్షల కోట్లు పెరిగింది. ప్రతి ఏడాదీ నిరుద్యోగులకు ఇస్తానన్న 2 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు బీజేపీ ప్రభుత్వ హయాంలో అరిగోస పడుతున్నారు.



వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు బీజేపీ మూడు నల్ల చట్టాలను తెచ్చింది. కానీ ఆ చట్టాలపై రైతులు తిరగబడటంతో చట్టాలను వెనక్కి తీసకుంది. గత తొమ్మిదేళ్లుగా దేశం అన్ని రంగాల్లో వెనుకబడిపోయింది. 'హంగర్ ఇండెక్స్'లో భారతదేశం, అఫ్గానిస్తాన్ కంటే దారుణస్థితిలో ఉంది. ఆకలి చావులు, పేదరికం, అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలు, రైతులకు సబ్సిడీలు తీసేయడం, వారికి బ్యాంకు రుణాలు అందించకపోవడం... ఇదీ బీజేపీ ప్రభుత్వ నిర్వాకం.

బీజేపీ విధానాలపై మాట్లాడిన కలాలు, గళాలపై కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారు. అందుకే దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని రాహుల్ గాంధీ చెప్పిన విషయం అక్షర సత్యం.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా కాంగ్రెస్ పార్టీ వందలాది ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేస్తే... బీజేపీ ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేస్తోంది. తక్షణమే దీన్ని ఆపి దేశ ప్రజలకు తప్పనిసరిగా బీజేపీ క్షమాపణ చెప్పాలి.

రాహుల్ గాంధీ 'భారత్ జోడో' యాత్ర ద్వారా ప్రజల గుండె చప్పుడు విన్నారు. ప్రజల ఆవేదన విన్నారు. మోదీ వైఫల్యాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ యాత్ర ఓట్ల కోసం, రాజకీయాల కోసం చేసిన యాత్ర కాదు, దేశాన్ని ఐక్యంగా ఉంచడం కోసం చేసినది. అటవీ సంపదను దోచుకుంటూ, అడవి బిడ్డల జీవితాలను నాశనం చేస్తూ, కార్పొరేట్లకు మైనింగ్ హక్కులు కట్టబెడుతోంది కేంద్రం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ ఉక్కు పరిశ్రమను కాంగ్రెస్ తీసుకువస్తే, నేడు బీజేపీ ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తోంది.


విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న నల్లధనాన్ని దేశానికి తెచ్చి ప్రతి ఒక్కరి అకౌంట్‌లో రూ. 15 లక్షలు వేస్తానని చెప్పిన ప్రధాని, నేడు ప్రతి ఒక్కరికి అప్పు అప్పజెప్పారు. కులం, మతం, ప్రాంతం, దేవుడు... ఇలా అన్నింటినీ రాజకీయం చేస్తూ, మనుషుల మధ్య కనీస మానవ సంబంధాలు కూడా లేకుండా బీజేపీ 'విభజించి పాలించు' సిద్ధాంతంతో దేశ ప్రజల్లో చిచ్చు పెడుతోంది. ఇటువంటి ప్రభుత్వ చర్యలపై గొంతెత్తాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. రండి పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప.

వ్యాసకర్త ఎమ్మెల్యే, ములుగు

రాజ లాంఛనం

రాచరికాలు రాజ్యం చేసే రోజుల్లో, రాజులనూ, వాళ్ళ వంశాన్నీ, వాళ్ళ గుణగణాలనూ, ఘన కార్యాలనూ అదేపనిగా పొగుడుతూ ఉండేందుకు వందిమాగధుల సిబ్బంది ఉంటూ ఉండేది. ఈ పొగడ్తలు, కార్యార్థులై వచ్చే 'కాకా'సురులు చేసే ముఖస్తుతులకు అదనం. ఈ 'రాజ లాంఛనం' ప్రపంచంలో అన్ని ప్రాంతాలలోనూ, అన్ని కాలాలలోనూ ఏదో ఒక రూపంలో ఉంటూ వచ్చిందే.

ఈ 'లాంఛనం' వెనక ఉద్దేశ్యం రాజుగారి అహంకారానికి మర్దన చేసి ఆయనకు సుఖం కలిగించటం మాత్రమే కాదు. ఇలాంటి నిత్య ప్రశంసల వల్ల ప్రజలకు కూడా తమ రాజు మీద గౌరవాదరాలు పెరిగి, ఆయన నాయకత్వంలో అందరూ ఒక తాటిమీద ఉంటారనీ, రాజభక్తీ, దేశభక్తీ వృద్ధి అవుతాయనీ ఒక ఆశయం. రాజు కూడా మానవ మాత్రుడే. అయినా ఈ స్తోత్రపాఠాల వల్ల, ఆయన ఇతరులందరికంటే ఘనుడని ఒక ఛవి దేశమంతా ఏర్పడితే, ఆయన ఆదేశాలకూ, నిర్ణయాలకూ విలువ పెరుగుతుందని కూడా రాజనీతివేత్తల నమ్మకం. రాజు ఘనుడైనా కాకపోయినా, ఆయన సమర్థుడన్న విశ్వాసం దేశవ్యాప్తంగా ప్రజలలో ఉంటే అది దేశానికి బలమే. అలాగే రాజు ఎంత ఘనుడైనా, ఆయన అసమర్థుడు అన్న అభిప్రాయమే ప్రజలలో ప్రబలంగా ఉంటే అది దేశానికి బలహీనతే.



ఈ స్తుతుల వెనక మరొక కొంటె కోణం కూడా ఉండేదేమో! 'మారాజు ధర్మాత్ముడూ, దయామయుడూ' అని ప్రతిరోజూ ఎత్తేయటంలో ఒక అర్థం, 'రాజా, ఈ సుగుణాలన్నీ ఇప్పుడు నీకు లేవన్న విషయం నీకూ తెలుసు, మాకూ తెలుసు. కానీ ఇవన్నీ మంచి పాలకుడి లక్షణాలు. ఇప్పుడైనా ఈ లక్షణాలు అలవరచుకొనేందుకు ప్రయత్నించండి. అప్పటిదాకా ఈ లక్షణాలన్నీ మీకు నిజంగా ఉన్నట్టే అందరమూ నటిస్తూ ఉందాం' అని లౌక్యంగా సూచించే వాళ్ళేమో! 'నువ్వు దాన కర్ణుడి వహో' అని చుట్టూ చేరిన జనం రోజూ ఊదరగొడుతుంటే, ఎంత పిసినారి వాడయినా మొహమాటం కోసమైనా కొంత ఉదార స్వభావం చూపక తప్పదు కదా!

– ఎం. మారుతి శాస్త్రి

జలవిద్యుత్ ఉత్పత్తిలో 'పులిచింతల' రికార్డు

2022–23లో 160 మిలియన్ యూనిట్ల లక్ష్యానికి రెట్టింపు ఉత్పత్తి

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్ట్ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం(టీఎస్ జెన్‌కో) విద్యుత్ ఉత్పత్తిలో ఆల్‌టైం రికార్డు నెలకొల్పింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 160 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి లక్ష్యం కాగా, 324.30 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసింది. ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి ఏయేటికాయేడు విద్యుత్ ఉత్పత్తిలో రికార్డులను అధిగమిస్తోంది. టీఎస్ జెన్‌కో ప్రారంభదశలో 2016–17 ఆర్థిక సంవత్సరం నుంచి రెండేళ్లపాటు ఆటుపోట్లు ఎదుర్కోగా, ఆ తర్వాత వరుసగా లక్ష్యాలను అధిగమిస్తూ వస్తోంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 10 మిలియన్ యూనిట్లు కాగా 21.06 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసింది. 2019–20లో 12 మిలియన్ యూనిట్లుకుగాను 209.89 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి రికార్డు బ్రేక్ చేసింది. 2020–21లో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 50 మిలియన్ యూనిట్లు కాగా 201.33 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసింది. 2021–22లో లక్ష్యం 170 మిలియన్ యూనిట్లు కాగా 314.55 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసి రికార్డులు తిరగరాసింది. సాధారణంగా యేటా వేసవిలో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో ఉత్పత్తి తగ్గుముఖం పడుతుంది.



కొన్నిచోట్ల అసలే ఉండదు. కానీ, పులిచింతలలో మాత్రం ఎండాకాలంలో కూడా జల విద్యుత్ ఉత్పత్తి అవుతుండటం గమనార్హం.

ఉద్యోగుల సమష్టి కృషి వల్లే..



జెన్‌కో ఉద్యోగులందరి సమష్టి కృషి వల్లే విద్యుత్ ఉత్పత్తిలో రికార్డులు నెలకొల్పడం సాధ్యమైంది. ఉన్నతాధికారులు సూచనలు ఇస్తూ ముందుకు నడిపించారు. నీటిని దిగువకు విడుదల చేసే విషయంలో ఏపీ ఇరిగేషన్ అధికారులు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించారు. దీంతో లక్ష్యానికి రెట్టింపు ఉత్పత్తి చేయడం సాధ్యమైంది.

– బాణావత్ దేశ్యా, ఎస్ఈ, టీఎస్ జెన్‌కో, పులిచింతల ప్రాజెక్టు

బాంచెన్ దొర బతుకులు పోవాలంటే కాంగ్రెస్ రావాలి

• సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



సీఎంకు రాసిన లేఖను చూపుతున్న భట్టి

జైపూర్, భీమారం: నాడు సింగరేణిలో ఓపెన్‌కాస్టులే ఉండవన్న సీఎం కేసీఆర్ నేడు ఓపెన్‌కాస్టు గనుల్లో బొగ్గు వెలికితీసే కాంట్రాక్టులను ఆంధ్రప్రాంతానికి చెందిన బడాబాబులకు అప్పగించారని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర 19వ రోజు సోమవారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలానికి చేరింది. జైపూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. 60 వేల ఉద్యోగాలు, వనరులను స్థానికులకు చెందకుండా చేశారని కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. తెలంగాణలో బాంచన్ దొర అని బతికే రోజులు పోయి, ప్రజాస్వామ్యం బతకాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలన్నారు. అందుకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి విజయరమణరావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొన్నారు.

పోడు సమస్యపై సీఎంకు భట్టి లేఖ

రాష్ట్రంలో పోడు భూముల సమస్యపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా భీమారం మండలం పాలంపల్లిలో బసచేసిన ఆయన సోమవారం పోడు భూముల సమస్యపై సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. పోడు హక్కు పత్రాలు ఎప్పుడు అందుతాయోనని వేలాది మంది గిరిజనులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయలోపంతో పాటు ప్రభుత్వ వైఖరితో ఇప్పటికీ సమస్య కొలిక్కి రాలేదన్నారు. 4.14 లక్షల మంది 12.46 లక్షల ఎకరాలకు దరఖాస్తు చేసుకోగా, కేవలం 1.50 లక్షల మందికే పట్టాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం గిరిజనులను మోసగించడమేనన్నారు. ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయని పక్షంలో కాంగ్రెస్ పార్టీయే విడుదల చేస్తుందని భట్టి స్పష్టం చేశారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కొమురయ్య త్యాగధనుడు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో కొనియాడారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. కొమురయ్య అందించిన చైతన్య స్ఫూర్తి, మలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ కొనసాగిందని గుర్తు చేశా రు. అమరుల సంస్మరణార్థం తెలంగాణ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'అమర జ్యోతి'త్వరలో ప్రారంభం కానుందని సీఎం తెలిపారు.

అక్రమంగా రూ.18 కోట్ల ధాన్యం విక్రయం

• ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రెండు లారీల బియ్యం మిల్లులకు..
• విజిలెన్స్ దాడుల్లో వెలుగుచూసిన హుస్నాబాద్ మిల్లర్ అక్రమాలు
• 2021–22లో సీఎంఆర్‌కు 11,427 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, కేవలం 2 వేల మెట్రిక్ టన్నులు అప్పగింత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొందరు రైస్‌మిల్లర్ల అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండాపోతోంది. రైతుల నుంచి పౌర సరఫరాల సంస్థ కొనుగోలు చేసి ఇచ్చే ధాన్యాన్ని బియ్యం(సీఎంఆర్)గా మిల్లింగ్ చేసి అప్పగించకుండా బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొంటూ సొమ్ము చేసుకుంటున్నారు. వాటి స్థానంలో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అప్పగిస్తున్నారు. సూర్యాపేట, సిద్దిపేట, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, మంచిర్యాల, నల్లగొండ తదితర జిల్లాల్లో యథేచ్ఛగా మిల్లర్లు అక్రమంగా బియ్యం విక్రయాలు సాగుస్తున్నారు. 2021–22 వానాకాలం, యాసంగి సీఎంఆర్ అప్పగించడానికి మార్చి నెలాఖరుతో గడువు ముగియగా, ఇంకా ఈ రెండు సీజన్లకు సంబంధించి లక్షల టన్నుల బియ్యం మిల్లర్ల వద్దే ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో ఇటీవల పౌర సరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్ ఆదేశాల మేరకు విజిలెన్స్ బృందం కొన్ని మిల్లులపై దాడులు జరపగా, కోట్ల విలువైన బియ్యం అమ్ముకొంటున్న విషయాలు వెలుగులోకి వచ్చాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఏఆర్ఎం ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 2021–22లో వానాకాలం, యాసంగి సీజన్లకుగాను 11,427 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కేటాయించగా, కేవలం 2 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బియ్యంగా మరాడించి సీఎంఆర్ కింద పౌర సరఫరాల సంస్థకు అప్పగించింది. మిగతా 9,523 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బియ్యంగా చేసి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నట్లు తేలింది. అక్రమంగా అమ్ముకున్న బియ్యం విలువ రూ.18 కోట్లు కావడం గమనార్హం. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల స్టేజ్ 1 గోదాం నుంచి గత సోమవారం పౌర సరఫరాల సంస్థ స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌కు 5 లారీల్లో పీడీఎస్ బియ్యం లోడ్ పంపగా, మూడు లారీల బియ్యం మాత్రమే చేరాయి. మిగిలిన 2 లారీల లోడ్ ఓ రైస్ మిల్లుకు చేరినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. పౌర సరఫరాల సంస్థ అధికారుల సహకారంతో అమ్ముకున్న సీఎంఆర్ బియ్యం స్థానంలో రేషన్ బియ్యం చేరుస్తున్నట్లు గుర్తించారు.

అమ్మినా, కొన్నా క్రిమినల్ కేసులు: రవీందర్‌సింగ్

సీఎంఆర్ కోసం పౌర సరఫరాల సంస్థ కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు విక్రయించినా, ఎవరైనా కొనుగోలు చేసినా నేరమేనని, ఇద్దరిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆ సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్ స్పష్టం చేశారు. ఈ మే రకు ఆయన విజిలెన్స్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సోమవారం తన కార్యాలయంలో పౌర సరఫరాల సంస్థ విజిలెన్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కేటా యించిన ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లర్ల సమా చారం అందిస్తే తగిన పారితోషికం ఇస్తామని, సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. ఇటీవల జరిపిన తనిఖీల్లో మిల్లర్ల మోసాల గురించి అధికారులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. హుస్నాబాద్, సుల్తానాబాద్ ఘటనలపై లోతైన విచారణ జరపాలని ఆయన ఆదేశించారు.

అరాచకాలు ఆపకుంటే తీవ్రపరిణామాలు

• బీఆర్ఎస్ నాయకులను హెచ్చరిస్తూ మావోయిస్టుల పోస్టర్లు



ఏటూరునాగారంలో వెలిసిన వాల్ పోస్టర్

ఏటూరునాగారం: మావోయిస్టు పార్టీ పేరుతో ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లు వెలిశాయి. తెలంగాణ రాష్ట్ర కమిటీ సీపీఐఎంఎల్ మావోయిస్టు పార్టీ వెంకటేష్, యాక్షన్ టీం కమాండర్ భద్రు పేరుతో మూడు చోట్ల వాల్‌పోస్టర్లను అతికించారు. బీఆర్ఎస్ నాయకులు భూ కబ్జాలు, ఇసుక దందాలు, పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారని అందులో హెచ్చరించారు. మాజీ మండల అధ్యక్షుడు కూనూరు మహేశ్, వలిబాబా, మెరుగు సత్యం, చిప్ప అశోక్, గుండ్ల దేవేందర్, బీఆర్ఎస్ మండల టౌన్ అధ్యక్షుడు ఖాజాపాషా, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, మాదరి రామయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది మినాహజ్, అల్లి శ్రీను, చిన్నబోయినపల్లికి చెందిన తుమ్మల లక్ష్మణ్‌రెడ్డి, కుమ్మరి సారయ్య, కానిస్టేబుల్ సుధాకర్‌లు అరాచకాలు ఆపకపోతే ఊరుకునేది లేదని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి నుంచి కానిస్టేబుల్ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అరాచకాలు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని మావోయిస్టులు హెచ్చరించారు. కాగా, వాల్ పోస్టర్లను పోలీసులు తొలగించారు.

ముత్యాల తలంబ్రాల కోసం లక్ష మంది బుకింగ్

• ఈనెల 10 వరకు బుకింగ్ గడువు పొడిగింపు


సాక్షి, హైదరాబాద్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా లక్ష మంది భక్తులు బుక్ చేసుకున్నారు. మరి కొంతమంది ముందుకొస్తుండటంతో ఈనెల 10 వరకు బుకింగ్స్‌ను తెరిచే ఉంచనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. మొదట బుక్ చేసుకున్న 50 వేల మంది భక్తులకు ఆదివారం నుంచి ఆ తలంబ్రాల ప్రసాదాన్ని ఇళ్లకు తెచ్చి అందిస్తున్నారు. మిగతా వారికి కూడా రెండుమూడ్రోజుల్లో డోర్ డెలివరీ ప్రారంభించనున్నట్లు తెలిపింది. కొత్తగా బుక్ చేసుకునేవారికి బుక్ చేసుకున్న మూడు రోజుల్లోనే అందివ్వనున్నట్లు పేర్కొంది. గతేడాది 88 వేల మంది ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా బుక్ చేసుకుని తలంబ్రాలు పొందితే, ఈ సంవత్సరం ఇప్పటికి లక్ష మంది బుక్ చేసుకున్నారని, గడువు తేదీ వరకు మరికొంతమంది బుక్ చేసుకుంటారని వెల్లడించింది. తొలి బుకింగ్ నమోదు చేసుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు బస్‌భవన్‌లో ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం బిజినెస్ హెడ్ సంతోష్‌కుమార్ ఈడీలు మునిశేఖర్, వినోద్, సీటీఎం జీవన్‌ప్రసాద్‌తో కలిసి తలంబ్రాలను అందించారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ దంపతులకు వారి నివాసంలో ఆర్టీసీ చీఫ్ పర్సనల్ మేనేజర్ కృష్ణకాంత్ తలంబ్రాలను అందించారు. కాగా, భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి కల్యాణం నేపథ్యంలో 18,256 మంది భక్తులు ముత్యాల తలంబ్రాలను పోస్టాఫీసుల ద్వారా బుక్ చేసుకున్నారు. మరో 1,119 మంది భక్తులు పోస్టాఫీసుల ద్వారా భద్రాచల స్వామివారి అంతరాలయ అర్చన సేవలో పేర్లు నమోదు చేసుకుని పరోక్షంగా ఆ సేవలో పాల్గొన్నారు.

10న ఆన్‌లైన్ పెన్షన్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ ఉదయం 11 గంటలకు నెలవారీ ఆన్‌లైన్ పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ ఎంహెచ్ వార్సి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబినార్ ద్వారా జరిగే ఈ అదాలత్ కార్యక్రమంలో ఈపీఎఫ్ పెన్షనర్లు, చందాదారులు పాల్గొనవచ్చని, యాజమాన్యాలు సైతం పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈపీఎస్–95 పథకంపై సందేహాలు, సమస్యలను ఈ అదాలత్‌లో నివేదించవచ్చని తెలిపారు. ఇతర క్లెయిములు, పెన్షన్ బదిలీ అంశాలపైనా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

చిన్నారిని కాటేసిన ఎర్త్‌వైర్

• విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి
• ప్రభుత్వ పాఠశాలలో విషాదం
• హెడ్‌మాస్టర్ సస్పెన్షన్



దీక్షిత (ఫైల్)

పూడూరు: పాఠశాలలో బోర్ మోటారు ఎర్తింగ్ కోసం ఏర్పాటు చేసిన తీగ తగిలి విద్యుదాఘాతంతో ఒక చిన్నారి మృతి చెందింది. వికారాబాద్ జిల్లా మంచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఈ విషాద సంఘటనపై చన్గోముల్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన నర్సింలు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వీరంతా స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారు. నాలుగో తరగతి చదువుతున్న దీక్షిత (9) సోమవారం పాఠశాల వాష్‌రూంకు వెళ్లింది. అక్కడ బోర్ మోటారు ఎర్తింగ్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన ఉపాధ్యాయులు ఆమెను పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం బాలిక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పాఠశాల సిబ్బంది తప్పిదం వల్లే తమ కూతురు మృతి చెందిందని బాలిక కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. హెచ్ఎం సంతోష్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వలలో చిక్కి చిరుత మృతి?

దహనం చేసిన గ్రామస్తులు!

నవాబుపేట: అడవి పందుల బారినుంచి పంటలను కాపాడుకునేందుకు రక్షణగా వేసిన వలకు చిక్కి చిరుత మృతి చెందినట్లు సమాచారం. దీనిపై ఆందోళన చెందిన గ్రామస్తులు గుట్టుచప్పుడు కాకుండా దాన్ని దహనం చేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలివి. నవాబుపేట మండలం చాకలపల్లి, వీర్‌శెట్టిపల్లి గ్రామాల మధ్యలో చాకలపల్లికి చెందిన కొల్లి కృష్ణయ్య అనే రైతు అడవిని ఆనుకుని ఉన్న తన వేరుశనగ పంటకు ఉర్లు (వల) బిగించాడు. కాగా మార్చి 2వ తేదీన ఉర్లకు చిక్కిన చిరుత మృతి చెందింది. తర్వాత రోజు గమనించిన రైతు, కొందరు గ్రామస్తులు అడవికి సమీపంలోని పోతుగుండు గుట్ట వద్ద చిరుత కళేబరాన్ని దహనం చేశారు. తాజాగా ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలియడంతో చిరుతను కాల్చినట్లు అనుమానిస్తున్న ప్రాంతంలో వెంట్రుకలు, బూడిద తదితర అవశేషాలను సేకరించి పరిశీలనకు ల్యాబ్‌కు పంపించినట్లు తెలిసింది. ఈ విషయమై అటవీ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. పొలానికి రక్షణగా వేసిన ఉర్లకు పడి మృతి చెందిన చిరుతను దహనం చేసినట్లు తెలిసిందని, దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామంలో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ల్యాబ్ నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు.

చర్చలకు సిద్ధం.. సమ్మె వద్దు

విద్యుత్ ఉద్యోగుల జేఏసీకి ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు లేఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అత్యవసర సేవల నిర్వహణ చట్టం (టెస్మా) కింద రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధాన్ని మరో 6 నెలల పాటు ప్రభుత్వం పొడిగించిందని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు తెలిపారు. సమ్మెకు దిగడం, ఉద్యోగులను సమ్మెకు పురిగొల్పడం వంటి చర్యలు.. దుష్ప్రవర్తన (మిస్‌కండక్ట్) కిందకి వస్తాయని స్పష్టం చేశారు. ఉద్యోగులు ఈ నెల 17 నుంచి తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్‌కు సోమవారం లేఖ రాశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తదుపరి చర్చలు నిర్వహించేందుకు యాజమాన్యాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన స్పష్టంచేశారు. ఇతర రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థలతో పోల్చితే తెలంగాణ ఉద్యోగుల జీతాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. యాసంగి పంటలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బంది రాకుండా చూడాలని, అలాగే రాష్ట్రంలో విద్యార్థులు వివిధ పరీక్షలు రాస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సమ్మె యోచన మానుకోవాలని ఆయన సూచించారు.

జర్నలిస్టు కేఎల్ రెడ్డి పేరున మెమోరియల్ అవార్డు

• ఏటా ఉత్తమ జర్నలిస్టుకు అవార్డు



విరాళం పత్రాలను అల్లం నారాయణకు అందజేస్తున్న కేఎల్‌రెడ్డి కుటుంబ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ జర్నలిస్టు కేఎల్ రెడ్డి పేరుతో మెమోరియల్ ట్రస్టు ఏర్పాటు చేసి, ఏటా ఉత్తమ జర్నలిస్టును ఎంపిక చేసి అవార్డు ఇవ్వనున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కేఎల్ రెడ్డికి గతంలో ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ రూ.15 లక్షలు వైద్యఖర్చులు, సంరక్షణ కోసం మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే కేఎల్ రెడ్డి గతేడాది నవంబర్ 3న మరణించారు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఆ నిధుల్లో నుంచి రూ.9 లక్షలు మీడియా అకాడమీకి ఇచ్చి, దానిపై వచ్చిన వడ్డీతో ప్రతీ సంవత్సరం 'కేఎల్ రెడ్డి మెమోరియల్ ఉత్తమ జర్నలిస్టు అవార్డు'ఇవ్వాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం వారు మీడియా అకాడమీ కార్యాలయంలో రూ.9 లక్షలు అకాడమీ చైర్మన్ అల్లం నారాయణకు అందజేశారు. ఈ అవార్డును ఏటా నవంబర్ 3న ఇవ్వాలని, అవార్డుల ఎంపిక కోసం ఒక కమిటీని ఏర్పాటు చేశారు. మీడియా అకాడమీ అధ్యక్షుడు చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఇద్దరు ప్రముఖ జర్నలిస్టులు, కేఎల్ రెడ్డి కుటుంబం నుంచి ఇద్దరు, అకాడమీ కార్యదర్శి సభ్యులుగా ఉండి ఉత్తమ జర్నలిస్టును ఎంపిక చేసి అవార్డును ప్రదానం చేస్తారని అల్లం నారాయణ వివరించారు. ఈ మేరకు సోమవారం అల్లం నారాయణ, సోదరుడు ఇంద్రసేనారెడ్డి సమక్షంలో కేఎల్ రెడ్డి అల్లుడు లింగారెడ్డి, అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

ఈదురుగాలులు.. వడగళ్ల వాన

• విద్యుత్ సరఫరాకు అంతరాయం



చండూరులో ఓ చేనేత కార్మికుడి ఇంటిపై రేకులు ఎగిరిపోవడంతో దెబ్బతిన్న మగ్గం

చండూరు, మునుగోడు/యాదగిరిగుట్ట: నల్లగొండ జిల్లా చండూరు, మునుగోడు మండలాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. ఉడతలపల్లి – నల్లగొండ మార్గంలో వేపచెట్టు విరిగి పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చండూరు పట్టణంలో చేనేత కార్మికుల ఇళ్ల రేకులు ఎగిరిపోవడంతో వర్షానికి మగ్గాలు తడిసిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలి చండూరు, పుల్లాంల, కొండాపురం గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మునుగోడు మండలంలోని పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడిపోవడంతో మూడు, నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వరి పొలాలు నేలకొరిగాయి. యాదాద్రిలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. వర్షం నీటిలో ప్రతిబింబించిన శ్రీస్వామి వారి తూర్పు రాజగోపురం భక్తులను ఆకట్టుకుంది.

క్లుప్తంగా...

సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ...
17 దాకా పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో నూతన మద్యం విధానం రూపకల్పనలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అరెస్టయిన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ 17వ తేదీ దాకా పొడిగిస్తూ సీబీఐ కోర్టు సోమవారం ఉత్తర్వులిచ్చింది. సోమవారం సిసోడియాను ఢిల్లీలోని జడ్జి ఎంకే నాగ్‌పాల్ ముందు సీబీఐ అధికారులు హాజరుపరిచారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఆయనకు బెయిల్ ఇవ్వొద్దని, మరో 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించాలని దర్యాప్తు అధికారులు విజ్ఞప్తిచేయగా అందుకు సమ్మతి తెలుపుతూ సీబీఐ జడ్జి ఉత్తర్వులిచ్చారు. ఇదే కేసులో అరెస్టయిన హైదరాబాద్‌కు చెందిన అరుణ్ పిళ్లైకు సైతం జ్యుడీషియల్ కస్టడీని ఈనెల 17వ తేదీదాకా పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి ఆదేశించారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టులు మృతి


ఛత్రా(జార్ఖండ్): జార్ఖండ్‌లోని ఛత్రా జిల్లా మావోయిస్టులు, భద్రతా బలగాల కాల్పులతో దద్దరిల్లింది. భద్రతా బలగాలు పైచేయి సాధించిన ఈ ఎదురుకాల్పుల ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మరణించారని పోలీసులు సోమవారం చెప్పారు. లవలాంగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఛత్రా–పలామూ సరిహద్దులో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఐదుగురు మరణించగా కొందరికి బుల్లెట్ గాయాలయ్యాయని, ఐదుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని ఛత్రా ఎస్పీ రాకేశ్ రంజన్ చెప్పారు. 'ఉదయం 8.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఘటనాస్థలిలో రెండు ఏకే47 రైఫిళ్లు, రెండు దేశవాళీ రైఫిళ్లు, భారీ మొత్తంలో మందుగుండు లభించాయి. గాలింపు కొనసాగుతోంది' అని ఎస్‌డీపీఓ అశోక్ ప్రియదర్శి చెప్పారు. మరణించిన వారిలో మావోయిస్ట్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు గౌతమ్ పాశ్వాన్ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆయన తలపై రూ.25 లక్షల నజరానా ఉంది.

సిరియా విమానం కూల్చివేత

జెరూసలేం: సిరియా, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరుగుతున్నాయి. తమ గగనతలంపై తిరుగుతున్న సిరియా విమానాన్ని కూల్చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. నిజానికి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం కొనసాగుతోంది. తమ దేశానికి వ్యతిరేకంగా సిరియా గడ్డపైనుంచి ఇరాన్ కార్యకలాపాలు సాగిస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. సిరియా మెడలు వంచడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం వరుసగా దాడులు కొనసాగిస్తోంది. గత నెలలో ఆరుసార్లు దాడులు చేసింది. సిరియాలోని వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటోంది.

కర్ణాటక శాసనసభ ఎన్నికలకు తెరలేచింది. మే 10న ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. 13న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. ప్రధానంగా అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, జేడీ(ఎస్) ముందంజలో ఉన్నాయి. కాంగ్రెస్, జేడీ(ఎస్) ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించాయి. ప్రచారంలో దూసుకు పోతున్నాయి. బీజేపీ మాత్రం అభ్యర్థులపై ఇంకా ప్రకటన చేయలేదు. పైగా ఈ ఎన్నికల్లో కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టడం ఆసక్తి కలిగిస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీలు అమలు చేసే 'ప్రైమరీ'లను బీజేపీ అందిపుచ్చుకుంది. ఒకరకంగా ఇవి అంతర్గత ఎన్నికలని చెప్పుకోవచ్చు. బీజేపీ టికెట్లపై ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను పార్టీ నేతలు, కార్యకర్తలే ఎంపిక చేస్తున్నారు. కర్ణాటకలో బీజేపీ ఇలాంటి విధానాన్ని అమలు చేయడం ఇదే మొదటిసారి.

- సాక్షి, నేషనల్ డెస్క్



ప్రైమరీ...

అభ్యర్థుల ఎంపికలో అమెరికన్ స్టైల్

అంతర్గత ఎన్నికల ద్వారా బీజేపీ అభ్యర్థుల ఎంపిక

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అమెరికా తరహా ప్రయోగం

అభ్యర్థులపై ఏకాభిప్రాయం సాధించడానికే..

పార్టీలో అసమ్మతికి చెక్ పెట్టే ఎత్తుగడ

సగటున 150 మంది ఓటర్లు

- కర్ణాటకలో మొత్తం 224 అసెంబ్లీ స్థానాలున్నాయి. బీజేపీ నాయకత్వం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల స్థాయిలో ప్రైమరీలు నిర్వహించింది. ఈ ఎన్నికల ద్వారా ఒక్కో నియోజకవర్గంలో ముగ్గురు మెరుగైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ప్రతి అసెంబ్లీ స్థానంలో సగటున 150 మంది ఓటు వేశారు. నియోజకవర్గ స్థాయిలో బీజేపీ ఆఫీసు–బేరర్లు, మండల కమిటీల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాలైన మహిళా మోర్చా, ఎస్సీ మోర్చా, ఎస్టీ మోర్చా, ఓబీసీ మోర్చా, యూత్ మోర్చా, రైతు మోర్చా, మైనార్టీ మోర్చా సభ్యులు ఓటర్లుగా నమోదయ్యారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్గత ఎన్నికల ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించడానికి ఇద్దరు బీజేపీ సీనియర్ నాయ కులను అధిష్టానం నియమించింది. రాష్ట్రమంతటా ప్రైమరీలు సజావుగా ముగిశాయి. అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించాల్సి ఉంది.



పార్టీ ఆశిస్తున్నదేమిటి?

ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సామే. గ్రూప్‌లు, అంతర్గత కుమ్ములాటల నడుమ అందరినీ సంతృప్తిపరుస్తూ సమర్థున్ని ఎంపిక చేయాలి. రకరకాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలి. అంతర్గత ఎన్నికల ద్వారా పార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయానికి పెద్దపీట వేసినట్లు అవుతుందని, ఎక్కువ మందికి నచ్చిన అభ్యర్థే ఎన్నికల్లో పోటీకి దిగుతాడని, దాంతో విజయావకాశాలు రెట్టింపవుతాయని కర్ణాటక బీజేపీ ఉపాధ్యక్షుడు నిర్మల్‌కుమార్ సురానా చెప్పారు. అసమ్మతిని చల్లార్చడానికి, అభ్యర్థిపై ఏకాభిప్రాయానికి రావడానికి ప్రైమరీలు దోహదపడతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యతను కార్యకర్తల చేతుల్లోనే పెట్టామని అన్నారు.

ప్రజాస్వామిక విధానం..

2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రైమరీల లాంటి ప్రయోగమే చేసింది. దీనికి 'ఎంచుకో, ఎన్నుకో' అని పేరు పెట్టింది. ఇప్పుడు జరుగుతున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తు రుసుము కింద ఆశావహులు రూ.2 లక్షల చొప్పున పార్టీకి చెల్లించారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కాంగ్రెస్ నాయకత్వం వసూళ్ల ప్రక్రియగా మార్చేసిందని బీజేపీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు చలవాది నారాయణ స్వామి విమర్శించారు. తాము డబ్బుతో సంబంధం లేకుండా కార్యకర్తలను భాగస్వాములను చేస్తూ పూర్తి ప్రజాస్వామిక విధానంలో అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని వివరించారు.

10న తుది జాబితా ప్రకటన..

- బీజేపీ 'ప్రైమరీ'కసరత్తు బాగానే ఉన్నప్పటికీ ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో మాత్రం గుబులు మొదలైంది. ఈసారి తమ టికెట్ గల్లంతు అవుతుందని, తమ స్థానాల్లోకి కొత్త అభ్యర్థులు వస్తారని బెంబేలెత్తిపోతున్నారు. అయితే, గెలిచే సామర్థ్యం ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిర్మల్‌కుమార్ సురానా చెప్పారు. అంతర్గత ఎన్నికల ఫలితాల తోపాటు గెలిచే సత్తా, సామాజిక న్యాయం తదితర సమీకరణాల ఆధారంగా అభ్యర్థులపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రైమరీల్లో మూడు పేర్లను ఎంపిక చేశారు. జిల్లా కోర్ కమిటీలు ఆయా పేర్లను క్షుణ్నంగా పరిశీలించాయి. సదరు ఔత్సాహిక నేతలతో స్వయంగా మాట్లాడాయి. జిల్లా కోర్ కమిటీల సూక్ష్మ పరిశీలన దాదాపు పూర్తయ్యింది. ఇందులో వెల్లడైన ఫలితాల ఆధారంగా అభ్యర్థులను రాష్ట్ర కోర్ కమిటీ ఖరారు చేయనుంది. తుది జాబితాను బీజేపీ కేంద్ర పార్లమెంటరీ బోర్డుకు పంపిస్తారు. ఈ జాబితాలోని పేర్లను ఈ నెల 10వ తేదీన కేంద్ర పార్లమెంటరీ బోర్డు అధికారికంగా ప్రకటించనుంది. అంటే ఎన్నికలకు సరిగ్గా ఒక నెల ముందు బీజేపీ అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుంది.

ప్రైమరీ ఎన్నికలు అంటే?

- అమెరికాలో పార్టీల తరఫున అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులను ప్రజలు, పార్టీల్లో రిజిస్టర్ అయిన కార్యకర్తలు ఎంపిక చేస్తారు. ఈ ఎన్నికలనే ప్రైమరీ ఎన్నికలు అంటారు.
- అధ్యక్షుడిని ప్రజలు నేరుగా ఎన్నుకోరు. ఏ పార్టీ తరఫున ఎవరు బరిలో ఉండాలన్నది మాత్రమే నిర్ణయిస్తారు.
- సాధారణ ప్రజలు ఓటు వేసే ఎన్నికను ఓపెన్ ప్రైమరీ, పార్టీ కార్యకర్తలు ఓటు వేసే ఎన్నికను క్లోజ్డ్ ప్రైమరీగా వ్యవహరిస్తారు.
- అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగే పార్టీ అభ్యర్థుల ఎంపిక బాధ్యతను బడా నేతలు, ప్రముఖులకు కాకుండా ప్రజలకు, పార్టీల కార్యకర్తలకు అప్పగించాలన్నదే ఈ ప్రైమరీల ఉద్దేశం.
- అధ్యక్ష ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయాలనుకునేవారు ప్రైమరీలతో పనిలేకుండా నేరుగా నామినేషన్ దాఖలు చేయొచ్చు.

ఎంతటివారినైనా
ఎదుర్కోండి

- అవినీతిపరులు ఎంతటి శక్తివంతులైనా విధి నిర్వహణలో పోరాడండి
- న్యాయానికి తిరుగులేని బ్రాండ్ అంబాసిడర్ సీబీఐ
- సీబీఐ వజ్రోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ ఉద్బోధ



వజ్రోత్సవ వేడుకలో మెడల్స్ గ్రహీతలు, అధికారులతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: అవినీతిపరులు ఎంతటి శక్తివంతులైనాసరే కర్తవ్య దీక్షలో ముందడుగువేసి పోరాడాలని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) అధికారులకు ప్రధాని నరేంద్ర మోదీ కర్తవ్యబోధ చేశారు. సోమవారం ఢిల్లీలో ఏర్పాటుచేసిన సీబీఐ వజ్రోత్సవాల్లో పాల్గొన్న సందర్భంగా ప్రధాని ప్రసంగించారు. ' కేంద్రప్రభుత్వ స్థాయిలో అవినీతిని ఎదుర్కొనేందుకు రాజకీయ సంకల్పానికి కొదువే లేదు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయసహకారాలు అందుతాయి. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే. అవినీతిపై పోరాడండి. అవినీతిపరులు ఎంతటి శక్తివంతులైనాసరే తగ్గేదేలేదు' అంటూ సీబీఐ అధికారులను ఆదేశించారు. ' ప్రజాస్వామ్యం, న్యాయాలకు అవినీతే అతిపెద్ద అవరోధం. అవినీతి నుంచి దేశాన్ని విముక్తి చేయాల్సిన బాధ్యత సీబీఐ పైనే ఉంది. అవినీతిపరులను వదలొద్దని ప్రజలు కోరుకుంటున్నారు. దశాబ్దాలుగా అవినీతితో లబ్ధిపొందిన నేతలు నేడు ఏకంగా సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలపైనే విమర్శలు చేసే పరిస్థితులు సృష్టించారు. పక్కదోవ పట్టించే వీళ్లను పట్టించుకోకుండా విధి నిర్వహణపై దృష్టిపెట్టండి. మన ప్రయత్నంలో అలసత్వం, నిర్లక్ష్యం వద్దు. ఇదే దేశం, దేశ ప్రజలు కోరుకునేది. దేశం, చట్టం, రాజ్యాంగం మీ వెన్నంటే ఉన్నాయి' అని అధికారులకు భరోసా ఇచ్చారు.

ఫోన్‌కాల్‌తో వేలకోట్ల రుణాలు ఇప్పించుకున్నారు

'స్వాతంత్య్రం వచ్చేనాటికే దేశంలో అవినీతి తిష్టవేసి ఉంది. దీన్ని తొలగించాల్సిన ఆనాటి నేతలు కొందరు దీనిని మరింత పెంచడం దారుణం. ఎవరెంతగా అవినీతి చేయగలరనే పోటీ నడుస్తోందిప్పుడు. దీంతో దేశంలో పలు వ్యవస్థలు ధ్వంసమై ప్రభుత్వ విధానాలు నిర్వీర్యమై అభివృద్ధి ఆగిపోతోంది. దేశ ఐక్యత, స్నేహభావం, ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసే అవినీతిని పెకిలించాలి. ఇప్పుడు ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ వంటి పారదర్శకమైన విధానాలొచ్చాయిగానీ గతంలో కొందరు 'శక్తివంతమైన' నేతలు కేవలం ఫోన్‌కాల్ ద్వారా తమ వారికి వేలకోట్ల రుణాలు దక్కేలా చేశారు. అలా ఆయాచిత లబ్ధిపొందాక దేశం వదిలి పారిపోయారు. పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల చట్టం ద్వారా మేం రూ.20,000 కోట్ల ఆస్తులను జప్తుచేశాం. ఇలాంటి అవినీతిపరులు మరింత తెగించి ప్రభుత్వం ద్వారా నిజమైన లబ్ధిదారులకు దక్కాల్సిన రేషన్, ఇళ్లు, స్కాలర్‌షిప్, పెన్షన్లనూ లూటీ చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయిలో కేవలం 15 పైసలే వాస్తవ లబ్ధిదారునికి చేరుతోందని స్వయంగా గత ప్రధానమంత్రే సెలవిచ్చారు' అని మోదీ గుర్తుచేశారు.

అందరి నోటా సీబీఐ

''ఏదైనా కేసు సంక్లిష్టంగా, సమస్యాత్మకంగా ఉందంటే పరిష్కారం కోసం ప్రజల నోట వినిపించే ఒకే ఒక పేరు సీబీఐ. 60 ఏళ్లుగా న్యాయం, సత్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా సీబీఐ నిలుస్తోంది. పంచాయతీ స్థాయిలో జరుగుతున్న ముఖ్య నేరాలనూ సీబీఐకి అప్పజెప్పాలని ప్రజలు కోరుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో అవినీతి చిన్నదిగా కనిపించొచ్చు. కానీ అది పేదల హక్కులను లాగేసుకుంటుంది. కొత్తగా ఎన్నో నేరాలకు అంటుకడుతుంది' అని అన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా సీబీఐ అధికారులకు రాష్ట్రపతి పోలీస్ మెడల్స్‌ను, చక్కని దర్యాప్తు చేసిన సీబీఐ అధికారులకు బంగారు పతకాలను ప్రధాని ప్రదానం చేశారు. స్మారక తపాలా బిళ్ల, నాణేలను ఆవిష్కరించారు.


ఉమ్మడి గళం వినిపిద్దాం

- విడివిడిగా ఎలాంటి లాభం ఉండదు: డీఎంకే చీఫ్ స్టాలిన్
- 'సామాజిక న్యాయ' తొలి సదస్సులో పాల్గొన్న విపక్ష నేతలు

చెన్నై/న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందుకు ఉమ్మడిగా పోరాడాల్సిందేనని డీఎంకే చీఫ్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కుండబద్దలు కొట్టారు. విపక్ష పార్టీలు కూటమి కట్టకుండా విడిగా పోటీ చేస్తే ఎలాంటి లాభం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో మళ్లీ సామాజిక న్యాయం, సమైక్యత, సోదరభావం, సమానత్వం సాధించాలంటే విపక్ష పార్టీలన్నీ ఉమ్మడిగా పోరాడాలని పిలుపునిచ్చారు. డీఎంకే ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా హైబ్రిడ్‌మోడ్‌లో సోమవారం తొలి 'సామాజిక న్యాయ సదస్సు' జరిగింది. రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నేషనల్ కాన్ఫెరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఒబ్రియన్, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్, ఎన్సీపీ, ఐయూఎంఎల్, బీఆర్ఎస్, ఎండీఎంకే, ఆర్ఎస్‌పీ, ఎల్ఎస్‌పీ, వీసీకే తదితర పార్టీల నేతలు పాల్గొని ప్రసంగించారు. అన్ని పార్టీలను ఏకతాటి మీదకు తేవడం అత్యంత ప్రధానమైన విషయమని స్టాలిన్ అన్నారు. ''ఇది కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాకూడదు. దేశవ్యాప్తంగా సాకారం కావాలి. అందరం కలసి పోరాడదాం'' అని పిలుపునిచ్చారు. ''కేంద్రం ఏ హేతుబద్ధ ప్రమాణాల ఆధారంగా 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అమలుచేస్తోంది? ఇది సామాజిక న్యాయం అనిపించుకోదు'' అన్నారు.

దేశవ్యాప్త కులగణన: తేజస్వి

వెనకబడిన కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాలంటే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాల్సిందేనని తేజస్వీ యాదవ్ స్పష్టం చేశారు. ''బిహార్‌లో మహాఘట్‌బంధన్ సర్కార్ ఈ దిశగా ఇప్పటికే అడుగేసింది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో ఓబీసీలకు అదనపు రిజర్వేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. కానీ గవర్నర్లు మోకాలడ్డుతున్నారు' అని ఆరోపించారు. సామాజిక న్యాయ రాజకీయాలతో బీజేపీని ఉమ్మడిగా ఎదుర్కొందామని అన్నారు. దేశవ్యాప్త కులగణన డిమాండ్‌కు విపక్ష నేతలంతా మద్దతు పలికారు.



బేబీ ఈఫిల్ టవర్

పారిస్‌లో ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌కు దీటుగా ఏర్పాటుచేసిన ఈ బుల్లి టవర్ పేరు ఈఫిలా. ఈఫిల్ పరిమాణంలో పదోవంతు ఉంటుంది. దీన్ని ఏడాది పాటు కష్టపడి తయారు చేసినట్టు శిల్పి ఫిలిప్ మెయిన్ డ్రోన్ చెప్పారు. ఏప్రిల్ ఒకటిన దీన్ని ప్రతిష్ఠించారు.

రాహుల్‌కు బెయిల్

జైలుశిక్ష సస్పెన్షన్‌పై 13న విచారణ • బీజేపీ ఎమ్మెల్యేకు కోర్టు నోటీసులు • బీజేపీ, కాంగ్రెస్ తీవ్ర వాగ్యుద్ధం

సూరత్: పరువునష్టం వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి సూరత్ సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రెండేళ్ల జైలు శిక్షను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన అప్పీల్‌పై ఏప్రిల్ 13న విచారణ చేపట్టనున్నట్టు అదనపు సెషన్స్ జడ్జి ఆర్.పి.మొగేరా పేర్కొన్నారు. ఏప్రిల్ 10వ తేదీ లోగా ప్రతిస్పందన దాఖలు చేయాల్సిందిగా ఆదేశిస్తూ ప్రతివాది బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీకి నోటీసులు జారీ చేశారు. దొంగలందరి ఇంటిపేరు మోదీయే ఎందుకుంటుందో అంటూ 2019లో గత లోక్‌సభ ఎన్నికల సమయంలో కర్ణాటకలోని కోలార్‌లో ఎన్నికల సభలో చేసిన వ్యాఖ్యలపై రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించడం తెలిసిందే. ఈ శిక్షను సస్పెండ్ చేయడంతో పాటు రాహుల్‌కు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆయన తరఫు న్యాయవాదులు సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో జడ్జి విచారణ జరిపారు. ఈ సందర్భంగా రాహుల్ తన సోదరి ప్రియాంకాగాంధీ వాద్రా, రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ తదితర కాంగ్రెస్ అగ్రనేతలతో కలిసి ప్రత్యేక బస్సులో కోర్టు సముదాయానికి వచ్చారు. విచారణ సందర్భంగా వారంతా రాహుల్‌తో కలిసి కోర్టు గదిలోనే ఉన్నారు. తదుపరి విచారణకు రాహుల్ వ్యక్తిగత హాజరు నుంచి జడ్జి మినహాయింపు ఇచ్చినట్టు ఆయన న్యాయవాదులు తెలిపారు. కోర్టు బయట రాహుల్‌కు మద్దతుగా పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో గుమిగూడారు.జైలు శిక్ష నేపథ్యంలో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దవడం తెలిసిందే.

సత్యమే నా ఆయుధం: రాహుల్

ప్రజాస్వామ్య పరిరక్షణ 'మిత్రకాల్'పై చేస్తున్న పోరాటంలో సత్యమే తన ఆయుధమని రాహుల్ అన్నారు. సూరత్ కోర్టులో విచారణకు హాజరైన అనంతరం ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు. ''దేశ స్వేచ్ఛా గళం కోసం పోరాడుతున్నా. అందుకు ఎంతటి మూల్యమైనా చెల్లించేందుకు సిద్ధం'' అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అస్మదీయ ఆశ్రిత పెట్టుబడిదారులకు అక్రమ మార్గాల్లో భారీగా లబ్ధి చేకూరుస్తోందని రాహుల్ ఆరోపిస్తుండటం, దీన్ని 'మిత్రకాల్'గా అభివర్ణిస్తుండటం తెలిసిందే.



సూరత్ కోర్టుకు వచ్చి వెళ్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక, ఇతర కాంగ్రెస్ నేతలు

న్యాయవ్యవస్థపై ఒత్తిడి యత్నం: రిజిజు

కోర్టు విచారణకు రాహుల్ భారీగా పార్టీ నేతలు, కార్యకర్తలను వెంటదీసుకుని వెళ్లడాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ''ఇది కచ్చితంగా కోర్టును ఘెరావ్ చేయడమే. న్యాయవ్యవస్థపై అవాంఛిత ఒత్తిడి పెంచే బల ప్రదర్శనే. ఇలాంటిది గతంలో ఎప్పుడైనా చూశామా?'' అంటూ కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు దుయ్యబట్టారు. ''గతంలో సొంత పార్టీ నేత మాజీ ప్రధాని పీవీ నరసింహారావును ఓ కేసులో కోర్టు దోషిగా నిర్ధారించినా దానిపై కాంగ్రెస్ మౌనంగానే ఉంది. పి.చిదంబరం వంటివారికి కూడా ఇలా మద్దతు తెలపలేదు. ఇప్పుడు కేవలం రాహుల్ కోసమే ఇలా డ్రామా చేస్తోంది'' అంటూ ఎద్దేవా చేశారు. రిజిజు ఆరోపణలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొట్టిపారేశారు. సంఘీభావం తెలిపేందుకు మాత్రమే నేతలంతా రాహుల్ వెంట వెళ్లారన్నారు. నిత్యం న్యాయవ్యవస్థను, న్యాయమూర్తులను బెదిరించే వ్యక్తి నుంచి ఇలాంటి మాటలు రావడం విడ్డూరమని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. మోదీకాల్‌లో ఆత్మవంచనకు హద్దుల్లేకుండా పోతున్నాయని ఎద్దేవా చేశారు.

ఐదేళ్లలో 374 మందిని అరెస్టు చేసిన ఈడీ

రూ. 33,862.20 కోట్ల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: దేశంలో అక్రమ నగదు లావాదేవీలు, మనీ లాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గత ఐదేళ్లలో 374 మందిని అరెస్టు చేసింది. వీరిలో పలు కార్పొరేట్ సంస్థల డైరెక్టర్లున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభకు ఈ మేరకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ''కార్పొరేట్ మోసాలకు సంబంధించి స్టెర్లింగ్ బయోటెక్ గ్రూప్, విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ తదితరులపై ఈడీ కేసులు పెట్టింది. రూ.33,862.20 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. వీటిలో రూ.15,113 కోట్ల ఆస్తులను ప్రభుత్వ బ్యాంకులు అధీనంలోకి తీసుకున్నాయి. ఈడీ అప్పగించిన ఆస్తులను ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం విక్రయించి రూ.7,975.27 కోట్లు ఆర్జించింది'' అని మంత్రి వివరించారు.

నేడు కోర్టుకు ట్రంప్

జడ్జిపై తీవ్ర ఆరోపణలు



వాషింగ్టన్: హష్ మనీ చెల్లింపుల కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (76) మంగళవారం మన్‌హటన్ గ్రాండ్ జ్యూరీ ముందు హాజరు కానున్నారు. పోర్న్ చిత్రాల నటి స్టార్మీ డేనియల్స్‌తో తన అఫైర్‌ను కప్పిపుచ్చేందుకు చేసిన చెల్లింపుల కేసులో ట్రంప్‌పై నేరాభియోగాలు మోపుతూ జ్యూరీ గత గురువారం సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దాంతో ఒక క్రిమినల్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న తొలి అమెరికా మాజీ అధ్యక్షునిగా ట్రంప్ నిలిచారు. మంగళవారం విచారణ తంతు 10 నుంచి 15 నిమిషాల్లో ముగుస్తుందని చెబుతున్నారు. ట్రంప్‌పై ఏయే అభియోగాలు మోపిందీ ఆయనకు చదివి వినిపిస్తారు. అనంతరం ట్రంప్ ఫ్లోరిడా వెళ్లి మంగళవారం రాత్రి మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగిస్తారని ఆయన కార్యాలయం ఇప్పటికే ప్రకటించింది. ఈ కేసును విచారిస్తున్న ప్రాసిక్యూటర్‌తో పాటు జడ్జిపైనా ట్రంప్ ఆరోపణలతో విరుచుకుపడ్డారు! ''ఈ కేసు కేవలం నాపై కక్షపూరిత చర్యే. దీన్ని విచారిస్తున్న జడ్జికి నేనంటే అమిత ద్వేషం. కేసును దర్యాప్తు చేస్తున్న జిల్లా అటార్నీ ప్రత్యర్థి డెమొక్రటిక్ పార్టీకి చెందినవాడు. ఏరికోరి నన్ను ద్వేషించే జడ్జినే విచారణకు ఎంచుకున్నారు'' అంటూ ఆరోపణలు గుప్పించారు. క్రిమినల్ విచారణకు దారితీయగల పలు ఇతర అభియోగాలను కూడా ట్రంప్ ఇప్పటికే ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

అమెరికాలో ఎయిర్‌పోర్ట్ ప్రమాదంలో
తెలుగు వ్యక్తి దుర్మరణం



న్యూయార్క్: స్నేహితుడికి స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వచ్చిన భారతీయ అమెరికన్, తెలుగు వ్యక్తి విశ్వచంద్ కోళ్ల (47) అనుకోని ఎయిర్‌పోర్ట్ బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మార్చి 28న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్ నుంచి వస్తున్న విశ్వచంద్ స్నేహితుడైన ఒక సంగీత కళాకారుడు మసాచుసెట్స్ రాష్ట్ర రాజధాని బోస్టన్ సిటీలోని లోగన్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లో దిగనున్నారు. ఆయన కోసం విశ్వచంద్ లోగన్ ఎయిర్‌పోర్ట్‌కు మార్చి 28 సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఎస్‌యూవీ వాహనంలో చేరుకుని టర్మినల్–బి వద్ద వేచిచూస్తున్నారు. విమాన ప్రయాణికులు, లగేజీతో అదే సమయంలో అటుగా వచ్చిన డార్ట్‌మౌత్ ట్రాన్స్‌పోర్టేషన్ బస్సు విశ్వచంద్‌ను పక్క నుంచి గుద్దుకుంటూ వెళ్లింది. దీంతో రెండు వాహనాల మధ్య ఇరుక్కుని నలిగిపోయి అక్కడే పడిపోయారు. ప్రథమ చికిత్స చేసే ప్రయత్నం చేసినా అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. విశ్వచంద్‌ది ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా రేపల్లె అని సమాచారం. అమెరికాలో తకేడా ఫార్మాస్యూటికల్స్ కంపెనీలోని గ్లోబల్ అంకాలజీ విభాగంలో డాటా అనలిస్ట్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య సౌజన్య, కుమారులు ధృవ, మాధవ్ ఉన్నారు. విశ్వచంద్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు బంధువులు గోఫండ్‌మీ ద్వారా ఇప్పటికే 4,06,151 డాలర్లు (దాదాపు రూ.3.3 కోట్లు) విరాళంగా సేకరించారు.

పార్లమెంటులో అవే నిరసనలు

ఉభయసభలూ రేపటికి వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంటులో సోమవారమూ అవే దృశ్యాలు. అధికార, విపక్ష సభ్యుల డిమాండ్లు, నిరసనలు, గందరగోళం. దాంతో కార్యకలాపాలేవీ చేపట్టకుండానే ఉభయసభలూ బుధవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఉదయం సమావేశం కాగానే అదానీ ఉదంతంపై విపక్ష సభ్యులంతా మూకుమ్మడిగా నిరసనకు దిగారు. దాంతో ఇటీవల మరణించిన పుణే బీజేపీ ఎంపీ గిరీశ్ బాపట్, కేరళకు చెందిన మాజీ ఎంపీ ఇన్నోసెంట్‌లకు నివాళులు అర్పించిన అనంతరం సభ మధ్యాహ్నం రెండింటి దాకా వాయిదా పడింది. తిరిగి సమావేశమయ్యాక కూడా విపక్షాల నిరసనలు, నినాదాలు, అదానీపై విచారణకు జేపీసీ ఏర్పాటుకు డిమాండ్లు కొనసాగడంతో సభ బుధవారానికి వాయిదా పడింది. రాజ్యసభ కూడా నిరసనలతో మధ్యాహ్నం వాయిదా పడింది. తిరిగి సమావేశమయ్యాక ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కాంపిటీషన్ (సవరణ) బిల్లు–2023ను ప్రవేశపెట్టారు. విపక్షాల నిరసనలు నెమ్మదించకపోవడంతో చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందినట్టు చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు.

యూకేలో పాస్‌పోర్ట్ సిబ్బంది సమ్మె

లండన్: దేశంలో ద్రవ్యోల్బణం రెండంకెలకు ఎగబాకిందని, ధరలు పెరిగిపోతున్నాయని, తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో పాస్‌పోర్ట్ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది సోమవారం సమ్మె ప్రారంభించారు. ఐదు రోజులపాటు ఈ సమ్మె కొనసాగనుంది. దీంతో విదేశాలకు వెళ్లాల్సినవారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పాస్‌పోర్ట్‌లు సకాలంలో అందకపోతే ప్రయాణాలు మానుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. యూకేలో ద్రవ్యోల్బణం 10.4 శాతానికి చేరుకుంది. ఆహారం, ఇంధనం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జీవన వ్యయం భారీగా పెరిగిపోయింది. తక్షణమే వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో వైద్యులు, ఉపాధ్యాయులు, రైళ్లు, బస్సుల డ్రైవర్లు, ఎయిర్‌పోర్టుల్లో పనిచేసే సిబ్బంది, పోస్టల్ సిబ్బంది ఇదివరకే సమ్మెకు దిగారు.

మళ్లీ టీచర్ల సమ్మెబాట

యూకే ప్రభుత్వం ఆఫర్ చేసిన వేతన 4.5 శాతం పెంపు, 1,000 పౌండ్ల వన్ టైమ్ చెల్లింపును టీచర్లు తిరస్కరించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 27, మే 2న సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు నేషనల్ ఎడ్యుకేషన్ యూనియన్ ప్రకటించింది.


సాక్షి కరీంనగర్

మంగళవారం | 4 | ఏప్రిల్ | 2023



ఎస్సై పరీక్షకు ఏర్పాట్లు

ఈనెల 8,9న నిర్వహించే ఎస్సై పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సీపీ ఎల్. సుబ్బారాయుడు వివరించారు. 8లో▸



వేములవాడలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్న సన్నిధిలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 30వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. అధికారులు ఏర్పాట్లు చూశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0/23.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

నిరాశావాది తనకు వచ్చిన అవకాశంలో కష్టాన్ని చూస్తే, ఆశావాది కష్టంలో అవకాశం కోసం వెతుకుతాడు.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6:33	బుధ 4:42

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పరిహారం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న శేఖర్

రామడుగు: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.పది వేల నష్ట పరిహారం అందించాలని కరీంనగర్ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మండలంలోని లక్ష్మీపూర్‌కు వచ్చి 18 రోజులు గడుస్తున్నా నేటికీ పరిహారం అందలేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని నినాదాలు చేశారు. పంటల పరిశీలనకు వచ్చిన అధికారులు 35 శాతం నష్టం జరిగితేనే పరిహారం ఇస్తామని చెప్పడం సరికాదని.. ప్రతీ రైతుకు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

వీళ్లు మారరు..!



కరీంనగర్ అర్బన్: అసలే ఎండాకాలం.. ఉదయం 10దాటితే కాలు బయటపెట్టలేని పరిస్థితి. ఈ క్రమంలో తమ సమస్యను త్వరగా ఉన్నతాధికారులకు చెప్పుకుందామని వస్తే పడిగాపులు.. నిరీక్షణ. ఉదయం 9గంటలకే ప్రజలు అర్జీలతో కలెక్టరేట్‌కు చేరుకోగా గంటల తరబడి నిరీక్షించారు. ఎండల దృష్ట్యా గతంలో మాదిరి 8గంటలకే నిర్వహించాల్సి ఉండగా తదనుగుణ చర్యలు లేకపోవడం ఆందోళనకర పరిణామం. కాగా ప్రజావాణి 10.30గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఎవరూ లేకపోవడంతో నిలబడి నిరీక్షించారు. అలాగే కంప్యూటర్ ద్వారా రసీదులు ఇవ్వాల్సిన సిబ్బంది కూడా 10.15 వరకు కూడా రాలేదు.

ఇన్‌చార్జి కలెక్టర్‌గా గరిమా అగర్వాల్

- వారం రోజుల సెలవులో కలెక్టర్

కరీంనగర్ అర్బన్: కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సెలవులో వెళ్లారు. ఇన్‌చార్జి కలెక్టర్‌గా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ వ్యక్తిగత కారణాలతో ఈ నెల 9 వరకు సెలవులో ఉంటున్నారు. 10న తిరిగి విధుల్లో చేరనున్నారు.

భద్రాద్రి తలంబ్రాలకు గడువు పెంపు

విద్యానగర్(కరీంనగర్): భద్రాద్రి సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాల స్వీకరణకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుందని ఆర్టీసీ కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం కేశరాజు భానుకిరణ్ తెలిపారు. భక్తుల స్పందన చూసి తలంబ్రాలను బుక్ చేసుకునే గడువు ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తి గల భక్తులు ఆర్టీసీ బస్టాండ్‌ల్లోని లాజిస్టిక్స్ కౌంటర్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వద్ద కాని రూ.116 చెల్లించి బుక్ చేసుకోవాలని కోరారు.

పది పరీక్షలు ప్రారంభం





- సెంటర్ల వద్ద కోలాహలం
- సమయానికి చేరుకున్న విద్యార్థులు
- 41 సెంటర్లను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకులు, జిల్లా అధికారులు

కరీంనగర్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే జిల్లాలోని అన్ని సెంటర్ల వద్ద కోలాహలం మొదలైంది. గంట ముందే కేంద్రంలోనికి అనుమతిస్తామని అధికారులు చెప్పడంతో విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసింది. రాష్ట్ర, జిల్లా పరిశీలకుల బృందంతోపాటు డీఈవో జనార్దన్‌రావు, ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు పరీక్షల తీరును పర్యవేక్షించారు.

12,136 మంది హాజరు..

మొత్తం 76 సెంటర్లు ఏర్పాటు చేయగా.. 12,145 మంది విద్యార్థులకు 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 22 మందికి 18 మంది హాజరయ్యారు. తొలి రోజున ఎక్కడా మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఐదు ప్రత్యేక తనిఖీ బృందాలు 25 పరీక్ష కేంద్రాలను సందర్శించాయని.. రాష్ట్ర పరిశీలకులు 8 పరీక్ష కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల విభాగం మూడు కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి ఐదు కేంద్రాలను మొత్తం 41 పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు డీఈవో పేర్కొన్నారు.

భారమైన హృదయంతో పరీక్షకు..

సప్తగిరికాలనీ(కరీంనగర్): నుదుట ముద్దు పెట్టి పరీక్షలు బాగా రాయాలి నాన్నా అని చెప్పే అమ్మ లేరు.. నేనున్నా నీకు ధైర్యంగా పరీక్ష రాయమని కొండంత ధైర్యాన్ని చెప్పే నాన్న లేరు. నాలుగు రోజుల ముందే అమ్మను.. ఏడేళ్ల క్రితం నాన్నను తీసుకెళ్లాడు ఆ దేవుడు. ఇప్పుడు ఈ విద్యార్థికి పరీక్షలు కొండంత భారంగా తయారయ్యాయి. మార్చి 31న కరీంనగర్ పద్మనగర్ చౌరస్తాలో రోడ్డు ప్రమాదంలో బైరెడ్డి రజిత మృతిచెందగా ఏడేళ్ల క్రితం బైరెడ్డి తిరుపతి రెడ్డి చనిపోయాడు. ఆ దంపతుల కుమారుడు బైరెడ్డి ప్రజ్ఞాంత్‌రెడ్డి ప్రస్తుతం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను రాస్తున్నాడు. నగరంలోని సిద్ధార్థ పాఠశాలలో చదువుతున్న ప్రజ్ఞాంత్‌రెడ్డి పరీక్ష కేంద్రం వాణినికేతన్‌లో పడింది. సోమవారం తెలుగు పరీక్షకు భారమైన హృదయంతో హాజరయ్యాడు.

తాతయ్య, బాబాయ్, అన్నాతమ్ముడితో..

భారమైన హృదయంతో కరీంనగర్ అలకాపురి కాలనీ నుంచి ముకరంపురలోని వాణినికేతన్ పరీక్ష కేంద్రానికి ప్రజ్ఞాంత్ రెడ్డి తన తాతయ్య, బాబాయ్, అన్నయ్య, తమ్ముడుతో కలిసి చేరుకున్నాడు. పరీక్షలు బాగా రాయాలని, ధైర్యంగా ఉండు.. మంచిగా రాయు అని తాతాయ్య, బాబాయ్‌లు చెప్పగా ఆల్ ది బెస్ట్ అంటూ తమ్ముడు చెప్పి పంపించారు.

అమ్మ కోసం ఐఐటీలో సీటు సాధిస్తా..



పదో తరగతి పరీక్షలను బాగా రాయాలని చెప్పిన అమ్మ మాటలు గుర్తుకొస్తున్నాయి. అమ్మ చెప్పినట్లుగానే తెలుగు పరీక్ష బాగారాశా. తెలుగులో 10 జీపీఏ గ్రేడ్ వస్తుంది. ఇంకా హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్‌లో కూడా పది జీపీఏ గ్రేడ్ సాధించి మొత్తంగా 10 జీపీఏ సాధిస్తా. అమ్మ కోరిక ఐఐటీలో సీటు సాధించాలని. అమ్మ కోరిక తీరుస్తా. ఐఐటీలో సీటు సాధిస్తా. నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా సెట్ అయి తమ్ముడు రిశిక్‌ని సెట్ చేస్తా.

– ప్రజ్ఞాంత్ రెడ్డి

పోలీసు పోస్టింగుల కాలం!



- నేతల లేఖల కోసం ఖాకీల ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న పైరవీలు
- ఏసీపీ నుంచి ఎస్సైల దాకా బదిలీల కోసం యత్నాలు
- ప్రతిభావంతులకే పట్టం కట్టే పనిలో ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పోలీసుల బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మరో ఐదారు నెలల్లో రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమరం జరగబోతున్న నేపథ్యంలో ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు పూర్తిచేసింది. ఇక తరువాత స్థాయిలో ఉన్న ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌- ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారుల బదిలీలపై కొంతకాలంగా హోంశాఖ కసరత్తు చేస్తోంది. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్ కమిషనరేట్, రామగుండం కమిషనరేట్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో కిందిస్థాయిలో ఎస్సైల బదిలీలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇక కీలకమైన సీఐ, ఏసీపీల బదిలీల విషయంలో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎవరిని ఎక్కడ నియమించాలన్న విషయంలో ఇటు ఉన్నతాధికారులు, అటు హోంశాఖ పకడ్బందీగా ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం అధికారుల ట్రాక్ రికార్డుతోపాటు, సమర్థతపై ఫోకస్ పెట్టినట్లు సమాచారం.

మూడేళ్ల నిబంధన కీలకం..!

క్రితంసారి జరిగినట్లుగా ఈసారి అసెంబ్లీ ఎన్నికలు వన్‌సైడ్‌గా జరిగే అవకాశాలు చాలా తక్కువ. అధికార పార్టీకి ప్రతిపక్ష పార్టీల నుంచి మునుపటి కంటే పోటీ అధికంగా ఉండే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఎన్నికలలో సున్నితమైన, కీలకమైన నియోజకవర్గాల్లో ప్రతిభావంతులైన అధికారులకు పోస్టింగులు ఇవ్వాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ నియామకాన్ని రద్దు చేస్తూ.. కేంద్రం ఆయన్ని ఏపీ కేటాయించింది. దీంతో ప్రభుత్వం డీజీపీ విషయంలోనూ ఆచితూచి వ్యవహరించి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలే అప్పగించింది. ప్రస్తుతం కేంద్రం-రాష్ట్రం మధ్య పరస్పర రాజకీయ ఆధిపత్య పోరు తీవ్రమైన నేపథ్యంలో పోస్టింగుల విషయంలో ఎక్కడా సాంకేతిక పరమైన లోపాలు, పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. అందుకే.. ఇటీవల జరిగిన ఐఏఎస్, ఐపీఎస్‌ల విషయంలోనూ జాగరుకతతో వ్యవహరించింది. ఇందులో భాగంగానే.. కరీంనగర్ సీపీగా సుబ్బారాయుడు, రామగుండం సీపీగా రెమా రాజేశ్వరి, సిరిసిల్ల ఎస్పీగా అఖిల్‌మహాజన్, జగిత్యాల ఎస్పీగా భాస్కర్‌లను నియమించి మొత్తం ఉమ్మడి జిల్లా పోలీసు బాసులను ఏకకాలంలో మార్చింది. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం.. గత ఎన్నికల సమయంలో పనిచేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు లేదా మూడేళ్లకు మించి ఒకే కుర్చీలో విధులు నిర్వహిస్తోన్న పోలీసులకు స్థానచలనం తప్పేలా లేదు. ఈ విషయంలో ఇప్పటికే కొన్నిస్థానాల్లో ఎస్సై ర్యాంకు ఆఫీసర్లను ఉన్నతాధికారులు మార్చారు కూడా.

లేఖల కోసం ఏసీపీలు, సీఐల పైరవీలు..!

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం డీఎస్పీల జాబితాను ఇప్పటికే తెప్పించుకుంది. అదే సమయంలో కరీంనగర్, రామగుండం కమిషనరేట్లతోపాటు సిరిసిల్ల, జగిత్యాల పోస్టింగుల కోసం పలువురు డీఎస్పీలు ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా చాలాకాలంగా పోస్టింగులు లేకుండా లూప్‌లైన్లలో ఉంటున్న అధికారులు తమకు తెలిసిన నాయకుల ద్వారా ఈసారి ఎలాగైనా పోస్టింగ్ దక్కించుకోవాలని నేతల లేఖలు సంపాదించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు సైతం తాము పనిచేసే నియోజకవర్గం, జిల్లాను కుదిరితే జోన్ సైతం మారేందుకు వెనకాడటం లేదు. తమకు తెలిసిన నాయకుడు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా సరే.. వెళ్లి వెంటనే చేరిపోతున్నారు. ఇదే రకంగా ఇప్పటికే పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు జోన్లు మారి మరీ విధుల్లో జాయినయ్యారు.

అమ్మో..! ఆ నియోజకవర్గమా?

ఉమ్మడి జిల్లాలో మూడు జిల్లాల్లో విస్తరించిన ఓ నియోజకవర్గం పేరు చెబితేనే.. పోలీసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించాలంటే సిఫారసు లేఖలు తప్పనిసరి. వాటితో విధుల్లో చేరిన పోలీసులను ఇప్పటికీ సిఫారసు లేఖలు ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఆ నియోజకవర్గంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు 10 నెలలు డ్యూటీ చేసిన అనంతరం మరో అధికారికి ఆ స్థానంలో లేఖలు ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంలో ఇప్పటికే పలువురు ఎస్సై, సీఐలు చేతులు కాల్చుకున్నారు. తాజాగా కూడా ఈ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని సమాచారం. ఇటీవల కూడా జరిగిన బదిలీల్లోనూ ఇలాగే తమకు అన్యాయం జరిగిందని కొందరు, జరగనుందని మరికొందరు పోలీసులు బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఇంటలిజెన్స్ విభాగం ఇప్పటికే సీఎం కార్యాలయానికి సైతం చేరవేసిందని సమాచారం. అందుకే.. ఆ నియోజకవర్గం పేరు చెబితేనే.. పోలీసులు బెంబేలెత్తిపోతున్నారు.

కరీంనగర్‌లో విచిత్రం..!

కరీంనగర్ కమిషనరేట్ విషయానికి వస్తే.. ఇక్కడ పోలీసుల తీరు విచిత్రంగా ఉంటుంది. ఇక్కడే ఎస్సైలుగా సర్వీసులో చేరిన కొందరు ఇప్పటికీ ఏసీపీలుగా కొనసాగుతున్నారు. వీరికి బదిలీ గండం వెంటాడుతుండటంతో లూప్‌లైన్‌లోకి వెళ్లాలా? లేక అలవాటు ప్రకారం.. ఐదారు నెలలు మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లి.. సరిగ్గా ఎన్నికల ముందు తిరిగి రావాలా? అన్న ఆలోచనలో ఉన్నారు. మొత్తానికి కరీంనగర్‌ను వదిలేందుకు వీరంతా ససేమీరా అంటున్నారు. అందుకే.. ఏ చిన్న అవకాశం దొరికినా.. దాన్ని సద్వినియోగ పరచుకుని ఇక్కడే రిటైర్ అవ్వాలని కంకణం కట్టుకున్నారు.

ప్రారంభోత్సవ పలక చోరీ..!

- ఇటీవల మంత్రి ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్
- సీసీ కెమెరా వైర్లు కోసి మరీ చోరీ



ఖాళీగా ఫ్రేం (ఇన్‌సెట్‌లో శిలాఫలకం)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'దొంగకు చెప్పు కూడా లాభమే' అన్న మాట మరోసారి బల్దియా విషయంలో రుజువైంది. గతంలో బల్దియా పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన బిందెను ఎత్తుకెళ్లిన దొంగలు మరోసారి చేతివాటం ప్రదర్శించారు. ఈసారి ఏకంగా మరో మంత్రి ప్రారంభోత్సవం చేసిన ఇనుప ఫలకాన్ని చోరీ చేశారు. వివరాలు.. ఇటీవల కమాన్ నుంచి హౌజింగ్‌బోర్డుకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను మార్చి 21న మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమం గుర్తుగా ఇక్కడ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకుల పేర్లను ఇనుప పలకపై చెక్కి కమాన్ సమీపంలో ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఇదే పలకను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. సరిగ్గా పదిరోజుల తరువాత సోమవారం ఉదయం చూస్తే కనిపించలేదు. అక్కడ పలకను బిగించేందుకు ఏర్పాటు చేసిన ఫ్రేము మాత్రం వెక్కిరిస్తూ దర్శనమిచ్చింది. దీంతో బల్దియా అధికారులు కంగారుపడిపోయి ఈ విషయాన్ని బయటికి పొక్కనీయలేదు.

కేటీఆర్ ప్రారంభించిన పైలాన్ బిందె సైతం..!

గతేడాది మార్చి 17వ తేదీన మంత్రి కేటీఆర్ నగరంలో 24 గంటల సరఫరాను ప్రారంభించారు. అందుకు చిహ్నంగా మానేరు వంతెనపై పైలాన్ దాని కింద ఓ స్టీలు బిందెను ఏర్పాటు చేశారు. కొన్నిరోజుల అనంతరం ఆగస్టులో ఆ బిందె మాయమైంది. దీనిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఇంతవరకూ బిందె ఆచూకీ తెలియరాలేదు. ఏడాది తరువాత ఇపుడు బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మరో ప్రారంభోత్సవ పలకను దొంగలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం విషయాన్ని గుర్తించిన బల్దియా సిబ్బంది సీసీ కెమెరా ఫుటేజీ కోసం యత్నించారు. అయితే.. దాని తీగెలు కత్తిరించి ఉన్నాయని గుర్తించి తెల్లముఖం వేశారు. ఈ పలక దొంగతనం చేసే ముందు కత్తిరించి ఉంటారని బల్దియా సిబ్బంది అనుమానిస్తున్నారు. పలక మాయం విషయంపై మంగళవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సమాయత్తమవుతున్నామని కరీంనగర్ కార్పొరేషన్ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు 'సాక్షి'కి తెలిపారు.

చెరువు చిచ్చు

- చేపలు పట్టే విషయంలో గొడవ
- మత్స్యకారులపై లాఠీచార్జి చేసిన ఎస్సై



ఇరుగ్రామాల మత్స్యకారులు

వీణవంక: కలిసిమెలిసి ఉండాల్సిన గ్రామాల మధ్య చేపల చెరువు చిచ్చు రేపింది. చేపలు పట్టే విషయంలో ఇరుగ్రామాల మత్స్యకారులు గొడవకు దిగడంతో చల్లూరు-ఇప్పలపల్లి గ్రామాలలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు లాఠీచార్జి చేసే పరిస్థితికి చేరింది. చల్లూరు గ్రామ పంచాయతీ నుంచి ఇటీవల ఇప్పలపల్లి గ్రామం కొత్త పంచాయతీగా ఏర్పడింది. దీంతో పెద్ద చెరువు ఇప్పలపల్లికి గ్రామానికి వెళ్లగా కుంటలు చల్లూరుకు వచ్చాయి. చెరువుల పంపకాన్ని అధికారులు సరిగా చేయలేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని చల్లూరు మత్స్యకారులు గతంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఇప్పలపల్లి మత్స్యకారులు చేపలు పట్టి వాహనంలో తరలిస్తుండగా చల్లూరు గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు గొడవకు దిగడంతో పలువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై శేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించారు. అయినా వినకపోవడంతో లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. ఈ సంఘటనలో సుమారు 200 మంది మత్స్యకారులు ఉన్నట్లు పోలీసులు చెప్పుతున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప గొడవలకు దిగరాదని జమ్మికుంట రూరల్ సీఐ సురేశ్ స్పష్టం చేశారు. వీణవంక ఠాణాలో ఆయన మాట్లాడారు. గొడవకు దిగిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

కాళ్లరిగేలా తిరిగినా.. కనికరించరా?

- ప్రజావాణిలో వినతుల బాణి
- ఒక్కొక్కరిది ఒక్కో సమస్య
- పరిష్కరించాలని వేడుకోలు



ప్రజావాణిలో అర్జీదారులు

కరీంనగర్ అర్బన్: అవే సమస్యలు.. అవే వినతులు. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో వచ్చినవారే మళ్లీ అర్జీలను సమర్పిస్తుండటం గమనార్హం. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు రాగా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రధానంగా భూ సమస్యలు.. పంచాయతీరాజ్ సమస్యలు, పింఛన్లు తదితర అర్జీలు రాగా మండలస్థాయి అధికారుల నిర్లక్ష్యం స్పష్టమవుతోంది. కలెక్టర్‌కు అర్జీ ఇస్తే సమస్య పరిష్కారమవుతుందని గంపెడాశతో కలెక్టరేట్‌కు వస్తే ఆడియాసగానే మిగులుతోందని బాధితులు వాపోతున్నారు. సోమవారం 204 అర్జీలు రాగా అదనపు కలెక్టర్లు పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ చూపారు. ఈ సందర్భంగా పలువురిని 'సాక్షి' పలుకరించగా వారి ఆవేదన ఇదీ..

ప్రజావాణిలో గొడవ



జ్యోతిని బయటకు తీసుకెళ్తున్న పోలీసు సిబ్బంది

నివాస స్థలాన్ని కబ్జా చేశారని, సర్పంచ్, కార్యదర్శి తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన దంపతులు ప్రజావాణిలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక అధికారితో విచారణ జరిపి న్యాయం చేయాలని, లేకుంటే తమకు చావే శరణ్యమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటినంబర్ 4-139/ఏలో 560 చదరపు గజాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. 80 గజాల స్థలాన్ని మాత్రమే గిఫ్ట్ డీడ్ చేశామని, కానీ మిగతా స్థలాన్ని ఎలా చేసుకుంటారని మండిపడ్డారు. గొడవకు దిగడంతో సిబ్బంది సముదాయించి బయటకు పంపించారు.

దౌర్జన్యంగా రోడ్డేశారు



గ్రామంలోని మా కాలనీలో సీసీ రోడ్డు పోశారు. రోడ్డు పోసే ముందు తమ స్థలంలో ఎందుకు పోస్తున్నారని అడిగితే మా ఇష్టం.. దిక్కున్నచోట చెప్పుకో అంటున్నరు. అధికారులను కలిస్తే చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు.

– కొండ రాజేశ్వరి, రాంపూర్, హుజూరాబాద్

నా ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్



గ్రామంలోని సర్వే నంబర్ 121/డిలో 1.12ఎకరాల భూమి ఉంది. సదరు భూమి నా తండ్రి బతికున్న కాలంలోనే సోదరుల నుంచి సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశాను. జూలై 11, 1997రోజున సాదాబైనామా జరగగా అప్పటి నుంచి మోకాపై మేమే ఉన్నాము. కానీ సదరు భూమికి తానే ఏకైక వారసుడినని రెవెన్యూ అధికారులను మభ్యపెట్టి తమ్ముడు రాజారాం తన పేరున మార్చుకున్నాడు. నా ప్రమేయం లేకుండా ఎలా భూ రికార్డుల్లో మార్పిడి ఎలా చేస్తారు?

– అంబటి రాజయ్య, కెల్లెడ, మానకొండూరు

దళిత బంధు ఇవ్వరా



రాజకీయ ప్రాద్బలం, పైరవీ ఉన్నవారికే దళితబంధు మంజూరు చేస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం మాది. అధికారులను ఎన్నిసార్లు కలిసి నా దళితబంధు మంజూరు చేయలేదు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు అన్ని వివరాలతో దరఖాస్తు చేసిన. మాకు కేటాయించిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు మర్రిపల్లిగూడెంలో నాకు దళితబంధు ఖాతా తెరవాలి.

– సిరిమల్ల శ్రీనివాస్, మల్యాల, ఇల్లందకుంట

పింఛన్ ఇవ్వరూ..



నాకు ఎలాంటి ఆధారం లేదు. 35 ఏళ్ల క్రితం వివాహం జరగగా నా భర్త నెల రోజులకే వదిలేసి వెళ్లిపోయాడు. ఒంటరిగా బతుకుతున్న. ఒంటరి మహిళా పింఛన్ మంజూరు చేయాలని అధికారులను కలిస్తే పట్టించుకోవడం లేదు. మూడేళ్లుగా తిరుగుతున్నా చర్యలు లేవు.

– గౌరై కుమారి, ఇరుకుల్ల, కరీంనగర్ రూరల్

క్లుప్తంగా

స్వల్పంగా పెరిగిన పత్తి ధర

- క్వింటాల్‌కు రూ.7,700



జమ్మికుంట: వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధరలు స్వల్పంగా పెరిగాయి. గత శుక్రవారం క్వింటాల్ పత్తి రూ. 7,550లు కాగా సోమవారం రూ.150 పెరిగి గరిష్ఠంగా రూ.7,700 పలికింది. మార్కెట్‌కు 93 వాహనాల్లో 1488 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకరాగా క్వింటాల్‌కు మోడల్ ధర రూ. 7,600, కనిష్ఠ ధర రూ. 7,250 కాగా గన్నీసంచుల్లో 18మంది రైతులు 33 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,400, మోడల్ ధర రూ.6,500, కనిష్ఠ ధర రూ.6వేలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

మహనీయులకు ఘన నివాళి

- 5న బాబు జగ్జీవన్‌రామ్, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి
- జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్

కరీంనగర్: డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, బీఆర్. అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్ తెలిపారు. జిల్లాకేంద్రంలో ఈనెల 5న మంచిర్యాల చౌరస్తాలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద, ఈ నెల 14న కోర్టుచౌరస్తాలోని బీఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాలు పాల్గొంటాయన్నారు. ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

6 నుంచి ఎంపిక శిబిరాలు

కరీంనగర్: వికలాంగుల సహకార సంస్థ, హైదరాబాద్ అలీమ్‌కో వారి సహకారంతో శారీరక వికలాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు అందించేందుకు ఎంపిక శిబిరాలు ఈనెల 6న జిల్లాకేంద్రంలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ స్టేడియంలో, 10న మానకొండూర్ ఎంపీడీవో కార్యాలయం, 11న చొప్పదండి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.సబితకుమారి తెలిపారు. 16 ఏళ్లపైబడి కుటుంబం నెలసరి ఆదాయం రూ.15 వేలు మించనివారు అర్హులన్నారు. గతంలో లబ్ధిపొందిన వారు అనర్హులని సూచించారు. పేరు నమోదుకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల దివ్యాంగులు తప్పకుండా సదెరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్‌ఫోటోలతో నిర్ణీత తేదీల్లో హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువతి యువకులకు వృత్తి నైపుణ్య శిక్షణ

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ రాంనగర్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణకేంద్రంలో బ్యూటీషియన్, సీసీ కెమెరా, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో యువతి యువకులకు శిక్షణనివ్వనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు 7వతరగతి, 10వ తరగతి, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారికి మొదట ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివరాలకు 9949850360 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎస్‌ఐ రాతపరీక్షకు ఏర్పాట్లు

- కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు



మాట్లాడుతున్న సీపీ ఎల్.సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: ఈనెల 8, 9 తేదీల్లో పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్‌ఐ(సివిల్/ఏఆర్/టీఎస్‌ఎస్పీ/ఎస్‌పీఎఫ్/ఎస్‌ఏ ఆర్ సీపీయల్/ఫైర్) అభ్యర్థులకు నిర్వహించనున్న రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయని సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. రాత పరీక్ష సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశామని చెప్పారు. రాత పరీక్ష నేపథ్యంలో సోమవారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, బయోమెట్రిక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నోడల్ అధికారి జి.చంద్రమోహన్, రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలక్ష్మి, ఏసీపీలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్ రావు, విజయ్‌కుమార్, సి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జామ్ సెంటర్లు..

- కరీంనగర్, తిమ్మాపూర్, నుస్తులాపూర్‌లలో 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్, మహిళా డిగ్రీ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల, కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల, వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, అపూర్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల.
- తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల, నుస్తులాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల.

ఎగ్జామ్ సమయం..

- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు..
- మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు
- పరీక్ష రాసే అభ్యర్థులు: 13,547 మంది

ముగిసిన పోషణ మాసోత్సవాలు

- విజేతలకు బహుమతుల ప్రదానం
- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్

కరీంనగర్: మార్చి 20 నుంచి నిర్వహిస్తున్న పోషణ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వెల్ బేబీషో కార్యక్రమంలో విజేతలైన చిన్నారుల తల్లిదండ్రులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆరోగ్యవంతమైన పిల్లలకు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సర్టిఫికెట్లు అందించారు. పోషణ్ అభియాన్- పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా మహిళా అభివృద్ధి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మార్చి 20 నుంచి వేడుకలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా చిరుధాన్యాల మేళా, కళాశాలలు పాఠశాల విద్యార్థులకు చిరుధాన్యాల ఆవశ్యకతపై క్విజ్ పోటీలు, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోమవారంతో పోషణ పక్షోత్సవాలు ముగిశాయి. చివరిరోజు పోషక విలువలతో కూడిన వంటల పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ పాల్గొని వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కళాశాల విద్యార్థులకు అనీమియా పరీక్షలు చేశారు. పక్షం రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, జిల్లా సంక్షేమశాఖ అధికారి కే.సబితకుమారి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

హాని కలిగించే స్థలాలు, భవనాలు గుర్తించండి

కరీంనగర్‌క్రైం: జిల్లాలో అగ్నిప్రమాదాలతో ఆస్తి ప్రాణనష్టం సంభవించకుండా హాని కలిగించే స్థలాలు, భవనాలను తనిఖీ బృందాలు గుర్తించి నివేదిక సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అగ్నిమాపక భద్రత చర్యలపై అగ్నిమాపక, మున్సిపల్ కమిషనర్లు, ఎలక్ట్రిసిటీ, డీపీవో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అగ్నిమాపక భద్రత చర్యల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణకు జిల్లాలో హాని కలిగించే స్థలాలు, భవనాలు, గుర్తించేందుకు 8 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ఫంక్షన్‌హాల్స్, గ్యాస్ గోడౌన్స్, ప్రభుత్వ కార్యాలయాలు, మిల్లుల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించి హాని కలిగించే ప్రదేశాల, భవనాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. కలెక్టరేట్ భవన సముదాయం, సీపీ,ప్రభుత్వ ఆసుపత్రులు,కోర్టుభవనాలు మొదటి ప్రాధాన్యం ఇచ్చి సర్వేచేయాలన్నారు. ప్రమాదకరమైన భవనాలుగా గుర్తించిన వాటిల్లో భద్రత చర్యలు తీసుకోవాలని లేకుంటే సంబంధిత యజమానిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అన్ని భవనాల్లో అగ్నిమాపక భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న, డీపీవో వీరబుచ్చయ్య, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి డి.ప్రభాకర్, కరీంనగర్, జమ్మికుంట హుజూరాబాద్, చొప్పదండి, కొత్తపల్లి, మున్సిపల్ కమిషనర్లు, స్టేషన్‌ఫైర్ ఆఫీసర్లు, మండల పంచాయతీ అధికారులుపాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కరీంనగర్: రూరల్ మండలంలోని నగునూరు, బొమ్మకల్ గ్రామాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సీలింగ్ భూములు వ్యవసాయం చేసుకునేందుకు పేద, దళిత రైతులకు లీజుకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధానకార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ.. కరీంనగర్‌రూరల్ మండలం నగునూరు గ్రామంలోని సర్వేనంబర్ 383, 438, 439,443, 549, 550, 581, 584, 442, బొమ్మకల్ గ్రామంలోని సర్వేనంబర్ 113, 114, 115 సర్వేనంబర్లలోని భూములను ప్రభుత్వం 2006లో స్వాధీనం చేసుకుందని వీటిని లీజుకు ఇవ్వాలని, ఇందులో నాలా అక్రమ రిజిస్ట్రేషన్ చేయకూడదని అప్పటి తహసీల్దార్, ఆర్డీవో కోర్టుకు సమర్పించడంతో కోర్టు ఆదేశాలు జారీచేసిందన్నారు. ఈక్రమంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో 2020లో అప్పటి జిల్లా కలెక్టర్ రూ.11.20లక్షలు కోర్టుకు డిపాజిట్ చేయాల్సి వచ్చిందన్నారు. నగునూరు, బొమ్మకల్‌లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములు పేద దళిత రైతులకు లీజుకు ఇవ్వాలని అడిగితే జేసీ బెదిరించడం సరికాదన్నారు. భూస్వాములకు వత్తాసు పలకడం ఎంతవరకు సమంజసమన్నారు. పేద దళితులంటే జేసీకి చులకనా భావంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములు వ్యవసాయానికి పేద దళితులకు లీజుకు ఇవ్వకపోతే ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లాకమిటీ సభ్యులు జి.ప్రశాంత్‌కుమార్, పార్టీ నాయకులు బద్రినేత, దళిత రైతులు పాల్గొన్నారు.

సదరం షెడ్యూల్ విడుదల..

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో దివ్యాంగుల వికలాంగత్వం నిర్ధారణకు ఏప్రిల్ నెలలో నిర్వహించే సదెరం శిబిరాల షెడ్యూల్‌ను సోమవారం జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల విడుదల చేశారు. ఈనెల 10న ఆర్థో, 17న మానసిక రోగులు, 24న కంటిచూపు, 27న వినికిడి, మూగ చెవుడు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6న ఉదయం 11.30 నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్‌బుకింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. శిబిరాలు నిర్వహించే తేదీల్లో వికలాంగత్వం నిర్ధారణకు సంబంధిత వైద్యపత్రాలు, మీసేవలో బుక్‌చేసుకున్న రశీదుతో పాటు పాస్‌ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్‌తో సదరం శిబిరానికి హాజరు కావాలని కోరారు.

కలెక్టరేట్ ఇన్‌చార్జి ఏవోగా శ్రీవాణి

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్ తాత్కాలిక పరిపాలన అధికారి(ఏవో)గా శ్రీవాణి బాధ్యతలు చేపట్టారు. ఏవో జగత్‌సింగ్ వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లారు. ఈ క్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీవాణికి బాధ్యతలు అప్పగించగా ఈ నెల 9వరకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యంతాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జిల్లాకోర్టు సోమవారం జైలు శిక్ష విధించింది. ఈ సందర్భంగా డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరిని కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు మెజిస్ట్రేట్ పి.సరళరేఖ ఎదుట హాజరు పర్చగా రవి అనే వ్యక్తికి మూడు రోజుల జైలు, రూ.వెయ్యి జరిమానా, నరేశ్ అనే వ్యక్తికి ఐదు రోజుల జైలు రూ.2వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. ప్రతీరోజు కరీంనగర్ పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుశిక్ష తప్పదని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు హెచ్చరించారు.

పోలీసుల ఆధ్వర్యంలో 11న మెగా జాబ్ మేళా

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో ఈనెల 11న పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఉచిత మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. 10తరగతి ఉత్తీర్ణులై ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ చదివిన అభ్యర్థులు దాదాపు 5 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విప్రో, జెన్‌ప్యాక్, టాటా సర్వీసెస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ, ఇండిగో ఎయిర్ లైన్స్ గూగుల్ పే, రిలయన్స్ జియో కంపెనీలతో పాటు దాదాపు 120 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఆసక్తి గలవారు సర్టిఫికెట్లతో జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో జాబ్ మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డయల్ 100తో 3,700 ఫిర్యాదు పరిష్కారం

- కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: శాంతిభద్రతలకు సంబంధించి తలెత్తే సమస్యలపై సత్వర స్పందన, పరిష్కారానికి ఏర్పాటైన డయల్ 100 ద్వారా గత మార్చి నెలలో 3,700 అత్యవసర ఫిర్యాదులు అందగా వాటిని పరిష్కరించినట్లు కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. ఇందులో శారీరక నేరాలకు సంబంధించినవి 220, మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించినవి 311, రోడ్డు, అగ్ని ప్రమాదాలకు సంబంధించినవి 130, ఆస్తికి సంబంధించిన నేరాలు 7, ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు 42, ఇతర నేరాలకు సంబంధించినవి 2,990మొత్తం 3700 సమస్యలు పరిష్కారమైనట్లు తెలిపారు.

ఫిట్స్‌తో గర్భిణి మృతి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కదంబాపూర్‌కు చెందిన ఆరేపల్లి సమత(29) గర్భిణి ఫిట్స్‌తో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం లింగాల దుద్దనపల్లికి చెందిన సమతకు కదంబాపూర్‌కు చెందిన అనిల్‌తో 11నెలల క్రితం వివాహమైంది. ఆరునెలల తర్వాత గర్భం దాల్చిన విషయం తెలియడంతో తల్లిగారింటికి వెళ్లింది. గతనెల మార్చిలో సీమంతం కూడా ఘనంగా నిర్వహించారు. ఈ నెల 1న అత్తగారింటికి వచ్చిన తర్వాత సమతకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడి నుంచి కరీంనగర్ తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ అదే రోజు మృతిచెందింది. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు సమత మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో అంత్యక్రియలు ఆలస్యం కాగా పోస్టుమార్టం నివేదికలో అనారోగ్యంతోనే మృతిచెందినట్లు తెలిసింది. సోమవారం తల్లిగారింటి వద్దే అంత్యక్రియలు నిర్వహించారు.

తల్లి మందలించిదని విద్యార్థి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీ సంతోష్‌నగర్‌కు చెందిన విద్యార్థి కనపర్తి అశ్విత్ (15) తల్లి మందలించిందని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. అశ్విత్ కాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లో సెల్‌లో గేమ్స్ ఆడుతుండడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంటి ఆవరణలో ఉన్న టార్పెంటాయిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం వేకువజామున మృతిచెందాడు. మృతుడి పెద్దనాన్న కనపర్తి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై శ్యామ్ పటేల్ తెలిపారు.

శ్రీగంధం దుంగల చోరీకి యత్నం

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం డెయిరీ ఫాంలోని శ్రీగంధం చెట్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నరికి దుంగలను ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. ఉదయం షిఫ్టు విధులకు హాజరైన కార్మికులు చెట్లు నరికి ఉండటాన్ని గమనించి కంపెనీ అధికారులకు సమాచారం అందించారు.గతంలోనూ డెయిరీఫాం, స్టాఫ్‌కాలనీ గెస్ట్‌హౌస్ పరిసర ప్రాంతాల్లోని శ్రీగంధం చెట్లను నరికి దుంగలను ఎత్తుకెళ్లారు. దీనిపై బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు పురోగతి లేదు. ప్రస్తుతం మరోసారి డెయిరీఫాంలో గంధం చెట్లు నరికివేతకు గురికావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

మావోయిస్టు నేత తల్లి మృతి



వెంకమ్మ(ఫైల్)



నివాళులు అర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు

పాలకుర్తి: మండలంలోని రాణాపూర్‌కు చెందిన మావోయిస్టు దండకారణ్యం రాష్ట్రకమిటీ సభ్యుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ కమలాకర్ తల్లి ఏగోలపు వెంకమ్మ (85) సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. వెంకమ్మకు నలుగురు కుమారులు కాగా చిన్న కుమారుడు మల్లయ్య 30ఏళ్ల క్రితం మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. వెంకమ్మ మృతదేహాన్ని మాజీ మావోయిస్టులు, రైతుసంఘాల నాయకులు, పౌరహక్కుల నేతలు సందర్శించారు. ఆమె మృతదేహంపై ఎర్ర, పచ్చజెండాలు కప్పి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పాటలతో వెంకమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేస్తూ కేంద్రంలో బీజేపీ తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ సోమవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన పోస్టాఫీసు వద్ద రాహుల్‌గాంధీకి మద్దతుగా పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు పులి అంజనేయులు గౌడ్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్‌నాయక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు రహమత్ హుస్సేన్ మాట్లాడుతూ... రాజకీయ కుట్రతో రాహుల్‌గాంధీని పార్లమెంట్ నుంచి బహిష్కరించడం మోదీ నియంత పాలనకు నిదర్శనమన్నారు. రాహుల్‌గాంధీ ప్రశ్నలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పేవరకూ పోస్టుకార్డు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రహమత్ హుస్సేన్, వెన్న రాజమల్లయ్య, మడుపు మోహన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, కాడే శంకర్, రామిడి రాజిరెడ్డి, బొబ్బిలి విక్టర్, పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఆడెపు రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పల్లెకు ఓబీసీ – ఇంటింటికీ బీజేపీ

- పోస్టర్ ఆవిష్కరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 20 వరకు తలపెట్టిన పల్లెపల్లెకు ఓబీసీ... ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం పోస్టర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సోమవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ బీసీలకు చేకూర్చిన ప్రయోజనాలను ప్రతీ ఇంటికి తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యకర్త సభ్యులు అశోక్, జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్, ప్రధానకార్యదర్శి ఆకుల రాజేందర్, కార్యదర్శి ఎర్రోజు లక్ష్మణ్, నాయకులు ఇంగ్లీ ప్రభాకర్‌కుమార్, వంగల రవి, వద్దులే మల్లికార్జున్, శ్రీనివాస్, శ్రీకాంత్, సాయిబాబా, సమ్మయ్య, కొండారెడ్డి పాల్గొన్నారు.

రైతాంగానికి స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

కరీంనగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తి ప్రదాత, అమరవీరుడు దొడ్డి కొమురయ్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కొనియాడారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కొమురయ్య చిత్రపటానికి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి కడారి ఐలయ్య పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. మహనీయుల త్యాగాలను రాష్ట్రప్రభుత్వం విస్మరించిందని ఆయన విగ్రహాన్ని ట్యాంకుబండ్‌పై పెట్టాలని, పాఠ్యపుస్తకాల్లో జీవిత చరిత్ర చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కడారి ఐలయ్య బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈర్ల విజయ్‌కుమార్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ, కురిసేనా అధ్యక్షుడు చిగుర్ల గట్టయ్య, నాయకులు గుంటి అశోక్, రాజు బండి మల్లన్న, ఈర్ల విజయ్‌కుమార్, స్వామి, కొమురయ్య, సురేశ్, మహేశ్ పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేం

కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ నవీన్ నికోలస్, బీసీ సంక్షేమ అధికారి రాజమనోహర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న, డీపీవో వీరాబుచ్చయ్య, డీఆర్‌డీవో శ్రీలత, డీడీ సోషల్ వెల్ఫేర్ నేతినియల్, కురుమ సంఘం నాయకులు, మహిళాసంఘం నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు నిర్వహించే 'కంటివెలుగు' శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో మంగళవారం 48 ప్రాంతాల్లో కంటివెలుగు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి సాజీదా తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 3,8,9,12,14,19,20,21,29, 34,48,58వ డివిజన్‌లలో, హుజూరాబాద్ పట్టణంలో 18, 22వ వార్డుల్లో మండలంలోని తుమ్మనపల్లి, పోతిరెడ్డి పేట గ్రామాల్లో, జమ్మికుంట పట్టణంలోని 12వ వార్డులో మండలంలోని బిజిగిరి షరీఫ్, మడిపల్లి గ్రామాల్లో, వీణవంక మండలంలోని గంగారం, దేశాయిపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో, చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, ఇందుర్తి గ్రామాల్లో, చొప్పదండిలో 14వ వార్డు మండలంలోని కోనేరుపల్లి, రాగంపేట గ్రామాల్లో, ఇల్లందకుంట మండలంలో టేకుర్తి గ్రామంలో, గంగాధర మండలంలో లక్ష్మీదేవిపల్లి, వెంకంపల్లి గ్రామాల్లో, రామడుగు మండలంలోని దేశరాజ్‌పల్లి, రుద్రారం గ్రామాల్లో, కొత్తపల్లి మండలంలోని బొమ్మకల్, మల్కాపూర్, బద్దిపల్లి గ్రామాల్లో, కరీంనగర్ రూరల్ మండలంలో తాహెర కొండాపూర్, నగునూర్ గ్రామాల్లో, మానకొండూరు మండలంలో అన్నారం, కొండపలకల, పోచంపల్లి గ్రామాల్లో, సైదాపూర్ మండలంలో దుద్దెనపల్లి, బొమ్మకల్ గ్రామాల్లో, కేశపట్నం మండలంలో ఎరడపల్లి, ములంగూర్, ఆముదాలపల్లి గ్రామాల్లో, తిమ్మాపూర్ మండలంలో రేణిగుంట, పర్లపల్లి గ్రామాల్లో , గన్నేరువరం మండలంలోని కాసింపేట గ్రామంలో కంటివెలుగు బృందాలు పనిచేస్తాయన్నారు. ప్రజలు కంటివెలుగు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలు

- ఎస్సారార్ కళాశాల ప్రాజెక్టులు ఎంపిక

శాతవాహనయూనివర్సిటీ: ప్రతీ సంవత్సరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించేందుకు కమిషనరేట్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో 'జిజ్ఞాస- స్టూడెంట్ స్టడీప్రాజెక్ట్స్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఎస్సారార్ ఆర్ట్స్- సైన్స్‌కళాశాల (అటానమస్), కరీంనగర్ నుంచి మొత్తం 14 సబ్జెక్టుల్లో జిజ్ఞాస ప్రాజెక్టులు సమర్పించగా అందులో ఆరు ప్రాజెక్టులు (ఇంగ్లీష్, హిస్టరీ, కామర్స్, గణిత శాస్త్రం, బయోటెక్నాలజీ, జంతుశాస్త్రం) రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న వనరులతో సృజనాత్మకతను జోడించి సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేసిన అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కళాశాలకు బహుమతులు తేవాలని కళాశాల ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల జిజ్ఞాస కో-ఆర్డినేటర్ కె.భాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధరలు ఇష్టారాజ్యం.. పర్యవేక్షణ పూజ్యం

కరీంనగర్ అర్బన్: చేపల మార్కెట్ అక్రమాలకు అడ్డాగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వారు చెప్పిందే ధర.. జోకిందే తూకమన్నట్లుగా సాగడం విడ్డూరం. సాక్షాత్తు జిల్లా కేంద్రంలోనే నిబంధనలు అటకెక్కగా వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని చేపల మార్కెట్, కశ్మీర్‌గడ్డ వద్ద, రాంనగర్‌లో గల చేపల మార్కెట్లపై అధికారుల నియంత్రణ కరువైంది. దీంతో ధరల పట్టిక నిర్వహణ లేకపోగా ఇష్టారీతి ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక బాట్లతో తూకాలు వేస్తుండగా 200ల గ్రాములుండే కవర్‌తో తూకం వేస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలు వినియోగించకపోవడం గమనార్హం. ఈ విషయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి దేవేందర్‌ను వివరణ కోరితే తమకు సంబంధం లేదని చెప్పుకొచ్చారు.


ధరలు లేని పట్టిక

పోషణ్ మేళా.. ఆంగ్లంలో ఎలా..!

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్‌లో నిర్వహించిన పోషణ్ మేళా విమర్శలకు తావిచ్చింది. చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలను వివరిస్తూ సోమవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారంలో ప్రదర్శన నిర్వహించారు. అయితే అందులో అత్యధిక బ్యానర్లు ఇంగ్లిష్‌లో ఉండగా ఎలా అర్థమవుతుందని చూపరులు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తెలుగుకు ప్రాధాన్యతనివ్వాలని చెబుతుంటే ఆంగ్లంలో ఏర్పాటు చేయడంపై ప్రజావాణికి వచ్చిన ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.


పోషణ్ మేళాలో ఆంగ్లంలో బ్యానర్లు

చిత్ర కథ — దుమ్ము పకోడి.. పురుగుల సమోస





అప్పుడే బస్ దిగారా..? చాలా ఆకలిగా ఉందా..? బస్టాండు పరిసరాల్లో ఉన్న హోటళ్లు చూస్తుంటే.. నోరూరుతోందా..? అయితే తస్మాత్ జాగ్రత్త.. మీ ప్రాణాలకు మీరే గ్యారంటీ.. బయటికెళ్లి రెండే అరటిపండ్లు తినండి.. లేదా గ్లాసడు మంచినీళ్లు తాగి ఇంటికెళ్లేదాక ఓపిక పట్టండి. లేదంటారా.. తింటే.. మీ పరిస్థితి అంతే.. కరీంనగర్ బస్టాండ్ ఇన్‌గేట్ సమీపంలోని హోటళ్లలో పరిశుభ్రత ఎక్కడా కనిపించడం లేదు. తినుబండారాలపై కనీసం మూతలు ఉండవు. నాలుగు రోజుల క్రితం సమోసలో పురుగులు రాగా.. ప్రయాణికులు గొడవకు దిగారు. ఆర్టీసీ అధికారులు ఆ హోటళ్లతో వచ్చే ఆదాయమే కాకుండా.. అందులో నాణ్యతపై కూడా దృష్టిపెట్టాలని ప్రయాణికులు.. పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

కంటి వెలుగు శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పిల్లి శ్రీలత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ సోమవారం ప్రారంభించారు. 18 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బద్దిపల్లిలో ఐదు రోజుల పాటు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిట్టల కరుణ, ఎంపీడీవో ఏ.శ్రీనివాసరెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, సర్పంచ్ రాచమల్ల మధు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాచమల్ల మనోజ్, డాక్టర్ రాకేశ్, పంచాయతీ కార్యదర్శి అఖిల్, వార్డు సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ, డ్రెయినేజీ పనులకు భూమిపూజ



కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలోని 8వ వార్డులో రూ.5లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు సోమవారం భూమిపూజ చేశారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఫక్రుద్దీన్, ఎస్కే బాబ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం


రఘునందన్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన రఘునందన్‌రావును సోమవారం కోర్టు ఆవరణలో బీజేపీ నగర పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, బీజేపీ నాయకులు, న్యాయవాదులు కోమల ఆంజనేయులు, జానపట్ల స్వామి, బండారు శ్రీనివాస్, బండ రమణారెడ్డి, ఎడమ సత్యనారాయణరెడ్డి, ఈరెడ్డి తిరుమలరెడ్డి, రెడ్డెడ్డి శ్రీనివాస్, కొంగల రాజురెడ్డి, పుప్పాల ఆంజనేయులు, దయ్యాల సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఎస్సీలకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాతంగి రమేశ్, గాలిపెల్లి శ్రీనివాస్, కాలిపల్లి శ్రీనివాస్, అక్కపాక ఆకాశ్, గడ్డం కొమురక్క, అంబాల అనూష, కడారి పవన్ కళ్యాణ్, తోటపల్లి భరత్‌లు ఉన్నారు.

అభివృద్ధికి 'దారి' ఏది?

- ఆగిన చింతకుంట – కొత్తపల్లి రోడ్డు పనులు
- కంకర పోశారు.. తారు వేయడం మరిచారు..
- రైతులు, ప్రయాణికులకు తప్పని అవస్థలు


మల్కాపూర్ గ్రామ శివారులో కంకరపోసిన రోడ్డు

కొత్తపల్లి: మెరుగైన రవాణా వ్యవస్థను ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ లక్ష్యం కలగా మిగులుతోంది. అధికారుల ఉదాసీన వైఖరి.. కాంట్రాక్టర్ కంపెనీ నిర్లక్ష్యం వెరసి అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో రైతులు, ప్రయాణికులు ఇబ్బందులెదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టు కంపెనీ నిర్మాణ గడువు ముగిసినప్పటికీ పనులు పూర్తి చేయకపోగా.. ఉన్న మట్టి రోడ్డుపై కంకరపోసి 20 నెలలుగా మరో సమస్యకు కారణమైంది. చింతకుంట–కొత్తపల్లి(హెచ్) వయా మల్కాపూర్ రోడ్డుపై కంకర పోసి తారు వేయకపోవడంతో ప్రయాణానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ప్రయాణానికి ఆటంకం కలగకుండా చూడాలని రైతులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్ధంతరంగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు

కొత్తపల్లి మండలం చింతకుంట నుంచి మల్కాపూర్ మీదుగా కొత్తపల్లి (కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి) వరకు 5.05 కిలోమీటర్ల రోడ్డును రూ.270.80 లక్షల వ్యయంతో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్–3 కింద నిర్మించేందుకు భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణ పనులను చేజిక్కించుకున్న గౌతం అండ్ కంపెనీ 12 నెలల కాల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉండగా 20 నెలలు గడుస్తున్న ఎలాంటి పురోగతి లేకపోవడం ఇబ్బందికి కారణమవుతోంది. అంతేగాకుండా ఐదేళ్ల మెయింటనెన్స్ కింద రూ.17.65 లక్షల నిధులకు సైతం పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. ఈమేరకు 2021 జూలై 28న చింతకుంట వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఈ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఏడాది కాల వ్యవధిలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలన్న నిబంధనలు తుంగలో తొక్కుతూ సదరు కాంట్రాక్టు కంపెనీ పనులను అర్ధాంతరంగా వదిలేసింది. అంతేగాకుండా మట్టి రోడ్డుపై కంకరపోసి ప్రయాణానికి ఆటంకం కలిగేలా కొత్త సమస్యకు తెరలేపింది. దీంతో పొలాల వద్దకు వెళ్లే రైతులకు కంకరపై నడవడం ఇబ్బందిగా మారింది. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు. చింతకుంట వయా మల్కాపూర్ మీదుగా కొత్తపల్లి(హెచ్) వరకు రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రయాణ దూరం తగ్గడంతో మెరుగైన రవాణా జరుగనుంది.

పనులు ప్రారంభించేలా చర్యలు

చింతకుంట–కొత్తపల్లి(హెచ్) వయా మల్కాపూర్ బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. రోడ్డు పనులు చేపట్టేలా సంబంధిత కాంట్రాక్టు కంపెనీకి ఆదేశాలిస్తాం.

– కె.నవీన్‌కుమార్, డీఈఈ, పీఆర్

పోషకాహారంపై అవగాహన కల్పించాలి


ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, అంగన్‌వాడీ టీచర్లు

కరీంనగర్‌రూరల్: పోషకాహారంపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అన్నారు. సోమవారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మండల స్థాయి పోషణ్ పక్వాడా ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మిల్లెట్స్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోషక విలువలతో కూడిన వంటల పోటీలను పురుషులకు నిర్వహించారు. వెల్‌బేబీ షో నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ పురుమల్ల లలిత, బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొత్తపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, చిన్న పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా కరీంనగర్‌లోని కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మిల్లెట్ ఫుడ్ వంటల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై వంటల పోటీలను పరిశీలించి మిల్లెట్ ఫుడ్‌పై అవగాహన కల్పించారు. రక్తహీనత నుంచి కాపాడుకోవడంతో పాటు వారిలో ఎదుగుదలకు మిల్లెట్ ఆహారం దోహదపడుతుందన్నారు. అనంతరం పోషణ్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసరెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ స్పందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమణి, శాలిని, మల్లేశం, లక్ష్మయ్య, గ్రామ కార్యదర్శులు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ గౌతమినగర్ ఫీడర్ పరిధిలోని వినాయకనగర్, కట్టరాంపూర్, భవానీనగర్, మహాలక్ష్మి ఆలయం, శ్రీనగర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, గంగపుత్ర వీధి, న్యూ శ్రీనగర్‌కాలనీ, హరిహరనగర్, విశ్వబ్రాహ్మణకాలనీ, గౌతమినగర్, తులసినగర్, కట్టరాంపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.4 కోట్లతో దశల వారీగా అభివృద్ధి పనులు

- మేయర్ సునీల్‌రావు


పనులు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ సిటీ: నగరంలో రూ.4 కోట్లతో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. సోమవారం 11వ డివిజన్‌లో పర్యటించి కార్పొరేటర్ ఆకుల నర్మదతో కలిసి రూ.25 లక్షల నిధులతో నిర్మించే ఎస్‌డబ్ల్యూజీ పైపులైన్, అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 11వ డివిజన్ కట్టరాంపూర్ ప్రాంతం కూడా శివారు ప్రాంతమమని, పేద ప్రజలు నివసిస్తున్నందున అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా స్టేడియం నుంచి గౌతమినగర్ సిరిసిల్ల బైపాస్ వరకు స్మార్ట్ రోడ్డు నిర్మించామన్నారు. శ్రీనగర్‌కాలనీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించామని తెలిపారు. కట్టరాంపూర్, ఫకీర్‌వాడలో రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సరఫరా సమస్యలను కూడా పరిష్కరించామన్నారు. వాసుదేవకాలనీలో 40 ఫీట్ల ప్రధాన రోడ్డును, 3 రిజర్వాయర్ల పరిధిలోని డివిజన్లకు పైలెట్ ప్రాజెక్టు కింద 24గంటల నీటిసరఫరాను త్వరలోనే చేస్తామని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం నగరంలోని అన్ని డివిజన్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఓంప్రకాశ్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి


కొత్తపల్లిలో కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు, కౌన్సిలర్లు


చామనపల్లిలో కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

కరీంనగర్‌సిటీ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 96వ జయంతి వేడుకలను నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మేయర్ సునీల్‌రావుతో పాటు పలువురు కార్పొరేటర్లు, అధికారులు కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసి అమరులైన గొప్ప మహనీయులన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు వాసాల రమేశ్, జేరిపోతుల మొండయ్య, గండు రాంబాబు, సత్యనారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఫక్రుద్దీన్, కురుమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమురయ్య పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ రాజు అన్నారు.

కరీంనగర్‌రూరల్: చామనపల్లిలో కురుమ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కురుమ సంఘం అధ్యక్షుడు బోగొండ ఐలయ్య, యూత్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు బండారి లింగయ్య, కొమురయ్య, వీరయ్య, హరిప్రసాద్, రమేశ్, శ్రీనివాస్, నరేశ్, తిరుపతి, నర్సయ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భట్రాజు సంఘం రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శిగా శ్రీనివాసరాజు


శ్రీనివాసరాజు

కరీంనగర్: భట్రాజు సంఘం రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన ఈలపంటి శ్రీనివాసరాజు సోమవారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని అన్నారు. శ్రీనివాసరాజు ప్రస్తుతం రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ వద్ద వ్యక్తిగత సహాయకులుగా పనిచేస్తున్నారు. 30 ఏళ్లుగా సాంస్కృతిక, కళారంగంలో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. శ్రీనివాసరాజు నియామకంపై రాష్ట్రంలోని సాంస్కృతిక సారథి కళాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

తైబజార్ వేలం రద్దు చేయాలని ఫిర్యాదు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో తైబజార్(అంగడి) వేలం రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్‌గౌడ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతేడాది రూ. 45 లక్షలకు తైబజార్ దక్కించుకున్నారని, ఈసారి రూ. 37.65 లక్షలు దాటకుండా కాంట్రాక్టర్లు సిండికేటుగా మారి మున్సిపల్ కార్యాలయంలో రహస్యంగా వేలం నిర్వహణ జరిగిందని అన్నారు. మున్సిపల్ ఆదాయానికి లక్షల్లో గండి పడుతుందని, గతంలో వేలం దక్కించుకున్న వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని, తక్కువకు వేలం వేసిన కాంట్రాక్టును రద్దు చేయాలని, బాధ్యులపై చర్యలు చేపట్టి, మున్సిపల్ ఆదాయం సమకూరేలా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రైల్వేగేట్ తెరిపించాలని వినతి

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలోని ఎల్‌సీ నంబర్ 25/ఈ రైల్వే గేట్‌ను మరమ్మతుల కోసం మార్చి 12న మూసివేసిన అధికారులు తిరిగి తెరవడం లేదని దేశరాజ్‌పల్లి గ్రామస్తులు సోమవారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గేట్ మూసివేయడంతో పంట పొలాల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందని, పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, తక్షణమే గేట్ తెరిచేలా కృషి చేయాలని విన్నవించారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఉప్పు రాంకిషన్, జాతరగొండ అయిలయ్య, మహేందర్, సాగర్, కనకయ్య, రాజేశం, ఆనందం, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

'చెరువు శిఖంలో ఆలయం నిర్మించొద్దు'

గన్నేరువరం: మాదాపూర్ గ్రామ చెరువు శిఖంలో రామాలయ నిర్మాణం చేపట్టకుండా సంబంధిత అధికారులు చెరువును కాపాడాలని అఖిలపక్షం నాయకులు సపంతి ఉదయ్, కొమ్మెర రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ కొందరు నాయకులు స్వార్థ రాజకీయాల కోసం ఆలయ నిర్మాణం చేపట్టడం సమంజసం కాదన్నారు. సంబంధిత వ్యక్తులపై అధికారులు కేసు పెట్టారని, భవిష్యత్ తరాలకు చెరువు ఎంతో ముఖ్యమని దీనిపై కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సైతం చెరువులో పురాతన విగ్రహాలు ఉన్నాయనడం దురదృష్టకరమన్నారు. పురాతన విగ్రహాలు లేవని, చెరువులోకి తరలించిన మట్టిని తొలగించే ప్రక్రియ చేపట్టాలని కోరారు.

పరామర్శ



కరీంనగర్‌టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అత్తమ్మ వనజ ఇటీవల మృతి చెందగా సోమవారం మున్నూరు కాపు సంఘం నాయకులు సంజయ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో కోల అన్నారెడ్డి, సంపత్‌రెడ్డి, కర్ర రాజశేఖర్, కిషన్, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, గుగ్గిళ్లపు రమేశ్, డాక్టర్ పుల్లెల పవన్‌కుమార్, బొమ్మ రాధాకృష్ణ, నలువాల రవీందర్, తోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఎస్సెస్సీ' పరీక్షలు ప్రారంభం


దుర్శేడ్‌లో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్, నగునూరు జెడ్పీ పాఠశాల, బొమ్మకల్‌లోని సిద్ధార్థ హైస్కూల్‌లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ మండలంలోని దుర్శేడ్, బొమ్మకల్, చామనపల్లి, జూబ్లీనగర్, మొగ్ధుంపూర్, నగునూరు జెడ్పీ పాఠశాలలతో పాటు మూడు మైనార్టీ గురుకుల, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల నుంచి 428 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో బాలురు 321 మంది, బాలికలు 107 మంది ఉన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలకు తరలిరావడంతో సందడిగా మారాయి. విద్యార్థులను తనిఖీ చేసిన ఉపాధ్యాయులు అరగంట ముందు పరీక్షా హాల్లోకి పంపించారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో మధుసూదన్‌చారి తెలిపారు.

నిజమే.. నిధులు మళ్లించాం!

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన వ్యక్తిగత వైద్యుడే పరోక్షంగా సమ్మతించడంతో విచారణకు అంగీకరించక తప్పలేదు. చిట్‌ఫండ్ చట్టం, రిజర్వ్‌బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డ రామోజీరావును సీఐడీ అధికారులు హైదరాబాద్‌లో సోమవారం దాదాపు 8 గంటలపాటు విచారించారు. విచారణ ప్రక్రియను పూర్తిగా ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. కేంద్ర చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా భారీగా నిధుల మళ్లింపు, రిజర్వ్ బ్యాంకు నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ డిపాజిట్ల సేకరణపై ఆధారాలతో విచారించారు. ఈ కేసులో ఏ–2గా ఉన్న రామోజీరావు కోడలు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజను ఈ నెల 6న సీఐడీ అధికారులు విచారించనున్నారు. అనంతరం కేసు దర్యాప్తులో పురోగతిని సమీక్షించి రామోజీరావు, శైలజను ఆంధ్రప్రదేశ్‌కు పిలిచి మరోసారి విచారించాలని సీఐడీ భావిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

తప్పించుకునేందుకు చివరిదాకా యత్నం..

మార్గదర్శి అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ విచారణను తప్పించుకునేందుకు రామోజీరావు చివరి వరకూ ప్రయత్నించారు. రామోజీరావు, శైలజ హైదరాబాద్‌లోనే వారి నివాసంలోగానీ కార్యాలయంలోగానీ విచారణకు హాజరు కావాలని పేర్కొంటూ సీఐడీ అధికారులు నోటీసులిచ్చారు. నాలుగు తేదీలు సూచించి వారికి అనువైన రోజు విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. నిబంధనల మేరకు కేసు దర్యాప్తులో భాగంగా విచారిస్తామని స్పష్టం చేశారు. అయితే విచారణను తప్పించుకునేందుకు రామోజీరావు కాలయాపన చేశారు. చివరికి మార్చి 3న రామోజీ ఫిల్మ్‌సిటీలోని తన కార్యాలయంలో విచారణకు హాజరవుతానని సీఐడీకి తొలుత సమాచారం ఇచ్చారు. తీరా సోమవారం రోజు ఫిల్మ్‌సిటీలో కాకుండా జూబ్లీహిల్స్‌లోని తన కోడలు శైలజ కిరణ్ నివాసంలో విచారణకు హాజరవుతానని పేర్కొనగా అందుకు సీఐడీ అధికారులు సమ్మతించారు. ఈ మేరకు సీఐడీ ఎస్పీ అమిత్ బర్దార్, విచారణాధికారి రవికుమార్‌తోపాటు అధికారుల బృందం జూబ్లీహిల్స్‌లోని శైలజ నివాసానికి ఉదయం 10.30 గంటలకు చేరుకుంది. సీఐడీ అధికారులు రావడమే ఆలస్యం తన ఆరోగ్యం సరిగా లేనందున విచారణకు సహకరించలేనని రామోజీ పేర్కొన్నారు. అనారోగ్యానికి కారణాలు, నివేదికలు అందచేసి విచారణకు హాజరు కాలేరని ధృవీకరించాలని రామోజీరావు వ్యక్తిగత వైద్యుడిని సీఐడీ అధికారులు కోరారు. దీంతో రామోజీని విచారించవచ్చని, మంచంపై పడుకుని సమాధానాలు ఇస్తారని ఆయన వైద్యుడు చెప్పడంతో అందుకు సీఐడీ అధికారులు సమ్మతించారు. ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని, కేసును సక్రమంగా విచారించడమే తమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఇక తప్పదని స్పష్టం కావడంతో సీఐడీ అధికారుల విచారణకు రామోజీ సమ్మతించారు.



ఆరోగ్యం బాగోలేదంటూ మంచంపైన రామోజీరావు.. కానీ, ఆరోగ్యం బాగానే ఉందన్న సొంత డాక్టర్.. ఈ సందర్భంగా వీడియో రికార్డింగ్‌తో విచారిస్తున్న సీఐడీ అధికారులు

ఆడియో... వీడియో రికార్డింగ్

విచారణ సందర్భంగా సీఐడీ అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించారు. ఈ ప్రక్రియ మొత్తం రికార్డింగ్ చేశారు. రామోజీ పడుకున్న మంచం సమీపంలోనే వేర్వేరు కోణాల్లో రెండు కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయనకు కాస్త దూరంగానే సీఐడీ అధికారులు కూర్చున్నారు. విచారణ సందర్భంగా రామోజీరావు చెప్పిన సమాధానాలు, ఆయన హావభావాలు అన్నీ రికార్డ్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సుదీర్ఘ విచారణ సందర్భంగా సీఐడీ అధికారుల బృందం అక్కడ కనీసం మంచినీళ్లు కూడా తాగలేదు. తమకు కావల్సిన ఆహారం, మంచినీళ్లు అంతా బయట నుంచే తెచ్చుకున్నారు.

నిధుల మళ్లింపు, అక్రమ డిపాజిట్లపై..

విచారణలో సీఐడీ అధికారులు కీలక విషయాలను రాబట్టినట్టు సమాచారం. ప్రధానంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులు అక్రమంగా బదిలీ, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ, రికార్డుల నిర్వహణలో అవకతవకలపై ప్రశ్నించినట్లు సమాచారం. మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీల్లో కనుగొన్న ఆధారాలు, బ్రహ్మయ్య అండ్ కో చార్టర్డ్ అకౌంటెంట్ శ్రావణ్ ఇచ్చిన వాంగ్మూలం కాపీలను చూపిస్తూ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేసేందుకు రామోజీరావు ప్రయత్నించారు. కీలక పత్రాలు, బ్యాంకు లావాదేవీల కాపీలు, బ్యాలెన్స్ షీట్ల కాపీలను చూపిస్తూ అధికారులు ప్రశ్నించడంతో ఇక మాట్లాడలేకపోయారని తెలుస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లోని నిధులను ప్రధాన కార్యాలయానికి మళ్లించడం నిజమా.. కాదా? అని సూటిగా ప్రశ్నించడంతో అవునని రామోజీ అంగీకరించాల్సి వచ్చింది. చిట్‌ఫండ్స్ నిధులను నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఇతర షేర్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టిన ఆధారాలను కూడా సీఐడీ అధికారులు చూపించి ప్రశ్నించగా అదంతా మార్గదర్శి ఆర్థిక ప్రణాళికలో భాగమని రామోజీ చెప్పినట్టు సమాచారం. అంటే చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం వాస్తవమే కదా? అని ప్రశ్నించడంతో ఔనని రామోజీరావు అంగీకరించారని సమాచారం. చిట్టీల చందాదారులు పాడిన మొత్తాన్ని ఇవ్వకుండా 'రశీదు' మాత్రమే ఇస్తూ 5శాతం వడ్డీ చెల్లిస్తున్న విషయంపై కూడా సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించారు. తాము అట్టిపెట్టుకున్న మొత్తానికి వడ్డీ చెల్లిస్తున్నాం కదా అందులో అక్రమం ఏముందనీ రామోజీరావు ఎదురు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని చెప్పి నగదును అట్టిపెట్టుకోవడం అంటే అది డిపాజిట్ సేకరణే అవుతుంది కదా... చిట్‌ఫండ్ కంపెనీలను డిపాజిట్ల సేకరణకు రిజర్వ్‌బ్యాంకు అనుమతించిందా? అంటే రామోజీరావు స్పందించకుండా మౌనం వహించారని సమాచారం. అంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ అధికారులు నమోదు చేసిన అభియోగాలన్నీ దాదాపు వాస్తవమేనని ఆయన పరోక్షంగా సమ్మతించినట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికే మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు, ఆడిటింగ్ వ్యవహారాలు చూసిన చార్టర్డ్ అకౌంటెంట్ కూడా నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు, అక్రమ డిపాజిట్లకు పాల్పడినట్టు సమ్మతించారు.

స్టేట్‌మెంట్ విశ్లేషించాక తదుపరి చర్యలు: అమిత్ బర్దార్, ఎస్పీ

'మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాలకు సంబంధించి 7 కేసులు నమోదయ్యాయి. రామోజీరావును విచారించి ఆయన స్టేట్‌మెంట్ నమోదు చేశాం. అది విశ్లేషించాల్సి ఉంది. మార్గదర్శి ఎండీ శైలజను ఈ నెల 6న విచారిస్తాం. కేసులో కనుగొన్న ఆధారాలు, పురోగతిని బట్టి తదుపరి చర్యలు చేపడతాం'

సహకరించని రామోజీ

సీఐడీ అధికారులు విచారణ మొదలు పెట్టిన తరువాత రామోజీరావు సమాధానాలు చెప్పేందుకు చాలాసేపు ససేమిరా అన్నారు. సీఐడీ పరిధినే ప్రశ్నిస్తూ తనను అసలు విచారించడానికే వీల్లేదన్నట్టుగా వ్యవహరించడం గమనార్హం. తాను విచారణ సంస్థలకు అతీతమన్నట్టు మొండిగా వ్యవహరించారు. దీంతో చట్ట నిబంధనలను తెలియచేస్తూ సీఐడీ అధికారులు విచారణ ప్రక్రియ కొనసాగించారు. చిట్‌ఫండ్స్‌లో అక్రమ వ్యవహారాలన్నింటికీ తమ బ్రాంచి మేనేజర్లు(ఫోర్‌మెన్), అకౌంటెంట్లదే బాధ్యతని, తనకు సంబంధం లేదని తప్పించుకునేందుకు రామోజీరావు ప్రయత్నించారు. బ్రాంచి కార్యాలయాల్లోనే అన్ని వ్యవహారాలు సాగినందున వారినే ప్రశ్నించాలని మొండికేసినట్లు తెలుస్తోంది. బ్రాంచి మేనేజర్లకు రూ.500కు మించి చెక్‌పవర్ లేనప్పుడు భారీగా నిధుల బదిలీపై వారిని మాత్రమే ఎలా బాధ్యులను చేస్తామని సీఐడీ అధికారులు ఎదురు ప్రశ్నించడంతో రామోజీరావు మౌనం వహించారు. బ్రాంచిల నుంచి నిధులన్నీ హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలింపుపై కూడా తనకు సంబంధం లేదని రామోజీ వాదించారు. మరి చెక్ పవర్ మార్గదర్శి ఎండీ శైలజ, ప్రధాన కార్యాలయంలోని మరో 10 మంది వద్ద ఎందుకు ఉందని విచారణ అధికారులు ప్రశ్నించడంతో రామోజీ సమాధానం చెప్పలేకపోయారు. చందాదారుల సొమ్మును మ్యూచువల్ ఫండ్స్, షేర్‌మార్కెట్లో పెట్టుబడుల ద్వారా ఆర్జించిన ఆదాయం అంతా చైర్మన్, ఎండీలుగా వారే ప్రయోజనం పొందుతున్నప్పుడు కేవలం జీతాలకు పనిచేసే మేనేజర్లు ఎలా బాధ్యులవుతారని సీఐడీ అధికారులు ప్రశ్నించారు.

తదుపరి విచారణ ఏపీలో!

మార్గదర్శి వ్యవహారంలో ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ అధికారులు కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేయనున్నారు. అందుకోసం రామోజీరావు, శైలజలను త్వరలో ఆంధ్రప్రదేశ్‌కు రప్పించి విచారించాలని భావిస్తున్నారు. నేరం జరిగిన ప్రదేశం(సీన్ ఆఫ్ అఫెన్స్) ఆంధ్రప్రదేశ్ కాగా మన రాష్ట్రంలోని చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ తరలించారు. కేసు దర్యాప్తు తీరును సమీక్షించిన అనంతరం తదుపరి విచారణ కోసం రామోజీరావు, శైలజలను రాష్ట్రానికి రప్పించాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో వారు ఎంపిక చేసుకున్న నగరంలో విచారించేందుకు సమాయత్తమవుతున్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై ఆ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇతర రాష్ట్రాలకు ఇప్పటికే సీఐడీ అధికారులు సమాచారం ఇచ్చారు.

సన్నాలకు 'మద్దతు'కు మించి ధర

- క్వింటాలుకు రూ.2,330 నుంచి రూ.2,370 వరకు చెల్లింపులు
- పోటీ పడి కొంటున్న రైస్ మిల్లర్లు
- భారీ డిమాండ్‌తో రైతుల ఆనందం

మిర్యాలగూడ: ఈ సీజన్‌లో సన్న ధాన్యానికి భారీగా డిమాండ్ పెరగడంతో మిల్లర్లు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో యాసంగి సీజన్ సాగుకు సకాలంలో నీరు అందడంతోపాటు, దోమపోటు బెడద లేకపోవడంతో ధాన్యం దిగుబడి అధికంగా వచ్చింది. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ధాన్యం వాహనాల రాకను అడ్డుకుంటే స్థానిక రైతులు పండించిన ధాన్యానికి మరింత ధర వచ్చే అవకాశం ఉంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో యాసంగి సీజన్‌లో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సారి సన్నరకాల్లో అంకూర పూజ, హెచ్ఎంటీ, కావేరి చింట్లు వంటి వాటిని సాగు చేసిన రైతులు నేరుగా రైస్ మిల్లులకు తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా వద్ద భారీ రైస్‌మిల్లు ఉంది. గంటకు 16 టన్నుల ధాన్యాన్ని మర ఆడించే సామర్థ్యం ఉండటంతో ఆ పరిసర ప్రాంతాల రైతులందరూ ఆ మిల్లుకే ధాన్యం అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో మిర్యాలగూడ రైస్‌మిల్లర్లు కూడా ఎక్కువ ధర చెల్లించైనా కొనుగోలు చేయాలని పోటీపడుతున్నారు.



మిర్యాలగూడలో రైస్‌మిల్లుల వద్ద ధాన్యం ట్రాక్టర్లు

పక్క రాష్ట్రాల్లో డిమాండ్

సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి క్వింటాలుకు రూ.2,330 నుంచి రూ.2,370 వరకు చెల్లించి మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2060, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,040 ఉంది. తెలంగాణ సన్నరకం ధాన్యానికి కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో అధిక డిమాండ్ ఉండడంతో మన రాష్ట్రం ధాన్యాన్ని అక్కడి వారు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెపుతున్నారు. ధాన్యానికి మంచి ధర వస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

సన్నాలకు మద్దతు ధర మించి చెల్లిస్తున్నారు



ఇటీవలే నేను ధాన్యాన్ని రైస్ మిల్లుకు తీసుకుపోయి అమ్మగా క్వింటాలుకు రూ.2,350 చొప్పున ధర చెల్లించారు. రెండు ఎకరాల్లో 70 బస్తాల ధాన్యాన్ని పండించాను. ప్రభుత్వ మద్దతు ధరకు మించి రేటు రావడంతో ఆనందంగా ఉంది.
– ఠాకూర్ బాలాజీసింగ్, రైతు, పెద్దదేవులపల్లి

నాణ్యమైన ధాన్యానికి గరిష్ట మద్దతు ధర



రైతులు మిల్లులకు తీసుకొచ్చిన నాణ్యమైన ధాన్యానికి గరిష్ట మద్దతు ధర లభిస్తుంది. రైస్ మిల్లులకు ఒకేసారి భారీ ఎత్తున ధాన్యంతో రాకుండా రైతులు విడతల వారీగా ధాన్యం తీసుకొస్తే ఇదే ధర కొనసాగించే అవకాశం ఉంది.
– కర్నాటి రమేశ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



చింతకాని: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన మరువక ముందే పదో తరగతి వార్షిక పరీక్ష పత్రాలు బయటకు వచ్చాయని.. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారాన్ని మరువకముందే పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ కావడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల విషయంలో ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ ఘటనల ద్వారా తెలుస్తోందని చెప్పారు. 30 లక్షల మంది నిరుద్యోగ యువతతో పాటుగా పదో తరగతి విద్యార్థులకు సీఎం కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పడంతో పాటు రాజీనామా చేయాలని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. తన పార్టీ మార్పుపై అతిత్వరలోనే ప్రజా మోద నిర్ణయాన్ని తీసుకుంటానని తెలిపారు.

అటవీ ప్రాంతంలో నీటి వనరుల పరిశీలన

కాసిపేట: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రేంజ్ పరిధిలోని ముత్యంపల్లి, ధర్మరావుపేట సెక్షన్‌లలో అటవీ ప్రాంతంలో జంతువులకు నీటివనరుల కల్పనకు కట్టించిన చెక్ డ్యాం, నీటికుంటలు, రోడ్డు నిర్మాణ పనులు, ఎస్‌సీటీలపైన పెంచిన ఔషధమొక్కల ప్లాంట్‌ల పనులను సోమవారం ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్(ఎఫ్‌డీపీటీ) వినోద్‌కుమార్ పరిశీలించారు. వేసవిలో అటవీ జంతువులు గ్రామాల్లోకి రాకుండా, అడవుల్లోని నీటివనరులు ఉపయోగించుకునేలా చేసిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నీటి ఊటలను ఎప్పటికప్పుడు శుభ్ర పరచాలని, గ్రామస్తులకు అడవుల రక్షణపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట డీఎఫ్‌వో శివ ఆశిశ్‌సింగ్, ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహు, ఎఫ్ఆర్‌వో సుభాష్, డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్, ఎఫ్‌బీవో యుగేందర్, సిబ్బంది, తదితరులున్నారు.



అటవీ ప్రాంతంలో వాగులు పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ వినోద్ కుమార్

వేటగాళ్ల ముఠా పట్టివేత

- మహారాష్ట్రలో పులి చర్మం విక్రయిస్తుండగా అరెస్ట్
- విక్రయదారులంతా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులే



మహారాష్ట్ర అటవీ అధికారులకు చిక్కిన నిందితులు, స్వాధీనం చేసుకున్న పులి చర్మం

కెరమెరి(ఆసిఫాబాద్): కొంత కాలంగా పులి చర్మాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వేటగాళ్ల ముఠాను మహారాష్ట్ర అటవీ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. చంద్రాపూర్ జిల్లా జివితి తాలూకా పాటగూడలో ఆదివారం ఆరుగురు పులి చర్మం విక్రయిస్తుండగా పట్టుకొని వారి నుంచి పులి చర్మం స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులే. కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకాంత్‌పవార్, జివితి ఫారెస్టు రేంజ్ అధికారి సందీప్‌లాంగ్డె తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ అటవీ ప్రాంతంలో పులిని వేటాడి మహారాష్ట్రలోని జివితి తాలుకాలో విక్రయిస్తున్న పాటగూడకు చెందిన వికాస్ మాధవ్ గోట్ముకల్లె, కైరిగూడకు చెందిన పంద్రా జ్యోతిరామ్‌భిక్కు, చిక్రం ధోందిరాం లింబు, అదిమ్యాల్‌కు చెందిన చిక్రం తిరుపతి మహదు, కొరంగే సందీప్‌లింగు, నేట్నూర్‌కు చెందిన మడావి ఇస్రు సోము పులి చర్మాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. ఈమేరకు దాడిచేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఆసిఫాబాద్ పులే..

నిందితులను విచారణ చేయగా, వారివద్ద ఉన్న పులి చర్మం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పులిదే అని నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. ఈముఠా కోసం నాలుగు నెలలుగా నిఘా పెట్టామని తెలిపారు. ఎట్టకేలకు ముఠా చిక్కిందని వెల్లడించారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 లోని సెక్షన్ 39(3)డబ్ల్యూఆర్‌డబ్ల్యూ 57, 52/48 ఏఆర్‌డబ్ల్యూ 51కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

సావిత్రిబాయి పూలే కావ్యసంపుటి ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ప్రముఖ కవి డాక్టర్ దామెర రాములు రచించిన సావిత్రిబాయి పూలే కావ్య సంపుటిని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. సమాజాన్ని ప్రభావితం చేసి, స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన సావిత్రిబాయి పూలే లాంటి మహిళా మూర్తి చరిత్రను వచన, కవిత్వంలో రూపొందించిన దామెర రాములును మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో కవులు డాక్టర్ అప్పాల చక్రధరి, డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, డాక్టర్ మురళీధర్, ప్రముఖ న్యాయవాది వినోద్‌రావు, పత్తి శివప్రసాద్, నేరెళ్ల హనుమంత్, తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

స్వీయ ప్రేరణే విజయానికి సోపానం

భైంసా(ముధోల్): విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని హైదరాబాద్‌కు చెందిన హెచ్ఆర్ మేనేజర్ వర్షిణిరెడ్డి అన్నారు. సోమవారం బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థులకు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'స్వీయ ప్రేరణే విజయానికి సోపానం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లేస్‌మెంట్ల కోసం వివిధ చిట్కాలు–ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హరిబాబు, ఫ్యాకల్టీ ఇన్‌చార్జీలు రవికాంత్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్ఆర్ మేనేజర్ వర్షిణిరెడ్డి



మహాగాంలో కుస్తీ పోటీలు

భైంసారూరల్(ముధోల్): నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మహాగాంలో సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. మహాదేవుని జాతరలో భాగంగా నిర్వహించిన పోటీలకు జిల్లా నుంచే కాకుండా సరిహద్దులోని మహారాష్ట్ర నుంచి కూడా మల్లయోధులు తరలివచ్చారు. త్రయంబకేశ్వర ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కరీంనగర్ డీసీసీబీ నికర లాభం రూ.91.40కోట్లు

- 2023–24లో రూ.7 వేల కోట్ల వ్యాపారం లక్ష్యం
- కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్ అర్బన్: రాష్ట్రంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సహకార బ్యాంకులు రూ.40,000 కోట్ల వ్యాపారం చేశాయని, ఒక్క కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) రూ.5,625 కోట్ల వ్యాపారం చేసిందని కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు తెలిపారు. కరీంనగర్ డీసీసీబీ 2021–22 సంవత్సరంలో నమోదైన రూ.68.08 కోట్ల నికర లాభం నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.91.40 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందని వివరించారు. సోమవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో గత ఆర్థిక సంవత్సర ప్రగతిపై మాట్లాడారు. బ్యాంక్ తన స్థూల నిరర్థక ఆస్తులను (ఎన్‌పీఏ) 2021–22 సంవత్సరంలో 1.50 శాతం నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరంలో 1 శాతానికి తగ్గించిందని అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ 14.79 శాతం వృద్ధి రేటుతో రూ.5,625 కోట్ల వ్యాపారం చేసిందని వెల్లడించారు. కొన్ని డిపాజిట్లను కోల్పోయినప్పటికీ, బ్యాంక్ స్థిరమైన వృద్ధిని సాధించిందని, 2012 నుంచి స్థిరమైన లాభాలను ఆర్జించడంతో కేడీసీసీబీ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.7 వేల కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,500 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, టర్మ్‌లోన్‌కు రూ.300 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.150 కోట్లు, విద్యా రుణాలకు రూ.100 కోట్లు, గృహ రుణాలకు రూ.200 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇతర రుణాలకు రూ.1550 కోట్లు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. కేడీసీసీబీ దేశానికి రోల్ మోడల్‌గా అవతరించిందన్నారు. కేడీసీసీబీ ఉపాధ్యక్షుడు పింగళి రమేశ్, డైరెక్టర్లు పి.మోహన్ రెడ్డి, స్వామిరెడ్డి, సీఈవో ఎన్.సత్యనారాయణరావు, నాబార్డు డీడీఎం పి.అనంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు

రవాణాశాఖ వార్షిక లక్ష్యం రూ.345 కోట్లు

తిమ్మాపూర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 2023–24 వార్షిక ఆదాయ లక్ష్యాన్ని రూ.345 కోట్లు నిర్దేశించినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. రవాణా శాఖ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరాజు రాష్ట్ర వ్యాప్త రవాణా శాఖ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ 2022–23 సంవత్సరానికి రూ.303 కోట్లు ఆదాయాన్ని సాధించినందుకు అధికారులను అభినందించారు. 2023–24 సంవత్సరానికి సైతం రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన రూ.345 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవడంలో కృషి చేయాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీటీసీ అధికారులు

జిల్లాల వారీగా లక్ష్యం..

- కరీంనగర్ జిల్లాకు రూ.169 కోట్లు, పెద్దపల్లి జిల్లాకు రూ.80 కోట్లు, జగిత్యాల జిల్లాకు రూ.58 కోట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.38 కోట్లు నిర్దేశించినట్లు డీటీసీ తెలిపారు. వాహనదారులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తామని చెప్పారు. వీడి యో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల రవాణా శాఖ అధికారులు రంగారావు, శ్యామ్ నాయక్, కొండల్ రావు తోపాటు ఎంవీఐలు అల్లె శ్రీనివాస్, గౌస్ పాషా, నాగ లక్ష్మి, సిరాజ్, మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో సమయం, ఖర్చు ఆదా చేయొచ్చు

- కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

వీణవంక: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయడం ద్వారా సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చని దీంతో సమయం, ఖర్చు ఆదా అవుతుందని కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని కోర్కల్, మామిడాలపల్లి గ్రామంలో భారతీయ వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్, జమ్మికుంట కేవీకే సమన్వయంతో డ్రోన్‌తో వరిలో పురుగుల మందు స్ప్రేచేసే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్‌తో పిచికారీ చేస్తే కూలీల కొరత తగ్గుతుందన్నారు. ఎకరాకు 5–6 నిమిషాల్లో స్ప్రే పూర్తవుతుందని, పురుగుల మందు కూడా ఆదాఅవుతుందన్నారు. డ్రోన్‌తో ఫోటోలు తీసి ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో మరింత విశ్లేషించుకోవచ్చని, తెగుళ్ల, పురుగు ఉధృతిని ముందే తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, శాస్త్రవేత్తలు విజయ్, శ్రీనివాస్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.





● ప్రదర్శనకు వచ్చిన వారితో 'ఎడిస్టీస్' టీమ్

బంగారంలాంటి ఆలోచన

బంగారు ఆభరణాలు తయారుచేసే స్వర్ణకారుల జీవితాలు బంగారమయంగా ఉన్నాయా.. ఈ విషయాన్ని నేరుగా తెలుసుకోవడమే కాదు వారికి సాయం చేయాలనే ఆలోచనతో పాతికేళ్ల లోపు యంగ్‌స్టర్స్ స్వచ్ఛందంగా వారిని కలిసి, ఆభరణాలను తయారుచేయించి హైదరాబాద్ తెల్లాపూర్‌లో ప్రదర్శనను ఏర్పాటుచేశారు.

గ్లోబలైజేషన్‌లో భాగంగా పెద్ద పెద్ద జ్యువెలరీ షాపులు, కంప్యూటర్ డిజైన్స్ వచ్చాక స్వర్ణకారుల ప్రాభవం మసకబారిపోతోందని, వారి కళను బతికించడం కోసం చేస్తున్న ప్రయత్నమిదని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. వీరిలో శ్రీహర్షిత, ప్రద్యుమ్న, రిత్విక్, ప్రకృతి, సంస్కృతి, సర్వనా, సాత్విక్, భరణ్య, అజయ్, భగీరథ్ లు ఉన్నారు. ఈ కార్యక్రమం గురించి వీరితో మాట్లాడినప్పుడు స్వర్ణకారుల కళ, వారి శ్రమకు తగిన ఫలం రాబోయే రోజుల్లో మరింతగా పెరగాలని కోరుకున్నారు.



● స్వర్ణకారుల్తు తయారు చేసిన ఆభరణాల ప్రదర్శన

స్వర్ణకారులు తయారుచేసిన ఆభరణాల ప్రదర్శనకు ముందుండి నడిచిన చాడా శ్రీహర్షిత లా పూర్తి చేసి, తెలంగాణలోని 'బచ్‌పన్ బచావో ఆందోళన్'కి లీగల్ కన్సల్టెంట్‌గా వర్క్ చేస్తోంది. భరణ్య లా చదువుతోంది. రుత్విక్ డాక్టర్ కాగా స్వాతిక్ లా చేస్తున్నాడు. ప్రకృతి పన్నెండవ తరగతి పూర్తిచేసి సైకాలజీ పట్టా పొందడానికి కృషి చేస్తోంది. ప్రద్యుమ్న, భగీరథ్‌లు బీటెక్ చేస్తున్నారు. ఇక సర్వనా, సంస్కృతిలు స్కూల్ ఏజ్‌లోనే ఉన్నారు.

నేరుగా కలిసి..

తాము చేస్తున్న కార్యక్రమాల గురించి శ్రీహర్షిత మాట్లాడుతూ 'ఎడిస్టీస్ ఎన్జీవోని కిందటేడాది ప్రారంభించాం. దీని ద్వారా ప్రభుత్వ స్కూల్ పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి, వారిలో మంచి మార్పులు తీసుకురావాలనే ఆలోచనతో కార్యక్రమాలు చేస్తుంటాం. ఇందుకు కర్నూలు వాసి అయిన నర్మదా టీచర్ ప్రెసిడెంట్‌గా ఉండి సరైన సూచనలు ఇస్తుంటారు. స్కూల్ కార్యక్రమాల తర్వాత హస్తకళలకు సాయం చేయాలనే ఆలోచన చేసినప్పుడు స్వర్ణకారుల జీవితాలను చూశాం. మూడు నెలల క్రితం అనుకున్న ఈ కార్యక్రమాన్ని వెంటనే మొదలుపెట్టాం' అని వివరిస్తే.. 'దాదాపు పాతికమంది స్వర్ణకారుల కుటుంబాలను నేరుగా కలిసి, వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకొని, ఒక డాక్యుమెంటరీ రూపొందించాం. ఆ తర్వాత కొంతమంది ప్రముఖులను కలిసి, స్వర్ణకారుల జీవితాల గురించి తెలియజేశాం. మేం ఏ కార్యక్రమం చేసినా, అందులో ప్రతీసారి కొత్తవారు సభ్యులు అవుతూ ఉంటారు. దీంతో మరికొందరికి సాయం చేయాలన్న ఆలోచన కూడా పెరుగుతోంది' అని వివరించింది భరణ్య.

కళను గుర్తించండి...



ఐదేళ్లుగా చాలా సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఎంత కష్టపడినా ఒక్కోరోజు నాలుగైదు వందలు కూడా రావు. బంగారాన్ని కాల్చి, తీగ తీసి, అత్యంత శ్రద్ధతో ఒక ఆభరణాన్ని తయారు చేయాలంటే ఎంతో టైమ్ పడుతుంది. ఇప్పుడంతా పెద్ద పెద్ద జ్యువెలరీ షాపులకే వెళుతున్నారు. మా దగ్గర ఆభరణాలు చేయించుకునేవారు బాగా తగ్గిపోయారు. ప్రస్తుతం మేం ఆర్థికంగానే కాదు ఆరోగ్య సమస్యలు కూడా ఎదుర్కొంటున్నాం. రాబోయే తరాలకు ఈ పని అందించే ధైర్యం చేయలేకపోతున్నాం. మా పిల్లలను వేరే పనులు చూసుకోమని చెబుతున్నాం. ఇలాంటి ప్రదర్శనల ద్వారా ప్రముఖులు మా పనిని గుర్తిస్తే ఈ కళ బతుకుతుంది.

– గోవింద్, స్వర్ణకారుడు

శ్రమ ఎక్కువ.. ఆదాయం తక్కువ

'హైదరాబాద్‌లోని కళాకారులనే కలుసుకున్నాం. వీరిలో స్థానిక కళాకారులే కాదు కలకత్తా, గుజరాత్.. వంటి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ సెటిల్ అయిన వారున్నారు. స్వర్ణకారుల షాప్‌లో ఒకరు మాస్టర్‌గా ఉంటారు. వారికి తప్ప మిగతా అందరికీ చాలా తక్కువ ఆదాయం ఉంటుంది. దీంతో కుటుంబాలు పోషించుకోలేని స్థితిలో ఉన్నవారిని చూశాం. జ్యువెలరీ అంటే లగ్జరీ గూడ్ అని మనకు తెలుసు. వీటిని తయారుచేసేవారి దగ్గర కూడా బాగా డబ్బు ఉంటుంది అనుకుంటాం. కానీ, వాళ్ల దగ్గర ఏమీ ఉండటం లేదు. ఈ కారణంగా వారి పిల్లలు కనీస చదువులు కూడా కొనసాగించలేకపోతున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 25 మంది కళాకారులు పాల్గొన్నారు. సందర్శకులు వారి ఆభరణాలు కొనుగోలు చేసి, స్వర్ణకారులకు సపోర్ట్‌గా నిలిచారు. ఈ కుటుంబాలకు మేం ఇలా సాయంగా ఉండటం మాకు చాలా ఆనందంగా ఉంది' అని వివరించారు ఈ యంగ్ స్టర్స్.

మన హస్తకళలన్నీ ముందు తరాలలోనూ సుసంపన్నంగా వెలగాలి. ఇలాంటి ప్రదర్శనలు మరిన్ని జనంలోకి వెళుతూ ఉంటే స్వర్ణకళాకారుల భవిత కూడా బంగారమే అవుతుంది.

– నిర్మలారెడ్డి

ప్రత్యేకమైనది

ఏ పని అయినా ఒకసారి చేసి వదిలేయడం వల్ల సరైన ఫలితాలు రావు. ఈ విషయం స్వర్ణకారులను కలిసినప్పుడు మరింతగా అర్థమైంది. నిరంతరం సమస్యలు ఎదుర్కొంటున్నవారికి ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో ఎంచుకున్న కార్యక్రమం ఇది. దీనికి చాలా మంది ప్రముఖుల నుంచి మద్దతు లభించింది. ఈ ఆలోచన ప్రత్యేకంగా ఉందని అభినందించారు.

– శ్రీహర్షిత

సాయపడదాం

జ్యువెలరీ షాపులు వచ్చాక స్వర్ణకారుల కళా నైపుణ్యం ప్రశ్నార్థకంగానే మారింది. కోవిడ్ తర్వాత వీరి ఇబ్బందులు మరీ పెరిగాయి. కంటిచూపు, గంటలు గంటలు కూర్చొని పని చేయడం వల్ల బ్యాక్‌పెయిన్‌తో సఫర్ అవుతున్నారు. ఈ విధంగా వారికి సాయం పడటం సంతోషాన్నిచ్చింది.

– ప్రకృతి

మేనత్త పోచవ్వ..!



● విజయలక్ష్మి

ఇప్పటి సంగతి ఏమోగాని ఒకప్పుడు ప్రతి ఇంట్లో మేనత్తల అజమాయిషీ ఉండేది. శుభాల్లో, అశుభాల్లో మేనత్త వచ్చి దగ్గర ఉండి మంచీ చెడ్డకు నిలిచేది. అనుబంధాల ఆనవాలు చెప్పేది. 'బలగం' సినిమా చూసి అందులో మేనత్త పోచవ్వగా నటించిన నటి విజయలక్ష్మిలో అందరూ తమ మేనత్తలను పోల్చుకుంటున్నారు. సురభి ఆర్టిస్టయిన 65 ఏళ్ల విజయలక్ష్మి కి ఇదే తొలి సినిమా. ఇంతకాలం గ్రాంథిక సంభాషణలు మాత్రమే పలికిన ఆమె పోచవ్వగా తెలంగాణ నుడికారాన్ని మెరిపించారు. ఆమె గొప్ప హరికథా కళాకారిణి కూడా. విజయలక్ష్మి పరిచయం.

'తల వెంట్రుకంత అదృష్టమైనా తల చూపాలి కదా' అన్నారు సురభి విజయలక్ష్మి.

65 ఏళ్లకు ఆమెకు అదృష్టం తల చూపిందనే అనుకోవాలి. సురభి ఆర్టిస్టుగా స్టేజ్ మీద ఎంత పేరున్నా, భాగవత కళాకారిణిగా ఎంత గుర్తింపున్నా ఇప్పుడు 'బలగం' సినిమాలో పోచవ్వగా చేసిన పాత్రే ఆమెకు ఎక్కువ పేరు, గుర్తింపు, ఉనికి ఇచ్చింది. పల్లెటూరి పెద్ద వయసు స్త్రీల విసురు, కసురు, మాట విరుపు, ఆర్ద్రత, అన్నింటినీ పోచవ్వ పాత్రలో రక్తి కట్టించడమే కారణం. ఆమె ఉద్వేగాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి.

'మా సురభి పరివారమంతా చాలా సంతోషంగా ఉన్నారు. సినిమా రంగం నుంచి ఫోన్లు వస్తున్నాయి. ఇదంతా చాలా కొత్తగా ఉంది' అన్నారామె.

హైదరాబాద్ చందా నగర్‌లోని సురభి కాలనీలో నివాసం ఉంటున్న విజయలక్ష్మి ఒక రకం గా రంగస్థలంపైనే పుట్టారు. ఆమె తల్లి ప్రఖ్యాత నటి కమలాదేవి. తండ్రి నాగభూషణం. అయితే ఆరుగురు అక్కచెల్లెళ్లలో విజయలక్ష్మి మాత్రమే నటిగా స్టేజ్ మీద కొనసాగారు. 'మూడేళ్ల వయసు నుంచే నాటకాల్లో పాత్రలు చేశాను. కృష్ణుడు, లోహితాస్యుడు... వయసు వచ్చాక దేవకి, సావిత్రి, అనసూయ, కాంతామతి... ఈ పాత్రలన్నీ పోషించేదాన్ని. సురభిలో ఏ పాత్రైనా ఎవరైనా చేయాలని రూలు. అందువల్ల మగవేషాలు కూడా వేశాను. కృష్ణుడిగా, బాలనాగమ్మలో మాయల పకీరుగా నటించాను' అన్నారు విజయలక్ష్మి.

కరీంనగర్ కోడలు

యుక్త వయసు రాగానే కరీంనగర్‌కు చెందిన బంధువుల కుర్రాడు కేశవరావుతో వివాహం జరిగింది. అతను కూడా నటుడు. భార్యాభర్తలిద్దరూ కలిసి నాటక సమాజం నడిపారు. అయితే పిల్లల చదువుల కోసం సురభి నటీనటులు వేరే చోట్లకు వెళ్లిపోతుండటంతో అందరూ కలిసి సంచారం చేసే పరిస్థితి పోయింది. 'నేను చిన్నప్పటి నుంచి బాగా పాడేదాన్ని. హరికథలంటే ఆసక్తి ఉండేది. హరికథ నేర్చుకుంటే నేనొక్కదాన్నే ప్రదర్శన ఇవ్వొచ్చు. అలా హరికథా కళాకారిణిగా మారాను. నిజామాబాద్, కరీంనగర్, మెదక్, నల్గొండ... ఈ నాలుగు జిల్లాల్లో నేను తిరగని పల్లెటూరు లేదు. మహాభారతాన్ని 18 రోజులు ఒకే ఊరిలో ఉండి చెప్పేదాన్ని. నవరాత్రులొస్తే రాత్రి 8 నుంచి ఒంటి గంట వరకూ నా హరికథ ఉండేది.' అంటారామె.

తెలంగాణ పలుకుబడి

'బలగం సినిమాలో పోచవ్వ పాత్ర కోసం ఆర్టిస్టులను వెతుక్కుంటూ దర్శకుడు వేణు సురభి కాలనీకి వచ్చారు. అందరూ ఆడిషన్స్ ఇస్తుంటే నేనూ ఇచ్చాను. ఆశ్చర్యంగా నన్నే సెలెక్ట్ చేశారు. ఇంతకుముందు ఒకటి రెండు సినిమాలలో నటించినా నాకంటూ అసలు డైలాగు లేదు. ఇదే తగిన నిడివి ఉన్న మొదటి సినిమా. కాని తెలంగాణ మాండలికం. నేనేమో జీవితమంతా రంగస్థలం మీద, హరికథల్లోనూ గ్రాంథికం మాట్లాడతాను. రోజువారి జీవితంలో కూడా నా భాష గ్రాంథికంలా ఉంటుంది. కాని హరికథలు చెప్పడానికి తెలంగాణ పల్లెలకు వెళ్లినప్పుడు అక్కడి స్త్రీలను గమనించిన అనుభవం నాకు ఉపయోగపడింది. డైలాగులను ఆ స్త్రీలు చెప్పినట్టుగా చెప్పాను. నేను నిజంగా అక్కడి ప్రాంత స్త్రీ అని, ఊరిలోని స్త్రీ చేత ఆ పాత్ర చేయించారని అనుకుంటున్నవాళ్లు చాలామంది ఉన్నారు' అన్నారామె.

సినిమాలో మేనత్తగా ఆమె ముఖ్యపాత్రల మధ్య వైషమ్యాలు తొలిగేలా చేయడంలో కీలక పాత్ర పోషిస్తారు. అందువల్ల చాలామంది విజయలక్ష్మిలో తమ మేనత్తను వెతుక్కున్నారు. 'మన సమాజంలో మేనత్తకు ఎప్పటికీ ఇంటి ఆడబిడ్డ స్థానం ఉంటుంది. సోదరులు ఆమెను గౌరవించాల్సిందే. వదిన అయినా, మరదలు అయినా ఇంటి ఆడపడుచుకు తల వొంచాల్సిందే. ఆ అధికారం నా పాత్రలో చూపించాను' అన్నారు విజయలక్ష్మి.

సినిమా నటీమణుల్లో శాంతకుమారిని ఇష్టపడే విజయలక్ష్మి ఒక రకంగా కొత్త ప్రయాణం మొదలెట్టారు. ఆమె ఇద్దరు కొడుకులు, కూతురు జీవితాల్లో స్థిరపడ్డారు కనుక నటనకు ఎక్కువ సమయం ఇవ్వాలనుకుంటున్నారామె. పోచవ్వకు ఆల్ ది బెస్ట్.

బ్యూటిప్



చర్మ సంరక్షణే సరిపోదు..

వేసవిలో చర్మ సంరక్షణ మాత్రమే సరిపోదు దుస్తులు కూడా సరైనవి ధరించాలి. హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల నుండి రక్షణ కోసం చర్మానికి చికాకు కలిగించని దుస్తులు వేసుకోవాలి. ఎండ నుంచి రక్షణ కలిగించడంలో దుస్తులు కీలక పాత్ర పోషిస్తాయి. వదులుగా ఉండే దుస్తులు, లేత రంగు దుస్తులు వేసుకోవడం మంచిది. కాటన్ వస్త్రాలు స్కిన్ ఫ్రెండ్లీగా ఉంటాయి. చెమట వల్ల వచ్చే చికాకుని తగ్గిస్తాయి. ముఖాన్ని కప్పుకోవడం కోసం టోపీలు, గొడుగు ధరించడం ముఖ్యం. కళ్లకు హాని కలగకుండా సన్ గ్లాసెస్ ధరించాలి.

సాగుబడి

రేవతి కార్తె: ఏప్రిల్ 13 వరకు

పొలం దగ్గరే ధాన్యం ఆరుదల!

● పొలం దగ్గరే ధాన్యం తేమను తగ్గించే మొబైల్ యంత్రం సిద్ధం ● 2.5 టన్నుల సామర్థ్యం గల మొబైల్ ప్యాడీ డ్రయ్యర్ ధర రూ. 15 లక్షలు ● రోజుకు 4 ఎకరాల్లో పండే ధాన్యాన్ని నాణ్యంగా ఆరుదల చేయొచ్చు



● డ్రయ్యర్ వెనుక వైపు



● మొబైల్ పాడీ డ్రయ్యర్

రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడుతూ ప్రజలకు అసౌకర్యం కలిగించటం తగదని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా ధాన్యాన్ని కొద్ది గంటల్లోనే నాణ్యత కోల్పోకుండా ఆరబెట్టుకోవడానికి ట్రాక్టర్‌తో నడిచే పాడీ డ్రయ్యర్లు వీలు కల్పిస్తున్నాయి. 50 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతతో ధాన్యాన్ని నాణ్యత చెడకుండా, మొలక శాతం తగ్గకుండా ఆరబెట్టే ఆధునిక సాంకేతికతతో కూడిన పాడీ డ్రయర్లు బాపట్లలోని కోత అనంతర పరిజ్ఞాన పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.

ధాన్యాన్ని నూర్చిన తర్వాత తేమ తగ్గేవరకూ సరిగ్గా ఆరబెట్టకపోవటం వల్ల సుమారు 10 శాతం మేరకు నష్టం కలుగుతోందని అంచనా. అధిక తేమ ఉన్న ధాన్యాన్ని బస్తాల్లో నిల్వ చేస్తే ధాన్యం వేడెక్కి రంగు మారుతుంది. అటువంటి అనుకూల వాతావరణంలో ముక్క పురుగులు, శిలీంధ్రాలు ఆశిస్తాయి. బూజు పడుతుంది. ధాన్యం చెడిపోయి వాసన వస్తుంది. వరి ధాన్యాన్ని (కంబైన్ హార్వెస్టర్) యంత్రాల ద్వారా కోసిన తర్వాత సక్రమంగా ఆరబెట్టకపోతే నాణ్యత దెబ్బతింటుంది.

12% కన్నా తక్కువ తేమ శ్రేయస్కరం

సాధారణంగా కంబైన్ హార్వెస్టర్‌తో గింజరాలు నష్టాన్ని తగ్గించడానికి వరి ధాన్యంలో తేమ శాతం 22–24% ఉన్నప్పుడు వరి కోతలు చేస్తుంటారు. నాణ్యత కోల్పోకుండా ఉండాలంటే ధాన్యం నూర్చిన 24 గంటల్లోగా తేమ శాతాన్ని 17–18కి తగ్గేలా ఆరుదల చేయాల్సి ఉంటుంది. వరి ధాన్యాన్ని నాణ్యత కోల్పోకుండా ఆరు నెలల వరకు నిల్వ ఉంచాలంటే తేమను 12–13 శాతానికి తగ్గించాల్సి ఉంటుంది. ఏడాది కంటే ఎక్కువ కాలం నిల్వ ఉంచాలంటే 12 కన్నా తక్కువ శాతానికి తేమను తగ్గించాల్సి ఉంటుంది. ఏకకాలంలో రైతులందరూ పంట నూర్పిళ్లు చేయటం వల్ల పాత పద్ధతుల్లో నేలపైన నచ్చు/ పరదాలపై లేదా రోడ్లపైన ధాన్యాన్ని ఆరబెట్టడం సాధ్యం కావటం లేదు. ఒక్కోసారి అకాల వర్షాల వల్ల ఆరబెట్టిన ధాన్యం తడిచి నాణ్యత మరింత కోల్పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రాక్టర్ ద్వారా నడిచే మొబైల్ ప్యాడీ డ్రయ్యర్లు రైతులకు ఉపయోగకరంగా ఉన్నాయి.

గ్రీన్‌సిగ్నల్

పరిశోధనా సంస్థలు, కంపెనీలు రూపొందించే వ్యవసాయ యంత్రాలు, పరకరాలను అధికారికంగా క్షేత్రస్థాయిలో సబ్సిడీపై అందుబాటులోకి తేవాలంటే వాటి పనితీరును పరిశీలించి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖలోని యంత్రీకరణ– సాంకేతిక విభాగం ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది జనవరి 23న యంత్రీకరణ– సాంకేతిక విభాగం డిప్యూటీ కమిషనర్ ఎ.ఎన్. మెష్రం 32 యంత్రాలు, పరికరాలకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నైలోని కర్ది డ్రయ్యర్స్ సంస్థ రూపొందించిన ప్యాడీ మొబైల్ డ్రయ్యర్ కూడా ఒకటి. సబ్–మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ (ఎస్.ఎం.ఎ.ఎం.) పథకం ద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్స్ / హైటెక్ హబ్స్, గ్రామస్థాయి ఫామ్ మెషినరీ బ్యాంక్స్‌కు మాదిరిగానే స్వయ సహాయక బృందాల (ఎస్.హెచ్.జి.ల)కు కూడా ఈ డ్రయ్యర్‌ను సబ్సిడీపై అందించవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీలు, చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు 60%, ఇతరులకు 50% సబ్సిడీపై ఈ మొబైల్ పాడీ డ్రయ్యర్‌ను అందించవచ్చని ఆ ఉత్తర్వు పేర్కొంది.

బ్యాచ్‌కు 2-12 టన్నులు


కోయంబత్తూరులోని ఐసీఏఆర్ అనుబంధ సంస్థ అయిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లోని ప్రాంతీయ విభాగంతో పాటు, బాపట్లలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ కోత అనంతర పరిజ్ఞాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు తమ 2.5 టన్నుల మొబైల్ పాడీ డ్రయ్యర్ పనితీరును పరీక్షించి, సంతృప్తిని వ్యక్తం చేశాయని కర్ది డ్రయ్యర్స్ సంస్థ తెలిపింది. ధాన్యాన్ని ఎత్తిపోయటం ద్వారా ఆరుదల చేసే అనేక స్టాటిక్(స్థిర), మొబైల్(చర) డ్రయ్యర్లను ఈ సంస్థ రూపొందిస్తూ దేశ విదేశాల్లో విక్రయిస్తోంది. స్థిరంగా ఒకచోట నెలకొల్పి విద్యుత్/ డీజిల్ జనరేటర్ ద్వారా ధాన్యాన్ని ఆరుదల చేసే 12 టన్నుల సామర్థ్యం గల డ్రయ్యర్లను సైతం ఈ సంస్థ రూపొందించింది. అదేవిధంగా, పొలం దగ్గరకే తీసుకువెళ్లి ధాన్యాన్ని నూర్చిన వెంటనే అక్కడికక్కడే ఆరబెట్టుకునేందుకు ఉపయోగపడే మొబైల్ పాడీ డ్రయ్యర్లలో బ్యాచ్‌కు 2 టన్నుల నుంచి 70 టన్నుల సామర్థ్యం కలిగిన డ్రయ్యర్లు అందుబాటులోకి వచ్చాయి. ట్రాక్టర్‌తో పొలం దగ్గరకే లాక్కెళ్లి రీసర్క్యులేటరీ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని ఆరుదల చేయడానికి ఉపకరించే 2 టన్నుల సామర్థ్యంగల మొబైల్ డ్రయ్యర్ ధర రూ. 15 లక్షలు. 50-60% సబ్సిడీపై అందించడానికి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదిస్తున్నామని కర్ది డ్రయ్యర్స్ సంస్థ జనరల్ మేనేజర్ దిలీపన్(90940 13375) తెలిపారు.

వరితోపాటు మొక్కజొన్న

బ్యాచ్‌కు 1 టన్ను నుంచి 5 టన్నుల సామర్థ్యం గల మొబైల్ పాడీ డ్రయ్యర్ల ద్వారా వరి ధాన్యంతో పాటు మొక్కజొన్నలు, తీపి మొక్కజొన్నలు, బార్లీ, గోధుమలను కూడా ఆరుదల చేయవచ్చని దిలీపన్ వివరించారు. 35–65 హెచ్‌పి ట్రాక్టర్ పిటిఓ ద్వారా ఇవి పనిచేస్తాయి. అతి తక్కువ ఖర్చుతో ధాన్యాలను ఆరబెట్టడంతో పాటు ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించుకోవచ్చు. ఎండలో ఆరుబయట ఆరబెట్టే సమయంలో 20% సమయంలోనే (2–2.5 గంటలు) ఈ డ్రయ్యర్‌తో కోత కోసిన రోజే, తక్కువ శ్రమతో ఆరుదల చేసి, వెంటనే బస్తాల్లోకి నింపుకోవచ్చు. ఎక్కువ తక్కువ లేకుండా ధాన్యం అంతా సమంగా, సక్రమంగా ఆరుదల జరుగుతుంది కాబట్టి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వెంటనే అమ్మేసుకోవాల్సిన అవసరం ఉండదు. నిశ్చింతగా నిల్వ ఉంచుకొని మంచి ధరకు అమ్ముకోవచ్చు.

మొబైల్ డ్రయ్యర్ పనితీరు బాగుంది

పచ్చి వరి ధాన్యాన్ని (బక్కెట్ ఎలివేటర్‌తో తిరిగి ఎత్తిపోస్తూ) ఆరుదల చేసే ఈ 2.5 టన్నుల మొబైల్ డ్రయ్యర్‌ను బాపట్లలోని మా పరిశోధనా కేంద్రంలో పరీక్షించాం. తేమ శాతం 22% నుంచి 13.5%కి తగ్గింది. చాలా బాగా పనిచేస్తోంది. బ్యాచ్‌కు ముప్పావు ఎకరంలో వరి ధాన్యం (35 బస్తాలు) ఆరుదల చేయొచ్చు. రోజుకు 5 బ్యాచ్‌లు చేయొచ్చు. డ్రయ్యింగ్ రెండు దశల్లో చేయాలి. 17–18% వరకు మొదటి దశ, 13% వరకు రెండో దశలో తగ్గించాలి. ఈ ధాన్యాన్ని విత్తనంగా కూడా వాడుకోవచ్చు. మొలక శాతంలో ఎటువంటి తేడా ఉండదు. నూక శాతం తగ్గుతున్నట్లు కూడా నిర్ధరణైంది. ప్రభుత్వానికి నివేదిక పంపాం.



– డా. బి.వి.ఎస్. ప్రసాద్ (80083 73741), ప్రధాన శాస్త్రవేత్త (వ్యవసాయ ఇంజనీరింగ్), అధిపతి, కోత అనంతర పరిజ్ఞాన పరిశోధన కేంద్రం, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

కొమ్మెండు తెగులుకు దివ్యౌషధం పేడ ద్రావణం



● పేడ+పల్లి చెక్క+బెల్లం ద్రావణం

ఉద్యాన తోటల్లో ముఖ్యంగా వేప, నిమ్మ జాతి తోటలు, మామిడి తదితర తోటల్లో కొమ్మెండు (డైబ్యాక్) తెగులు ఇటీవల కాలంలో విస్తరిస్తోంది. కొమ్మలు పై నుంచి కింది వరకు క్రమంగా ఎండిపోయి చివరకు చెట్టు క్షీణించిపోయే పరిస్థితి నెలకొంటున్నది. దీని నివారణకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో రైతులు పేడ ద్రావణం ద్వారా పరిరక్షించుకుంటున్నారు. ఈ ద్రావణం కొమ్మెండు తెగులు సోకి ఆశ వదిలేసుకున్న చెట్లు సైతం 15 రోజుల్లోనే తిరిగి కొత్త చిగుళ్లు తొడుగుతూ పచ్చబడుతున్నాయని భువనగిరి వద్ద రామకృష్ణాపురంలోని అమేయ కృషి వికాస కేంద్రం రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి తెలిపారు.



● జిట్టా బాల్‌రెడ్డి

ప్రభావశీలంగా పనిచేస్తున్న ఈ పేడ ద్రావణం రైతు తయారు చేసుకొని వాడుకోవడానికి అనుకూలమైనది. చాలా సులభమైనది. సుమారు 10 కేజీల పశువుల పచ్చి పేడను తొట్టి లేదా డ్రమ్ములో వేసి నీటిలో కలిపి ఊరవేయాలి. 72 గంటల తర్వాత అందులో 5 కేజీల వేరుశనగ (పల్లి) చెక్కను కలపాలి. 2 లేదా 3 రోజుల తర్వాత ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్, పిఎస్‌బి వంటి జీవన ఎరువులను.. 2 కిలోల బెల్లాన్ని కలిపి 2లేదా3 రోజులు ఊరేయాలి. ఇలా తయారు చేసిన పేడ ద్రావణానికి ఒకటికి 3 రెట్లు నీటిని కలిపి కొమ్మెండు తెగులు ఉన్న చెట్లకు చెట్టు వయసును బట్టి 3 నుంచి 5 లీటర్ల వరకు పోసుకుంటే అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని బాల్‌రెడ్డి వివరించారు.

చనిపోయే స్థితిలో ఉన్న మొక్కలను కూడా రక్షించుకోవటం ఈ పేడ ద్రావణం ద్వారా సాధ్యమేనన్నారు. జీవామృతం కన్నా ఈ పేడ ద్రావణం బాగా పనిచేస్తోంది. ఆవు పేడ లేదా గేదె పేడ అయినా వాడొచ్చు. పూర్తి వివరాలకు.. అమేయ కృషి వికాస కేంద్రం యూట్యూబ్ ఛానల్ చూడొచ్చు.

6 నుంచి ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఆచరణాత్మక శిక్షణ

దేశీ వంగడాలతో ప్రకృతి సేద్యంలో పండించే ఉత్పత్తులను ఆధునిక పద్ధతుల్లో ప్రాసెస్ చేసి, మంచి ధరకు అమ్ముకునే పద్ధతులు, సోలార్ డ్రయ్యర్లు ఇతర యంత్రపరికరాలను తక్కువ ధరలోనే సమకూర్చుకోవటం తదితర అంశాలపై ఈ నెల 6, 7, 8 తేదీల్లో సుప్రసిద్ధ యువ ప్రకృతి సేద్య నిపుణులు ఆకాష్ చౌరాసియా ఆచరణాత్మకంగా శిక్షణ ఇవ్వనున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు–దౌలతాబాద్ రోడ్డులోని తుర్కల ఖానాపూర్ (హత్నూర)లోని రత్నపురి సంస్థల ఆవరణలో ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. వసతి, ఆహారం సహా ఫీజు రూ. 2 వేలు.

వివరాలకు: 95050 46750 73869 57633

15-17 తేదీల్లో తరకటూరులో ప్రకృతి వ్యవసాయ శిబిరం

గోపాలనతో పాటు చేసే ప్రకృతి వ్యవసాయ మెళకువలపై కృష్ణా జిల్లా తరకటూరు(మచిలీపట్నం దగ్గర) సౌభాగ్య గోసదనంలో ఏప్రిల్ 15,16,17 తేదీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సేవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు విజయరామ్ తెలిపారు. సమాజ ఆరోగ్య, ఆర్థిక పరిపుష్టికి ప్రకృతి వ్యవసాయంలో దేశీ విత్తనాల ప్రాముఖ్యత.. మాగాణి భూముల్లో/ నీటి కాలువలకు దగ్గరగా వుండే పొలాల్లో చెరువు అవశ్యకత, పొలం గట్ల మీద పంటల సాగు, చెరువు తవ్విన మట్టిని మెట్ట (దిబ్బ) గా వేసి కూరగాయలు , పండ్ల మొక్కలు పెంచుకోవటం, కలుపు నివారణకు పెంట పోగు (దిబ్బ ఎరువుతో) ఆచ్ఛాదన, ఐదేళ్ల పాటు ఒకే రకమైన దేశవాళీ వరిని సాగు చేసేవారికి విత్తనం పంపిణీ, సేద్యం/ఎద్దు గానుగ కోసం ఉచితంగా గిత్తల పంపిణీ, నైవేద్యం కోసం పంటల సాగు తదితర అంశాలపై విజయరామ్ అవగాహన కల్పిస్తారు. 3 రోజులూ ఒకే కార్యక్రమాలు జరుగుతాయి. ఏదైనా ఒకరోజు పాల్గొంటే చాలు. అల్పాహారం, భోజన సదుపాయం ఉన్నాయి. ప్రవేశ రుసుం: రూ. 300. సంప్రదించాల్సిన నంబరు 63091 11427 (ఉ.10–6 వరకు)



'బుమ్రా గురించి చర్చ అనవసరం'

బెంగళూరు చేతిలో పరాజయం తర్వాత టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా లేని లోటు గురించి అడిగిన ప్రశ్నపై ముంబై ఇండియన్స్ కెప్టెన్ రోహిత్ శర్మ అసహనం వ్యక్తం చేశాడు. గత ఎనిమిది నెలలుగా నేను బుమ్రా లేకుండానే జట్టును నడిపిస్తున్నాను. కానీ ఎవరో ఒకరు అతని స్థానంలో వచ్చి ఆడాల్సిందే. సుదీర్ఘ కాలం దాని గురించే మాట్లాడితే ఎలా. మన నియంత్రణలో ఉండే విషయాల గురించే చెప్పగలం. గాయాలను ఎవరూ నియంత్రించలేరు. మిగతా ఆటగాళ్లలోనూ మంచి ప్రతిభ ఉంది. వారిని ప్రోత్సహిస్తూ మద్దతు పలకడం అవసరం' అని రోహిత్ అన్నాడు.



మళ్లీ నంబర్‌వన్‌గా జొకోవిచ్

ఏటీపీ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ మళ్లీ తన అగ్ర స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. సోమవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో జొకోవిచ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. రెండు వారాల క్రితం అతను తన టాప్ ర్యాంక్‌ను స్పెయిన్‌కు చెందిన అల్‌కరాజ్‌కు కోల్పోయాడు. అయితే మయామీ ఓపెన్‌లో అల్‌కరాజ్ సెమీస్‌లోనే ఓడటంతో రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. జొకోవిచ్ కెరీర్ నంబర్‌వన్‌గా ఇది 381వ వారం కావడం విశేషం.

చెన్నై చెలరేగగా...

సూపర్ కింగ్స్ సొంత మైదానంలో సత్తా చాటింది...ముందుగా బ్యాటింగ్‌లో చెలరేగి భారీ స్కోరు నమోదు చేసిన ధోని టీమ్, ఆపై ప్రత్యర్థిని నిలువరించడంలో సఫలమైంది. రుతురాజ్, కాన్వేలు చెన్నైకి భారీ స్కోరును అందిస్తే, బౌలింగ్‌లో మొయిన్ అలీ ఆఫ్ స్పిన్ జట్టును గెలుపు దిశగా నడిపించింది. మరో వైపు తమ తొలి మ్యాచ్‌ను గెలుపు జోరు మీదున్న లక్నో ప్రభావం చూపలేకపోయింది. ఓపెనర్ మేయర్స్ ఆట మినహా మిగతా రంగాల్లో విఫలం కావడంతో రాహుల్ బృందానికి ఓటమి తప్పలేదు.

- ధోని సేనకు తొలి విజయం
- 12 పరుగులతో ఓడిన లక్నో
- గెలిపించిన రుతురాజ్, అలీ

చెన్నై: నాలుగేళ్ల తర్వాత ప్రత్యక్షంగా మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులకు చెన్నై సూపర్ కింగ్స్ అమితానందాన్ని పంచింది. గత ఓటమిని మరిచేలా చేస్తూ లీగ్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. సోమవారం జరిగిన పోరులో చెన్నై 12 పరుగుల తేడాతో లక్నోను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (31 బంతుల్లో 57; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) వరుసగా రెండో మ్యాచ్‌లో అర్ధ సెంచరీ సాధించగా, డెవాన్ కాన్వే (29 బంతుల్లో 47; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. రవి బిష్ణోయ్, మార్క్‌వుడ్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 205 పరుగులు చేసింది. కైల్ మేయర్స్ (22 బంతుల్లో 53; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొయిన్ అలీ (4/26) ప్రత్యర్థిని దెబ్బతీశాడు.

శతక భాగస్వామ్యం...

కేవలం 56 బంతుల్లో 110 పరుగులు...చెన్నై తొలి వికెట్ భాగస్వామ్యమిది. రుతురాజ్, కాన్వే చెలరేగుతూ లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డారు. అవేశ్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో కాన్వే మొదలుపెట్టగా, గౌతమ్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో రుతురాజ్ మూడు సిక్సర్లతో చెలరేగాడు. వుడ్ ఓవర్లోనూ 2 ఫోర్లు, సిక్స్‌తో 19 పరుగులు రాబట్టిన చెన్నై పవర్‌ప్లే ముగిసే సరికి 79 పరుగులు సాధించింది. ఈ క్రమంలో 25 బంతుల్లోనే రుతురాజ్ అర్ధసెంచరీ పూర్తయింది. కృనాల్ ఓవర్లో రెండు సిక్సర్లు కొట్టి కాన్వే తన జోరును కొనసాగించాడు. ఎట్టకేలకు బిష్ణోయ్ తన తొలి బంతికే వికెట్ తీసి రుతురాజ్‌ను వెనక్కి పంపడంతో భారీ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత కొద్ది సేపటికే కాన్వే అవుట్ కాగా...మూడో స్థానంలో వచ్చిన శివమ్ దూబే (16 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఒక దశలో తాను ఎదుర్కొన్న వరుస నాలుగు బంతుల్లో అతను 6, 4, 6, 6తో చెలరేగిపోయాడు. అతని వికెట్ కూడా బిష్ణోయ్ ఖాతాలోకే చేరగా, అవేశ్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన మొయిన్ అలీ (19)ని కూడా బిష్ణోయ్ అవుట్ చేశాడు. స్టోక్స్ (8), జడేజా (3) విఫలం కాగా...చివర్లో అంబటి రాయుడు (14 బంతుల్లో 27 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ధోని (12) కలిసి స్కోరును 200 పరుగులు దాటించారు. లక్నో ప్రధాన బౌలర్ మార్క్ వుడ్ తన చివరి రెండు ఓవర్లలో 4 సిక్సర్లతో సహా మొత్తం 30 పరుగులు సమర్పించుకున్నాడు.



రుతురాజ్

మేయర్స్ మినహా...

భారీ ఛేదనలో జట్టుకు అవసరమైన శుభారంభం లక్నోకు లభించింది. 35 బంతుల్లోనే ఓపెనర్లు 79 పరుగులు జోడించారు. ఇందులో మేయర్స్ మెరుపులే ఎక్కువగా ఉండగా, కేఎల్ రాహుల్ (20) ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యాడు. స్టోక్స్ ఓవర్లో వరుసగా 4, 4, 6 కొట్టిన మేయర్స్ చహర్ వరుస రెండు ఓవర్లలో కలిపి మొత్తం 5 ఫోర్లు బాదాడు. తుషార్ ఓవర్లోనూ 4, 6 కొట్టిన అతను 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అయితే అలీ తన తొలి ఓవర్లోనే మేయర్స్‌ను అవుట్ చేసి లక్నో పతనానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత ఏ దశలోనూ జెయింట్స్ కోలుకోలేకపోయింది. హుడా (2), కృనాల్ (9) విఫలం కాగా, స్టొయినిస్ (21) కూడా చెప్పుకోదగ్గ ప్రదర్శనే చేయలేదు. క్రీజ్‌లో ఉన్నంత సేపు నికోలస్ పూరన్ (18 బంతుల్లో 32; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడే ప్రయత్నం చేసినా జట్టు విజయానికి అది సరిపోలేదు. రాజ్‌వర్ధన్ ఓవర్లోనే వరుసగా 6, 4, 4 కొట్టిన పూరన్ జడేజా ఓవర్లో రెండు సిక్స్‌లు బాదాడు. 16వ ఓవర్ చివరి బంతికి పూరన్ అవుట్ కావడంలో లక్నో విజయావకాశాలు పూర్తిగా కోల్పోయింది.

స్కోరు వివరాలు:

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) వుడ్ (బి) బిష్ణోయ్ 57; కాన్వే (సి) కృనాల్ (బి) వుడ్ 47; దూబే (సి) వుడ్ (బి) బిష్ణోయ్ 27; అలీ (స్టంప్డ్) పూరన్ (బి) బిష్ణోయ్ 19; స్టోక్స్ (సి) యష్ (బి) అవేశ్ 8; రాయుడు (నాటౌట్) 27; జడేజా (సి) బిష్ణోయ్ (బి) వుడ్ 3; ధోని (సి) బిష్ణోయ్ (బి) వుడ్ 12; సాన్‌ట్నర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 217.**

వికెట్ల పతనం: 1–110, 2–118, 3–150, 4–166, 5–178, 6–203, 7–215. **బౌలింగ్:** మేయర్స్ 2–0–16–0, అవేశ్ 3–0–39–1, కృనాల్ 2–0–21–0, గౌతమ్ 1–0–20–0, వుడ్ 4–0–49–3, యష్ ఠాకూర్ 4–0–36–0, రవి బిష్ణోయ్ 4–0–28–3.



మేయర్స్

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) రుతురాజ్ (బి) అలీ 20; మేయర్స్ (సి) కాన్వే (బి) అలీ 53; హుడా (సి) స్టోక్స్ (బి) సాన్‌ట్నర్ 2; కృనాల్ (సి) జడేజా (బి) అలీ 9; స్టొయినిస్ (బి) అలీ 21; పూరన్ (సి) స్టోక్స్ (బి) తుషార్ 32; బదోని (సి) ధోని (బి) తుషార్ 23; గౌతమ్ (నాటౌట్) 17; వుడ్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 205.** **వికెట్ల పతనం:** 1–79, 2–82, 3–82, 4–105, 5–130, 6–156, 7–195. **బౌలింగ్:** దీపక్ చహర్ 4–0–55–0, స్టోక్స్ 1–0–18–0, తుషార్ 4–0–45–2, మొయిన్ అలీ 4–0–26–4, సాన్‌ట్నర్ 4–0–21–1, రాజ్‌వర్ధన్ 2–0–24–0, జడేజా 1–0–14–0.

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ధోని ఫటాఫట్...



మ్యాచ్‌ను తన భుజస్కంధాలపై మోసే భారంనుంచి చాలా కాలంగా దూరమైన ధోని కొద్ది సేపు క్రీజ్‌లో ఉండి అభిమానులను అలరిస్తే చాలు అన్నట్లుగా ఆడుతున్నాడు. అతని ఆట చూసేందుకు చెపాక్ మైదానానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన ఫ్యాన్స్‌ను అతను నిరాశపర్చలేదు. 6, 6, అవుట్...ఆడిన మూడు బంతుల్లోనే రెండు సిక్సర్లతో స్టేడియం హోరెత్తగా, సొంత జట్టు సభ్యులు కూడా ఆ సిక్సర్లకు సంబరాలు చేసుకున్నారు. తొలి మ్యాచ్‌లోనూ 7 బంతుల్లో ఫోర్, సిక్స్ బాదిన అతను 14 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్‌తో ధోని ఐపీఎల్‌లో 5 వేల పరుగులు కూడా పూర్తి చేసుకున్నాడు. లీగ్‌లో ఈ మైలురాయిని దాటిన ఏడో ఆటగాడిగా (కోహ్లి, ధావన్, వార్నర్, రోహిత్, రైనా, డివిలియర్స్ తర్వాత) నిలిచాడు.

మయామీ ఓపెన్ విజేత మెద్వెదెవ్



మయామీ: రష్యా స్టార్ డానిల్ మెద్వెదెవ్ ఈ ఏడాది తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ నాలుగో ఏటీపీ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రతిష్టాత్మక ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీలో మెద్వెదెవ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో అతను 7–5, 6–3 స్కోరుతో జనిక్ సిన్నర్ (ఇటలీ)ని ఓడించాడు. 1 గంటా 34 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో మెద్వెదెవ్ 9 ఏస్‌లు కొట్టగా, సిన్నర్ 6 ఏస్‌లు బాదాడు. రష్యా ఆటగాడు 6 డబుల్ ఫాల్ట్‌లు చేసినా ఆ ప్రభావం ఫలితంపై పడకుండా సత్తా చాటడం విశేషం. 2023లో 24 మ్యాచ్‌లలో గెలిచి ఒకే ఒక మ్యాచ్‌లో ఓడిన మెద్వెదెవ్ ఖాతాలో ఇది నాలుగో టైటిల్ కాగా ఓవరాల్‌గా ఐదో ఏటీపీ మాస్టర్స్ టైటిల్.

'పవర్‌ప్లే'లోనే ఓడాం!



లారా

సాక్షి, హైదరాబాద్: రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తమ ఓటమికి రెండు 'పవర్ ప్లే'లలో ప్రదర్శనే కారణమని సన్‌రైజర్స్ హైదరాబాద్ కోచ్ బ్రియాన్ లారా అభిప్రాయపడ్డాడు. 'ముందుగా రాజస్తాన్ పవర్‌ప్లేను అద్భుతంగా వాడుకొని 85 పరుగులు చేసింది. అదే మా వంతు వచ్చేసరికి పవర్‌ప్లేలో పరుగులే చేయలేకపోయాం. 200కుపైగా స్కోరు ఛేదిస్తూ తొలి ఓవర్లోనే 2 వికెట్లు కోల్పోతే కోలుకోవడం కష్టమే' అని లారా అన్నాడు.

అటు స్టార్, ఇటు జియో...

న్యూఢిల్లీ: ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారానికి సంబంధించి అటు టీవీలో, ఇటు డిజిటల్ వేదికపైనా కొత్త రికార్డులు నమోదయ్యాయి. చెన్నై, గుజరాత్ మధ్య జరిగిన మ్యాచ్‌ను వేర్వేరు దశల్లో కలిపి స్టార్ టీవీలో 140 బిలియన్ల మంది ప్రేక్షకులు కూడా చూశారని డిస్నీ స్టార్ సంస్థ ప్రకటించింది. మొత్తంగా 8.7 బిలియన్ నిమిషాల పాటు అభిమానులు స్టార్ స్పోర్ట్స్‌లో లీగ్ తొలి పోరును ఆస్వాదించారని ఆ సంస్థ పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే ఇది 47 శాతం ఎక్కువ కాగా, మొత్తంగా రేటింగ్స్ కూడా 29 శాతం పెరగడం విశేషం. మరో వైపు 'జియో సినిమా'లో ఫ్యాన్స్ కూడా ఐపీఎల్‌పైనే దృష్టి పెట్టారు. వారాంతంలో అభిమానుల ఆసక్తిని గమనిస్తే ఒక్కో మ్యాచ్‌ను ఒక్కో ప్రేక్షకుడు కనీసం 57 నిమిషాల పాటు డిజిటల్ వేదికపై చూశారని వయాకామ్ 18 స్పోర్ట్స్ ప్రకటించింది. గత ఏడాది ఐపీఎల్ మొత్తం సీజన్‌ను డిజిటల్‌లో చూసినదాంతో పోలిస్తే ఈ ఒక్క వారాంతంలోనే దానికి మించిన గణాంకాలు నమోదయ్యాయని వెల్లడించింది. అభిమానులు జియో సినిమాలో మొత్తం 147 కోట్ల వీడియోలు చూడగా... ఏకంగా 5 కోట్ల మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం విశేషం.

హారిక ఓటమి, హంపి 'డ్రా'

న్యూఢిల్లీ: మహిళల గ్రాండ్ ప్రి చెస్ టోర్నీ తొమ్మిదో రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారికకు ఓటమి ఎదురైంది. రష్యాకు చెందిన అలెగ్జాండ్రా గొర్యాకినా 60 ఎత్తుల్లో హారికపై విజయం సాధించింది. మరో ఏపీ ప్లేయర్ కోనేరు హంపి 9వ రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకుంది. భారత్‌కే చెందిన వైశాలితో జరిగిన ఈ గేమ్‌లో 31 ఎత్తుల తర్వాత ఇద్దరూ సమంగా నిలిచారు.

ఐపీఎల్‌నుంచి తప్పుకున్న షకీబ్



ఢాకా:బంగ్లాదేశ్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాల్సి ఉండటంతో ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ ఈ ఏడాది ఐపీఎల్‌నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు షకీబ్ ప్రాతినిధ్యం వహించాల్సి ఉంది. ఐర్లాండ్‌తో మార్చి 31న టి20 సిరీస్ ముగిసిన తర్వాత షకీబ్ తమ జట్టుతో కలుస్తాడని కేకేఆర్ యాజమాన్యం కొద్ది రోజుల క్రితం ప్రకటించింది. అయితే నేటినుంచి ఐర్లాండ్‌తో బంగ్లాదేశ్ టెస్టు మ్యాచ్ ఆడనుండగా...మే 9–14 మధ్య కెమ్స్‌ఫోర్డ్‌లో మూడు వన్డేల్లో బంగ్లా, ఐర్లాండ్ తలపడతాయి. ఇదే కారణంతో మరో బంగ్లా ఆటగాడు, కేకేఆర్ సభ్యుడే అయిన లిటన్ దాస్ కూడా ఐపీఎల్ ఆడే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. వేలం సమయంలో తమ ఆటగాళ్లు పూర్తి స్థాయిలో కాకపోయినా, కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారని బంగ్లా బోర్డు ప్రకటించగా, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. షకీబ్ దూరమైతే కోల్‌కతా టీమ్‌లో ఆరుగురు విదేశీ ఆటగాళ్లే ఉంటారు.

సినిమా

ఆ మాట జీవితాంతం వినాలని ఉంది

\- నాని




"దసరా' సినిమా విడుదల తర్వాత చాలామంది నాని.. 'దసరా'కి ముందు, 'దసరా' తర్వాత అంటున్నారు. నా గత చిత్రాలు 'భలే భలే మగాడివోయ్, నిన్ను కోరి, జెర్సీ'లకి కూడా ఇదే మాటలు విన్నాను. జీవితాంతం నేను చేసిన ప్రతి సినిమాకి ఈ మాట వినాలని ఉంది (నవ్వుతూ)" అని హీరో నాని అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తీ సురేష్ జంటగా నటించిన చిత్రం 'దసరా'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా మార్చి 30న విడుదలైంది. ఈ సందర్భంగా నాని పంచుకున్న విశేషాలు.

- 'దసరా' కథని శ్రీకాంత్ చెప్పినప్పుడు అద్భుతంగా ఉందనిపించింది. మంచి సాంకేతిక నిపుణులను తనకు ఇచ్చి, ప్రోత్సహించాలని కథ వినగానే నిర్ణయించుకున్నాను. ఈ సినిమా చేస్తున్నప్పుడే శ్రీకాంత్ చాలా పెద్ద డైరెక్టర్ అవుతాడని చెప్పాను. ప్రేమ, స్నేహం, పగ.. యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే ఎమోషన్స్, మన సంస్కృతిని సెలబ్రేట్ చేసుకునే సినిమా ఏదైనా దొరికితే అది అందరి దగ్గరకి తీసుకెళ్లడం మన బాధ్యత. 'దసరా' అలాంటి సినిమానే. అందుకే మిగతా భాషల్లోనూ రిలీజ్ చేయాలని నిర్ణయించుకున్నాం. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులే కాదు.. ఉత్తరాదిలోనూ బాగా ఎంజాయ్ చేస్తున్నారు.
- 'దసరా' లొకేషన్‌లో ఎంజాయ్ చేస్తూ చేసిన సన్నివేశం ఏదీ లేదు. దుమ్ము, ధూళి, వేడి మధ్య చాలా కష్టపడి పని చేశాం. అయితే సన్నివేశాలు బాగా వస్తున్నాయనే ఫీలింగ్ షూటింగ్‌లోనే కలిగింది. ఈ సినిమా క్లయిమాక్స్‌ని ప్రేక్షకులతో కలిసి థియేటర్‌లో చూడటానికి చాలా ఆత్రుతగా ఎదురు చూశాం.. మేము అనుకున్నట్టే క్లయిమాక్స్‌కి మంచి స్పందన వస్తోంది. 'దసరా' చూసినవారంతా గొప్పగా స్పందిస్తున్నారు. ఫోన్ కాల్స్‌తో పాటు ఎమోషనల్ మెసేజ్‌లు చేస్తుంటే చాలా ఆనందంగా ఉంది.
- రామ్‌చరణ్‌కు 'రంగస్థలం', అల్లు అర్జున్‌కి 'పుష్ప', నాకు 'దసరా' అని సోషల్ మీడియాలో వార్తలు రావడం చూశాను. ఆ మాటలకు నటుడిగా ఆనందపడతాను. కానీ తృప్తిపడను. ఎప్పుడైతే మనం తృప్తి పొందుతామో ఆ తర్వాత ప్రయత్నం చేయడంలో అలసత్వం వచ్చేస్తుంది. ఏ సినిమాకీ నేను తృప్తిపడను. ఆనందం మాత్రం ఉంటుంది.
- రస్టిక్ మూవీ చేయాలా? వేరే జానర్ మూవీ చేయాలా? అని నేను ప్లాన్ చేయను. 'దసరా' మాస్ సినిమా. పెద్ద బ్లాక్ బస్టర్ అయింది. ఈ సినిమా విడుదలకు ముందే నేను దాన్నుంచి బయటికి వచ్చేశాను. ఇప్పుడు ఓ సినిమాలో ఆరేళ్ల పాపకి తండ్రిగా చేస్తున్నాను. నటుడిగా వైవిధ్యం చూపిస్తూ అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించేలా సినిమాలు చేయాలనేది నా ఆలోచన. నా కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్‌లో 'దసరా, ఎంసీఏ, నేను లోకల్' ఉన్నాయి. నేను ఏ సినిమానీ జానర్‌వారీగా చూడను.. కథ నచ్చితే సినిమా చేసేస్తాను. అయితే ఏ జానర్‌ని కూడా రిపీట్ చేయకపోవడాన్ని సౌకర్యంగా భావిస్తాను.
- కొత్త దర్శకులని పరిచయం చేయాలని ప్రత్యేకంగా అనుకోను. కథ నచ్చితే చేస్తాను. అయితే నేను పరిచయం చేసిన దర్శకులు మంచి స్థానాల్లో ఉండటం గర్వంగా ఉంది. 'దసరా' తొలి ఆటకి మా అబ్బాయి జున్నుని తీసుకెళ్లాను. నా ఫ్యాన్స్ అరుస్తూ, పేపర్లు విసిరేస్తుంటే.. ఎందుకు అలా చేస్తున్నారో వాడికి అర్థం కాలేదు. పేపర్లు వేస్ట్ అవుతున్నాయంటూ టెన్షన్ పడ్డాడు (నవ్వుతూ).
- ప్రభాస్, మహేశ్‌గార్లతో పాటు ఇండస్ట్రీలోని చాలామంది 'దసరా'ని మెచ్చుకుంటూ మెసేజ్‌లు పెట్టడం చాలా ఆనందంగా ఉంది. 'జెర్సీ, శ్యామ్ సింగరాయ్' సమయంలో కూడా చిరంజీవి, రామ్‌చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్, మహేశ్‌బాబుగార్లు మెసేజ్ చేశారు. ఇది ఆనందంతో పాటు బాధ్యతని కూడా పెంచుతుంది. నా చిత్రాలను చాలామంది వేరే చిత్రాల బాక్సాఫీస్ లెక్కలతో పోలుస్తారు. ప్రతి సినిమాకి ఒక లక్ష్యం ఉంటుంది.. ప్రేక్షకులు దాన్ని అర్థం చేసుకోవాలి. ప్రతి మూవీని ప్రత్యేకంగా చూడాలి.

వేసవిలో ఉగ్రం

'నాంది' వంటి హిట్ చిత్రం తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందిన మరో చిత్రం 'ఉగ్రం'. మీర్నా మీనన్ హీరోయిన్. వేసవిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ సినిమాని మే 5న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఉగ్రం'. ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ మూవీ టీజర్‌కి, 'దేవేరి..' అనే తొలి పాటకి అద్భుతమైన స్పందన వచ్చింది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సిద్, సంగీతం: శ్రీ చరణ్ పాకాల.



'అల్లరి' నరేశ్



దేవ్ మోహన్, రష్మికలపై క్లాప్ ఇస్తున్న అమల

రొమాంటిక్ రెయిన్‌బో

హీరోయిన్ రష్మికా మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న 'రెయిన్‌బో' చిత్రం షురూ అయింది. శాంతరూబన్ దర్శకునిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో నటుడు దేవ్ మోహన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్ఆర్. ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్. ప్రభు నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటి అమల అక్కినేని క్లాప్ కొట్టారు. నిర్మాత సురేష్‌బాబు స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. రష్మికా మందన్నా మాట్లాడుతూ– ''రెయిన్‌బో' చేస్తున్నందుకు చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంది'' అన్నారు. ''ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 7న ప్రారంభం అవుతుంది'' అన్నారు ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్. ప్రభు. ''రొమాంటిక్ ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు శాంతరూబన్. ఈ ప్రారంభోత్సవానికి నిర్మాతలు కేకే రాధామోహన్, దామోదర్ ప్రసాద్, పి. కిరణ్, శరత్ మరార్, సుప్రియ అక్కినేని, దర్శకులు వెంకీ కుడుముల, శశికిరణ్, హీరో సందీప్ కిషన్ తదితరులు హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కేఎం భాస్కరన్, సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: తంగ ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అరవేంద్ర రాజ్ భాస్కరన్.

దుబాయ్‌లో బేబీ షవర్

రామ్‌చరణ్–ఉపాసన ఫుల్ జోష్‌లో ఉన్నారు. తల్లిదండ్రులు కాబోతున్న ఆనందం అది. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఆస్కార్ అవార్డు వేడుకకు హాజరైన ఈ దంపతులు ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నారు. అక్కడి నమ్మోస్ బీచ్ క్లబ్‌లో ఉపాసన బేబీ షవర్ జరిగింది. ఈ వేడుకలో రామ్‌చరణ్, ఉపాసనల స్నేహితులు, కజిన్స్ పాల్గొన్నారని సమాచారం. కొన్ని ఫొటోలను ఉపాసన షేర్ చేశారు. వేడుకలో తెలుపు రంగు గౌనులో ఆమె మెరిసిపోయారు. కొన్నాళ్లు దుబాయ్‌లో వెకేషన్‌ని ఎంజాయ్ చేసి, చరణ్–ఉపాసన ఇండియా చేరుకుంటారట. ఆ తర్వాత శంకర్ దర్శకత్వంలో చేస్తున్న 'గేమ్ చేంజర్' సినిమా షూట్‌లో పాల్గొంటారు చరణ్.



రామ్‌చరణ్, ఉపాసన

నాలుగు భాషల్లో మిషన్

అరుణ్ విజయ్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'మిషన్: చాప్టర్ 1'. విజయ్ దర్శకత్వంలో ఎం. రాజశేఖర్, ఎస్. స్వాతి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ''2.0, పొన్నియిన్ సెల్వన్, ఇండియన్ 2' వంటి భారీ చిత్రాలతో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్న లైకా ప్రొడక్షన్స్ తాజాగా 'మిషన్: చాప్టర్ 1'ని విడుదల చేయాలనుకోవడానికి కారణం ఈ చిత్ర కథాంశమే. అరుణ్ విజయ్‌ను నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్లేలా ఈ చిత్రం ఉంటుంది. చాలా గ్యాప్ తర్వాత అమీ జాక్సన్ ఈ చిత్రంతో మళ్లీ తెరపై కనిపించనున్నారు. ఈ సినిమా కోసం లండన్ జైలును పోలి ఉండేలా చెన్నైలో ఓ భారీ జైలు సెట్ వేశాం. స్టంట్ సిల్వ ఈ చిత్రానికి యాక్షన్ కొరియోగ్రఫీ అందించారు. రిస్కీ యాక్షన్ సీన్స్‌ని అరుణ్ విజయ్ అద్భుతంగా చేశారు. భాషాపరమైన హద్దులు లేకుండా అందర్నీ ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.



అమీ జాక్సన్, అరుణ్ విజయ్

ఒకరు ప్రపంచం.. మరొకరు ప్రాణం



నయనతార, విఘ్నేష్ శివన్

హీరోయిన్ నయనతార–దర్శకుడు విఘ్నేష్ శివన్ గత ఏడాది జూన్‌లో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అక్టోబర్‌లో కవలలకు తల్లిదండ్రులైనట్లు ఈ దంపతులు ప్రకటించారు. సరోగసీ విధానం ద్వారా ఈ ఇద్దరూ పేరెంట్స్ అయ్యారు. కాగా, తాజాగా జరిగిన ఓ అవార్డు వేడుకలో తమ ఇద్దరు కుమారుల పేర్లను వెల్లడించారు నయనతార. ఒకరి పేరు ఉయిర్ రుద్రోనీల్ ఎన్ శివన్, ఇంకో బాబు పేరు ఉలగ్ దైవిక్ ఎన్ శివన్. ఉలగ్ (ఉలగం అంటారు) అంటే ప్రపంచం అని, ఉయిర్ అంటే ప్రాణం అని అర్థం. కుమారులిద్దరూ తమ ప్రపంచం, ప్రాణంగా భావించి ఈ పేర్లను ఎన్నుకుని ఉంటారు. అలాగే రుద్రోనీల్ అంటే శివుడిని, ఇంకో బాబు పేరులో ఉన్న దైవిక్ అంటే దైవత్వాన్ని సూచిస్తున్నాయి. ఇక ఇద్దరి పేర్లలో ఉన్న 'ఎన్' నయనతార పేరులో ఉన్న అక్షరం. శివన్ అంటే విఘ్నేష్ శివన్ పేరులో సగం. ఇలా ప్రేమ, దైవత్వం, తమ పేర్లు కలిసొచ్చేలా కుమారులకు ఈ దంపతులు పేర్లు పెట్టారు.

అందుకే వెంటనే ఓకే చెప్పాను

\- సుశాంత్

''రావణాసుర' వైవిధ్యమైన చిత్రం. ఇలాంటి కాన్సెప్ట్ తెలుగు సినిమాల్లో ఇప్పటివరకూ రాలేదు. అందుకే కథ వినగానే నటించేందుకు ఓకే చెప్పాను'' అని సుశాంత్ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన సుశాంత్ మాట్లాడుతూ– ''రావణాసుర' టైటిల్ రోల్‌ని రవితేజగారు చేశారు. నేను రామ్ పాత్ర చేశా. మా ఇద్దర్నీ సుధీర్‌గారు సరికొత్తగా చూపించారు. నా పాత్రని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారనే ఎగ్జయిట్‌మెంట్ ఉంది. 'రావణాసుర' కంప్లీట్ థ్రిల్లర్. వెర్సటైల్ యాక్టర్‌గా అన్ని రకాల పాత్రలు చేయాలనేది నా ఆలోచన. ఈ సినిమాలో ఆ కొత్తదనం కనిపిస్తుంది. 'రావణాసుర'లో నన్ను తీసుకోవాలనే ఆలోచన అభిషేక్‌గారిదే. ఇందుకు ఆయనకు థ్యాంక్స్. 'అల వైకుంఠపురములో' చిత్రం నాకు మంచి పేరు తీసుకొచ్చింది. ఉత్తరాదిలో కూడా ఫేమ్ తీసుకొచ్చింది. అయితే ఆ సినిమా తర్వాత చాలా అవకాశాలు వచ్చినా నన్ను ఎగ్జయిట్ చేసిన 'రావణాసుర, భోళా శంకర్..' లాంటి సినిమాలు మాత్రమే ఒప్పుకున్నాను. అక్కినేని ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీకి రావడం నా లక్. నేను మొదటి నుంచి కూడా నాకు వస్తున్న అవకాశాలతోనే ముందుకువెళ్లాను. కొన్ని సినిమాల షూటింగ్ ఆలస్యం కావడం, అనుకున్న టైమ్‌కి విడుదల కాకపోవడం వల్ల గ్యాప్ వస్తోంది. 'చిలసౌ' తర్వాత ఇక గ్యాప్ తీసుకోకూడదని నిర్ణయించుకున్నాను. అయితే కోవిడ్ వల్ల గ్యాప్ వచ్చింది. కానీ ఆరు నెలలుగా బిజీగా ఉన్నాను. 'భోళా శంకర్'లో కీ రోల్ చేస్తున్నాను. అలాగే సోలో హీరోగా ఒక కథ ఓకే చేశాను'' అన్నారు.



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	115	59,106
నిఫ్టీ ▲	38	17,398

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,102	▼	120
డోజోన్స్	33,518	▲	243
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,673	▲	41
డాక్స్	15,581	▼	48
షాంఘై	3,296	▲	23
నికాయ్	28,118	▲	147

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	59,715
బంగారం (22 క్యారట్)	59,476
వెండి (కిలో)	71,700

రిలయన్స్ డిజిటల్ డిస్కౌంట్ డేస్



హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ డిస్కౌంట్ డేస్ పేరుతో భారీ ఆఫర్లు ప్రకటించింది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కొనుగోళ్లపై అత్యుత్తమ డీల్స్‌తో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డులపై 7.5% వరకు తక్షణ డిస్కౌంట్ అందిస్తుంది. అదనంగా రూ.1000 విలువైన డిస్కౌంట్ కూపన్స్ ఇస్తుంది. టీవీలు, స్మార్ట్ ఫోన్స్, ల్యాప్‌టాప్స్, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, స్మార్ట్ వాచీలు, కిచెన్ పరికరాలపై ఆకర్షణీయమైన డీల్స్ ఉన్నాయి. ఈ ఏప్రిల్ తొమ్మిదో తేదీ వరకూ డిజిటల్ డిస్కౌంట్ డేస్ కొనసాగుతాయని, రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్లలో కస్టమర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

ఆర్‌బీఐ తొలి ద్వైమాసిక పాలసీ సమీక్ష ప్రారంభం

6న కీలక నిర్ణయాలు



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి ద్వైమాసిక మూడు రోజుల సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ కీలక నిర్ణయాలు 6వ తేదీన వెలువడనున్నాయి. 3, 5, 6 తేదీల్లో సమావేశాలు జరుగుతాయి. 4వ తేదీ మహావీర్ జయంతి సందర్భంగా సెలవు. ఈ సమావేశాల్లో రెపో రేటును మరో పావుశాతం పెంపునకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇదే జరిగితే బ్యాంకులకు ఆర్‌బీఐ తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు 6.75 శాతానికి పెరగనుంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. ఫిబ్రవరి మొదట్లో జరిగిన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానంలో వరుసగా ఆరవసారి (పావు శాతం) రేటు పెంపుతో మే నుంచి 2.5 శాతం రెపో రేటు పెరిగింది. ఈ రేటు 6.5 శాతానికి ఎగసింది.

సైయంట్ సీఈవోగా కార్తీక్ నటరాజన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సైయంట్ కొత్త సీఈవోగా కార్తీక్ నటరాజన్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా, ఈడీగా ఉన్నారు. ఇప్పటివరకూ సీఈవోగా ఉన్న కృష్ణ బోదనపు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఎండీగా పదోన్నతి పొందారు. ఏరోస్పేస్ తదితర విభాగాల గ్లోబల్ హెడ్ ప్రభాకర్ అట్ల.. సీఎఫ్‌వోగా నియమితులయ్యారు. సంస్థను 2 విభాగాలుగా విడదీసే పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికను కూడా సైయంట్ డైరెక్టర్ల బోర్డు ఆమోదించింది. సైయంట్ డీఎల్ఎం(డిజైన్ లెడ్ మాన్యుఫాక్చరింగ్) వ్యాపార విభాగం పబ్లిక్ ఇష్యూకి వచ్చే దిశగా సెబీకి ప్రాస్పెక్టస్‌ను సమర్పించింది. సైయంట్ డీఎల్ఎంకి ఆంటోనీ మాంటల్‌బానో సీఈవోగా వ్యవహరిస్తారు.

మార్చిలో తయారీ రంగం పరుగు

56.4కు ఎస్అండ్‌పీ సూచీ అప్



న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం మార్చిలో మంచి పురోగతి కనబరచింది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) మూడు నెలల గరిష్ట స్థాయిలో 56.4కు వద్దకు చేరింది. డిమాండ్ ఊపందుకోవడంతో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి పెరిగినట్లు నెలవారీ సర్వే పేర్కొంది. ద్రవ్యోల్బణం ఒత్తిడులు తగ్గినట్లూ వివరించింది. ఫిబ్రవరిలో పీఎంఐ 55.3గా నమోదయ్యింది. అయితే సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే భావించడం జరుగుతుంది. ఆ లోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సూచీ వృద్ధి బాటన కొనసాగడం వరుసగా 21వ నెల. ఉద్యోగ కల్పన విషయానికి వస్తే, మార్చిలో పేరోల్ సంఖ్యలో దాదాపు మార్పులేదు. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో సంస్థలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు.

2022-23లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.16.61 లక్షల కోట్లు

18 శాతం అప్



న్యూఢిల్లీ: భారత్ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు మార్చితో ముగిసిన 2022–23 ఆర్థిక సంవత్సరంలో 2021–22 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 18 శాతం పెరిగి, రూ.16.61 లక్షల కోట్లకు ఎగశాయి. ఆర్థిక శాఖ తాజా గణాంకాలను విడుదల చేసింది. 2021–22లో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.14.12 లక్షల కోట్లు. రిఫండ్స్‌ను సర్దుబాటు చేయకుండా స్థూలంగా చూస్తే, పన్ను వసూళ్లు రూ.19.68 లక్షల కోట్లని ఆర్థికశాఖ వివరించింది. వీటిలో నుంచి మార్చి 31 వరకూ రూ.3.07 లక్షల కోట్ల రిఫండ్స్ జరిగాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-4-2023	
విశాఖ	430–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417–00
విజయవాడ	417–00
రిటైల్ ధర (డజను)	66.00
3-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

లాభాలతో కొత్త ఏడాదిలోకి!

- ఒడిదుడుకులున్నా.., మూడోరోజూ ముందుకే
- ఆటో, బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్
- 59 వేలపైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 38 పాయింట్లు
- మహావీర్ జయంతి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



ముంబై: కొత్త ఆర్థిక సంవత్సరం తొలి ట్రేడింగ్ రోజైన సోమవారం స్టాక్ మార్కెట్ లాభాలతో ముగిసింది. ఆటో, బ్యాంకింగ్, వినిమయ షేర్లు రాణించడంతో మార్కెట్ మూడోరోజూ ముందడుగేసింది. భారత తయారీ రంగ కార్యకలాపాలు మార్చిలో పుంజుకొని మూడు నెలల గరిష్టానికి చేరుకోవడం కలిసొచ్చింది. ఉదయం సానుకూలంగా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు కొద్దిసేపటికే నష్టాల్లోకి మళ్లాయి. రోజంతా పరిమిత శ్రేణిలో తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. అయితే చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఉదయం సెన్సెక్స్ 139 పాయింట్ల లాభంతో 59,131 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 412 పాయింట్ల పరిధిలో 58,793 వద్ద కనిష్టాన్ని, 59,205 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 115 పాయింట్ల లాభంతో 59,106 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 68 పాయింట్లు బలపడి 17,428 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 17,313–17,428 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 38 పాయింట్లు పెరిగి 17,398 వద్ద ముగిసింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.322 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.328 కోట్ల షేర్లను అమ్మేశారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 9 పైసలు క్షీణించి 82.30 స్థాయి వద్ద స్థిరపడింది. మహవీర్ జయంతి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు కావడంతో ఎక్స్చేంజీలు తిరిగి బుధవారం ప్రారంభమవుతాయి. ముడిచమురు ధరలు పెరుగుదలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ''ఈ వారంలో ట్రేడింగ్ మూడురోజులకే పరిమితం కావడంతో పాటు ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ కీలక నిర్ణయాలను వెల్లడించనున్న నేపథ్యంలో ట్రేడర్లు పొజిషన్లను తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. మార్చిలో ఆటో అమ్మకాలు గణనీయంగా పెరగడంతో పాటు భారత తయారీ రంగ కార్యకలాపాలు పుంజుకొని మూడు నెలల గరిష్టానికి చేరుకోవడం మార్కెట్లో ఒత్తిళ్లను తగ్గించాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- హీరో మోటోకార్ప్ షేరు నాలుగుశాతం లాభపడి రూ.2,434 వద్ద ముగిసింది. వార్షిక ప్రాతిపదికన మార్చి విక్రయాలు 15% వృద్ధిని సాధించడంతో ఈ కంపెనీ షేరుకు డిమాండ్ నెలకొంది.
- అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ జేపీ మోర్గాన్ రేటింగ్ తగ్గించడంతో కేపీఐటీ టెక్నాలజీ షేరు 12 శాతం క్షీణించి రూ.810 వద్ద నిలిచింది.
- పలు ఆర్డర్లను దక్కించుకోవడంతో రైల్ వికాస్ నిగమ్ షేరు 10% ఎగసి రూ.75 వద్ద నిలిచింది.

ఎస్‌బీఐ ఆన్‌లైన్ సేవలకు అంతరాయం



ముంబై: సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సోమవారం ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆన్‌లైన్ బ్యాంకింగ్ సర్వీసులకు కొన్ని గంటల పాటు అంతరాయం కలిగింది. దీంతో పెద్ద సంఖ్యలో కస్టమర్లు ఇబ్బంది పడ్డారు. సర్వీస్ అంతరాయంపై చాలా మంది కస్టమర్లు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో ఆందోళన వ్యక్తం చేశారు. యోనో బ్యాంకింగ్ యాప్ పని చేయడం లేదని, ఆన్‌లైన్‌లో లావాదేవీలు సాధ్యపడటం లేదని ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసిన ఎస్‌బీఐ.. సాంకేతిక సమస్య పరిష్కారమైనట్లు వెల్లడించింది. 'ఏప్రిల్ 3న కొద్ది గంటల పాటు సాంకేతిక సమస్య వల్ల మా డిజిటల్ సర్వీసుల్లో కొన్నింటిపై ప్రతికూల ప్రభావం పడిందని తెలియజేయడానికి చింతిస్తున్నాము. ప్రస్తుతం సమస్య పరిష్కారమైంది. డిజిటల్ సర్వీసులను పునరుద్ధరించాం' అని పేర్కొంది. అయితే కచ్చితంగా సమస్య ఏమిటి, ఏయే సర్వీసులపై.. ఎంత సేపు ప్రభావం పడింది తదితర వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇలాగే పలుమార్లు సాంకేతిక లోపాలు తలెత్తడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు రిజర్వ్ బ్యాంక్ గతంలో జరిమానా విధించింది.

స్పైస్‌జెట్ కార్గో, లాజిస్టిక్స్ విభాగం విడదీత



ముంబై: విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తమ కార్గో, లాజిస్టిక్స్ వ్యాపార విభాగం స్పైస్‌ఎక్స్‌ప్రెస్‌ను ప్రత్యేక విభాగంగా విడదీసింది. ఏప్రిల్ 1 నుంచి దీన్ని స్పైస్‌ఎక్స్‌ప్రెస్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా వ్యవహరిస్తున్నట్లు సంస్థ తెలిపింది. లాజిస్టిక్స్ వ్యాపార విభాగం స్వతంత్రంగా నిధులను సమీకరించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని సంస్థ చైర్మన్ అజయ్ సింగ్ తెలిపారు. 2022–23 ఏప్రిల్–డిసెంబర్ మధ్య వ్యవధిలో స్పైస్‌ఎక్స్‌ప్రెస్ రూ. 51 కోట్ల నికర లాభం నమోదు చేసింది. డీల్ ప్రకారం స్పైస్‌జెట్‌కు స్పైస్‌ఎక్స్‌ప్రెస్ రూ. 2,556 కోట్ల విలువ చేసే ఈక్విటీ షేర్లు, డిబెంచర్లు జారీ చేయనుంది. కార్లైల్ ఏవియేషన్ పార్ట్‌నర్ చెల్లించాల్సిన 100 మిలియన్ డాలర్ల రుణాన్ని గత నెల పునర్‌వ్యవస్థీకరించుకున్నామని అజయ్ సింగ్ పేర్కొన్నారు. తాజాగా లాజిస్టిక్స్ విభాగం విడదీతతో స్పైస్‌జెట్ బ్యాలెన్స్ షీటు మరింత పటిష్టంగా మారగలదని, కంపెనీ నెగటివ్ నికర విలువ భారం గణనీయంగా తగ్గగలదని ఆయన వివరించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

పీజీసీఐఎల్‌లో 138 ఇంజనీర్ ట్రెయినీ పోస్టులు

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్).. ఇంజనీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 138
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ –టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్–ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఐటీ తదితరాలు.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్(ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులవ్వాలి. గేట్ 2023 అర్హత సాధించాలి.
» **ఎంపిక విధానం:** గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.04.2023.
» **వెబ్‌సైట్:** www.powergrid.in

కర్నూలు వైద్య కళాశాలలో డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు

కర్నూలులోని కర్నూలు మెడికల్ కాలేజీ, మైక్రో బయాలజీ విభాగం.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **పోస్టుల వివరాలు:** ల్యాబ్ టెక్నీషియన్–01, డేటాఎంట్రీ ఆపరేటర్–01.
» **అర్హత:** డిగ్రీ, డిప్లొమా, ఎంఎల్‌టీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ఎల్‌టీ పోస్టులకు రూ.30,000, డీఈవోకు రూ.20,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును స్పీడ్/రిజిస్టర్ పోస్టు లేదా వ్యక్తిగతంగా ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కళాశాల, కర్నూలు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.04.2023.
» **రాతపరీక్ష, ఇంటర్వ్యూ తేది:** 21.04.2023.
» **ఎంపిక జాబితా వెల్లడితేది:** 28.04.2023.
» **వెబ్‌సైట్:** www.kurnool.ap.gov.in

తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని 23 ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన బ్యాగ్‌లాగ్ సీట్ల భర్తీకి సంబంధించి ప్రవేశ ప్రకటన వెలువడింది.

» **పరీక్ష పేరు:** ఈఎంఆర్ఎస్ సెలక్షన్ టెస్ట్(ఈఎంఆర్ఎస్ఎస్‌టీ), ఈఎంఆర్ఎస్ లేటర్ ఎంట్రీ టెస్ట్(ఈఎంఆర్ఎస్ఎల్‌టీ).
» **మొత్తం సీట్ల సంఖ్య:** 233.
» **సీట్ల వివరాలు:** ప్రతి ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయంలో ఆరో తరగతిలో 60 సీట్ల చొప్పున మొత్తం 23 విద్యాలయాల్లో 1380(690 బాలురు, 690 బాలికలు) సీట్లు ఉన్నాయి. ఏడో తరగతిలో 26(18 బాలికలు, బాలురు 8), ఎనిమిదో తరగతిలో 103(55 బాలికలు, బాలురు 48), తొమ్మిదో తరగతిలో 104(59 బాలికలు, బాలురు 45).
» **అర్హత:** ఆరో తరగతిలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా 2022–23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి వరుసగా 6, 7, 8 తరగతుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష(పట్టణ ప్రాంతం), రూ.లక్షన్నర(గ్రామీణ ప్రాంతం) మించకూడదు.
» **వయసు:** 31.03.2023 నాటికి ఆరో తరగతికి 10–13ఏళ్లు,ఏడో తరగతికి 12–15ఏళ్లు, ఎనిమిదో తరగతికి 13–16 ఏళ్లు, తొమ్మిదో తరగతికి 14–17 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు రెండేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆరో తరగతికి 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ, అర్థమేటిక్, లాంగ్వేజ్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. 7, 8, 9 తరగతులకు 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇంగ్లిష్, రీజనల్ లాంగ్వేజ్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సైన్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్షనిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.04.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 07.05.2023.
» **పరీక్ష ఫలితాల ప్రకటన తేది:** 30.05.2023.
» **మొదటి దశ ప్రవేశాలు:** 01.06.2023 నుంచి 10.06.2023.
» **వెబ్‌సైట్:** https://fastses.telangana.gov.in

వినూత్న బోధనకు కేరాఫ్.. కేవీలు!

» కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభం
» ప్రాథమిక స్థాయి నుంచే వినూత్న విధానంలో బోధన
» యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం



స్కూల్ విద్య..విద్యార్థి జీవితంలో ఎంతో ప్రధానమైన దశ! భవిష్యత్‌కు పునాది పాఠశాల చదువు!! కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయాలు(కేవీ).. యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యమిస్తూ.. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసి, నైపుణ్యాలకు పదును పెడుతున్నాయి. వీటిల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. కేంద్రీయ విద్యాలయాల ప్రత్యేకత, విద్యాబోధన, ప్రవేశ విధానం తదితర వివరాలు..

కేంద్రీయ విద్యాలయాలు వినూత్న బోధనకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దశాబ్దాల క్రితమే కేవీలు ఏర్పాటయ్యాయి. ప్రారంభంలో వీటిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, త్రివిధ దళాల ఉద్యోగుల పిల్లలకు మాత్రమే ఉద్దేశించినప్పటికీ.. తర్వాత కాలంలో సామాన్య పౌరుల పిల్లలకు కూడా ప్రవేశాలు కల్పిస్తున్నారు. మారుతున్న విద్యా వ్యవస్థకు అనుగుణంగా బోధనలో మార్పులుచేస్తూ.. నాణ్యమైన విద్యకు నిలయంగా నిలుస్తున్నాయి కేంద్రీయ విద్యాలయాలు.

ఎన్ఈపీ మేరకు వయో పరిమితి

కేవీల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో నూతన విద్యా విధానానికి అనుగుణంగానే వయో పరిమితి నిబంధనలు పేర్కొన్నారు. అన్ని తరగతులకు సంబంధించి వయో పరిమితికి మార్చి 31వ తేదీని గడువు తేదీగా పరిగణిస్తారు. ఉదాహరణకు..ఒకటో తరగతిలో చేరాలనుకుంటే.. మార్చి 31 నాటికి విద్యార్థి వయసు ఆరు నుంచి ఎనిమిదేళ్ల మధ్యలో ఉండాలి. అదేవిధంగా రెండు, మూడో తరగతుల్లో ప్రవేశానికి 7–9ఏళ్లు, ఐదో తరగతి 9–11ఏళ్లు, ఆరో తరగతికి 10–12 ఏళ్లు, ఏడో తరగతికి 11–13ఏళ్లు, ఎనిమిదో తరగతికి 12–14ఏళ్లు, తొమ్మిదో తరగతికి 13–15ఏళ్లు, పదో తరగతికి 14–16ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

విభిన్న కేటగిరీలకు ప్రాధాన్యతలు

- కేవీల్లో ప్రవేశాల ఖరారుకు విభిన్న కేటగిరీల ఉద్యోగులను పరిగణనలోకి తీసుకుంటూ.. నిర్దిష్ట ప్రాధాన్యత క్రమాన్ని అనుసరిస్తున్నారు.
- **కేటగిరీ–1:** బదిలీయైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు.
- **కేటగిరీ–2:** కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఆఫ్ ది ఇండియన్ గవర్న్‌మెంట్‌కు సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- **కేటగిరీ–3:** బదిలీయైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- **కేటగిరీ–4:** రాష్ట్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్, రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- **కేటగిరీ–5:** పై కేటగిరీలకు చెందని ఇతర వర్గాలకు చెందిన పిల్లలు.

ఆర్‌టీఈ ప్రకారం–25 సీట్లు

విద్యార్థులకు సీట్లు కేటాయించే క్రమంలో విద్యా హక్కు చట్టం నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఒక పాఠశాలలోని మొత్తం సీట్లలో 25 శాతం సీట్లను ఆర్‌టీఈ విధానంలో కేటాయిస్తారు. అదే విధంగా 15 శాతం సీట్లను ఎస్సీ కేటగిరీ విద్యార్థులకు, 7.5 శాతం సీట్లను ఎస్టీ కేటగిరీ విద్యార్థులకు, 27 శాతం సీట్లను ఓబీసీ–నాన్ క్రీమీ లేయర్ కేటగిరీ విద్యార్థులకు కేటాయిస్తారు. అన్ని రిజర్వేషన్ కేటగిరీ వర్గాలకు అందుబాటులో ఉన్న సీట్లలో 3 శాతం సీట్లను ఆ వర్గాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు కేటాయిస్తారు.

లాటరీ విధానంలో ఎంపిక

- ఎంపిక ప్రక్రియలో ఆయా కేటగిరీలు,రిజర్వేషన్లను అనుసరించి లాటరీ విధానంలో నిర్దిష్ట క్రమంలో సీట్ల కేటాయింపు చేస్తారు. మొదట ఆర్‌టీఈ విధానంలో, తర్వాత అన్ని వర్గాల దివ్యాంగ విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు.
- ఈ రెండు దశలు పూర్తయిన తర్వాత కేటగిరీ–1, కేటగిరీ–2, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, కేటగిరీ–3, కేటగిరీ–4 కేటగిరీ–5, కేటగిరీ–6, సింగిల్ గర్ల్ చైల్డ్ విద్యార్థులను వరుస క్రమంలో ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా గరిష్టంగా మూడు కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పూర్తిగా లాటరీ విధానంలో సంబంధిత కేంద్రీయ విద్యాలయ అధికారులు విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ లాటరీ విధానంలో సైతం ప్రాధాన్యతలను అనుసరిస్తారు. ఇది కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది.

పదకొండో తరగతి

కేంద్రీయ విద్యాలయాల్లో పదకొండో తరగతిలో వయో పరిమితి నిబంధనలు లేకుండానే ప్రవేశాలు కల్పించే విధానం అమలవుతోంది. అయితే విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులైన సంవత్సరంలోనే దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్ ప్రథమ సంవత్సరం తర్వాత బ్రేక్ లేని వారికే ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రవేశ పరీక్ష ఆధారంగా తొమ్మిదో తరగతి

- కేంద్రీయ విద్యాలయాల్లో ఎనిమిదో తరగతి వరకు ఎలాంటి ప్రవేశ పరీక్షలు ఉండవు. మెరిట్, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. తొమ్మిదో తరగతిలో అడ్మిషన్‌కు మాత్రం పరీక్ష నిర్వహిస్తున్నారు.
- హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సోషల్‌సైన్స్, సైన్స్ సబ్జెక్ట్‌లలో వంద మార్కులకు మూడు గంటల వ్యవధిలో ఈ పరీక్ష ఉంటుంది. ఒక్కో సబ్జెక్ట్ నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి.
- ఈ పరీక్షలో 33 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఆ తర్వాత సంబంధిత కేంద్రీయ విద్యాలయ అధికారులు మెరిట్ జాబితా రూపొందించి.. పైన పేర్కొన్న కేటగిరీల వారీగా ప్రాధాన్యత క్రమంలో ప్రవేశాలు కల్పిస్తారు.

పదకొండో తరగతి.. మూడు గ్రూప్స్

కేంద్రీయ విద్యాలయాల్లో పదకొండో తరగతిలో మూడు స్ట్రీమ్స్(సైన్స్, కామర్స్, హ్యూమానిటీస్) అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు పదో తరగతిలో సాధించిన మార్కులు, వారు దరఖాస్తు చేసుకున్న స్ట్రీమ్‌లో అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తారు. పదకొండో తరగతిలో ప్రవేశం పొందిన అన్ని స్ట్రీమ్‌ల విద్యార్థులు ఇన్ఫర్మాటిక్ ప్రాక్టీసెస్‌ను ఎలక్టివ్ సబ్జెక్ట్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. సంబంధిత కేంద్రీయ విద్యాలయంలో అందుబాటులో ఉన్న ఎలక్టివ్స్ ఆధారంగా.. కంప్యూటర్ సైన్స్/బయోటెక్నాలజీలను సైన్స్ స్ట్రీమ్ అభ్యర్థులు ఎలక్టివ్‌గా ఎంచుకోవచ్చు. వీటితోపాటు మల్టీమీడియా, వెబ్ డిజైనింగ్ టెక్నాలజీ, సబ్జెక్ట్‌లను కూడా ఎలక్టివ్‌గా అన్ని స్ట్రీమ్‌ల విద్యార్థులు ఎంచుకోవచ్చు.

బోధన.. ఆహ్లాదకరం

పిల్లలు ఉత్సాహంగా స్కూల్‌కు వెళ్లే విధంగా కేంద్రీయ విద్యాలయాల్లో విద్యా విధానం అమలవుతోంది. ముఖ్యంగా కొత్తగా చేరే పిల్లలు ఇంటి నుంచి స్కూల్ వాతావరణానికి అలవాటుపడేలా చేసేందుకు ఆరు వారాల వ్యవధితో 'స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్'ను రూపొందించాయి. ఈ ప్రోగ్రామ్ అనంతరం పరిసరాలను అర్థం చేసుకోవడం, ఆత్మవిశ్వాసం, పరిశీలన, పరస్పర సంబంధాలు, వర్గీకరణ , అనుకరణ, భావ వ్యక్తీకరణ, అవగాహన, క్రియేటివ్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు.

ఫీజులు నామ మాత్రంగా

- కేంద్రీయ విద్యాలయాల్లో ఫీజులు నామమాత్రంగా ఉంటాయి. అడ్మిషన్ ఫీజు రూ.25. విద్యాలయ వికాస నిధి(రూ.500), ట్యూషన్ ఫీజు, కంప్యూటర్ ఎడ్యుకేషన్ తదితర ఫీజులు ఉంటాయి. ఒకటి నుంచి అయిదో తరగతి విద్యార్థులకు అన్నిరకాల ఫీజులు కలిపి నెలకు రూ.500–600, ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1000లోపు అవుతుంది. బాలికలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయ ఉద్యోగుల పిల్లలకు ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు లభిస్తుంది.
- పదకొండో తరగతిలో కంప్యూటర్ సైన్స్ ఎలక్టివ్‌గా తీసుకున్న విద్యార్థులు రూ.150, పదకొండు, పన్నెండు తరగతులకు కామర్స్, హ్యూమానిటీస్ స్ట్రీమ్ విద్యార్థులు రూ.300; సైన్స్ స్ట్రీమ్ విద్యార్థులు రూ.400 చెల్లించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఒకటో తరగతికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ:** ఏప్రిల్ 17, 2023
- **2వ తరగతి, ఆపై తరగతులకు(ఇంటర్ ఫస్ట్ ఇయర్ మినహా) దరఖాస్తు తేదీలు:** ఏప్రిల్ 3 – ఏప్రిల్ 12, 2023
- **పదకొండో తరగతి రిజిస్ట్రేషన్:** పదో తరగతి ఫలితాలు వెల్లడైన పది రోజుల నుంచి దరఖాస్తు చేసుకోవాలి.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://kvsonlineadmission.kvs.gov.in/index.html
- **ఒకటో తరగతి ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://kvsonlineadmission.kvs.gov.in/index.html

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అరుదైన కాలమ్నార్ బసాల్ట్ శిలలు

అగ్నిపర్వతాల నుంచి వెలువడిన లావా స్తంభాల్లా ఏర్పడిన తీరు

ఆరున్నర కోట్ల ఏళ్ల కింద రూపొందినట్టు నిపుణుల అంచనా

గుర్తించిన ఔత్సాహిక యువత.. ఇప్పటివరకు నమోదు చేయని జీఎస్ఐ

పట్టించుకోకుంటే ధ్వంసమైపోయే అవకాశం

మహారాష్ట్ర, కర్ణాటకలలో ఇలాంటి శిలలున్న ప్రాంతాలకు రక్షణ

లావా చెక్కిన శిలలు!



బోరెల్‌గూడ వద్ద పొడవుగా కాలమ్నార్ బసాల్ట్ స్తంభాలు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతం.. దట్టమైన అడవుల్లో.. గుట్టల దిగువన పొడవాటి శిలలు.. ఏదో పని కోసం మనుషులు చెక్కి అలా వదిలేసినట్టు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.. కానీ అవి ప్రకృతి చెక్కిన రాళ్లు.. అందులోనూ మామూలు రాళ్లు కాదు.. భూమి అడుగునుంచి పొంగుకొచ్చిన లావా గట్టిపడి నిలువునా పోతపోసినట్టు ఏర్పడిన బసాల్ట్ శిలలు అవి. ఎంతో చరిత్ర దాగి ఉన్న ఆ నిలువు రాళ్లను ఔత్సాహిక యువత గుర్తించినా.. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఇప్పటివరకు నమోదు చేయలేదు. పరిరక్షణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీనితో ఆ అరుదైన బసాల్ట్ శిలలు ధ్వంసమైపోయే అవకాశం ఉందన్న విమర్శలు వస్తున్నాయి.

ఏమిటీ శిలలు..

➤ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని బజార్ హత్నూర్, బోరెల్‌గూడ, ఆసిఫాబాద్ సమీపంలోని వర్తమనూర్‌తో పాటు పలుచోట్ల అరుదైన బసాల్ట్ శిలలు ఉన్నాయి. వీటిని కాలమ్నార్ బసాల్ట్ (లావా శిలలు)గా పిలుస్తారు. సుమారు ఆరు కోట్ల ఏళ్ల కింద ఇవి ఏర్పడినట్టు అంచనా. సాధారణంగా భూగర్భం నుంచి ఉబికి వచ్చిన లావా ప్రవహిస్తూ నీటి ప్రవాహాల వద్ద వేగంగా ఘనీభవించినపుడు.. నీళ్లు ఇంకినప్పుడు నేల నెర్రలువాసినట్టుగా లావాలో అష్టభుజి, షట్భుజి, చతురస్రం.. ఇలా రకరకాల ఆకృతుల్లో లోతుగా పగుళ్లు ఏర్పడతాయి. కొన్నేళ్ల పరిణామక్రమంలో అవి విడివడి స్తంభాలుగా రూపొందుతాయి. చాలా ప్రాంతాల్లో లావా ప్రవహించినా ఈ కాలమ్నార్ బసాల్ట్‌లు మాత్రం కొన్ని చోట్లనే ఏర్పడడం విశేషం. ఇలాంటివి చాలా అరుదు కూడా.

5 లక్షల కిలోమీటర్ల పరిధిలో..

➤ భూగర్భం నుంచి ఉబికి వచ్చిన లావా ప్రవహించిన ప్రాంతం మన దేశంలో ఐదు లక్షల చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉంది. దీన్ని డెక్కన్ వల్కానిక్ ప్రావిన్స్ (డీవీపీ)గా పేర్కొంటారు. ఇందులో మహారాష్ట్ర పూర్తి ప్రాంతం ఉండగా తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, గుజరాత్‌లలో కొంత భాగం ఉంది. డీవీపీ తూర్పు చివరిభాగం తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్‌లలో విస్తరించి ఉంది. ఈ డీవీపీలోనే పలు ప్రాంతాల్లో కాలమ్నార్ బసాల్ట్ శిలలు ఏర్పడ్డాయి.

ఇతర రాష్ట్రాల్లో రక్షిస్తున్నా..

మహారాష్ట్ర, కర్ణాటకలలో ఇలాంటి లావా శిలలున్న ప్రాంతాలను జీఎస్ఐ అధికారికంగా గుర్తించింది. ఇప్పుడు అవి రక్షిత ప్రాంతాలుగా ఉన్నాయి. కర్ణాటకలోని ఉడిపి జిల్లా పరిధిలోకి వచ్చే సెయింట్ మేరీస్ దీవిలో పొడవాటి లావా శిలలతో ఏర్పడిన గుట్ట ఉంది. ఆ శిలలను జీఎస్ఐ గుర్తించి ప్రాచుర్యంలోకి తేవటంతో అది పర్యాటక ప్రాంతంగా మారింది. విదేశాల్లోనూ ఇలాంటి శిలలున్న ప్రాంతాలను జియో పార్కులుగా అభివృద్ధి చేస్తున్నారు. అయితే మన రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐదారు ప్రాంతాల్లో ఈ లావా శిలలను గుర్తించినా పట్టించుకునేవారే లేకుండా పోయారు. వ్యవసాయం, ఆవాసాల విస్తరణ, రోడ్ల నిర్మాణంతో అవి చెదిరిపోయే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజమండ్రి సమీపంలో ఓ చిన్న భాగం..

తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల్లోని డీవీపీతో లింకు లేకుండా.. రాజమండ్రి సమీపంలో 25 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో లావా ఘనీభవించిన ప్రాంతముంది. కోస్తా ప్రాంతంలో ఈ చిన్న ముక్క తప్ప మరెక్కడా ఇలాంటిది లేదని నిపుణులు చెప్తున్నారు.

అంగారకుడిపైనా కాలమ్నార్ శిలలు

➤ కొన్నేళ్ల కింద నాసా ఉపగ్రహాలతో అంగారకుడిని చిత్రించినప్పుడు కనిపించిన దృశ్యాలు శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరిచాయి. అంగారక గ్రహం మీద గుట్టల్లాగా ఉన్న ప్రాంతాల్లో నిలువు చారలను విశ్లేషించగా.. కాలమ్నార్ బసాల్ట్ (లావా శిలలు)గా తేల్చారు. అంగారక గ్రహం మీద అగ్నిపర్వతాలు ఉండేవన్న దానికి ఇవి ఆధారంగా నిలిచాయి. భవిష్యత్తులో మానవులు అంగారకుడిపైకి వెళ్లేందుకు ఎంత అనువుగా ఉంటుందన్న దిశలో సాగుతున్న పరిశోధనల్లో ఇదీ ఓ కీలక అంశంగా మారింది.

బొమ్మలు గీసినట్టే



ఇది ఆసిఫాబాద్ ప్రాంతంలోని వర్తమనూర్ వద్ద అడవిలో కనిపించిన అందమైన రాతి అమరిక. ఎవరో చెక్కినట్టుగా, రాళ్లపై ఆదిమానవులు రూపొందించిన పెట్రోగ్లిఫ్స్‌ను తలపిస్తున్న ఈ అమరిక లావా ప్రభావంతో ఏర్పడినదే. ప్రపంచవ్యాప్తంగా కొన్నిచోట్ల మాత్రమే ఇలాంటి శిలలు ఉన్నాయి. అలాంటి వాటిని పట్టించుకునే వారే లేరన్న విమర్శలున్నాయి.

రక్షిత ప్రాంతాలుగా గుర్తించాలి..

ప్రపంచంలో అరుదుగానే ఈ కాలమ్నార్ బసాల్ట్ శిలలు ఉన్నాయి. పలు దేశాల్లో వీటిపై అధ్యయనాలు జరుగుతున్నాయి కూడా. తెలంగాణలో ఈ శిలలు కనిపించిన ప్రాంతాలను రక్షిత ప్రాంతాలుగా గుర్తించి భవిష్యత్తు ప్రయోగాలకు రక్షించుకోవాలి.

– చకిలం వేణుగోపాల్, జీఎస్ఐ విశ్రాంత అధికారి

ఔత్సాహికులే గుర్తించారు..

ఆదిలాబాద్ ప్రాంతంలో ఇప్పటివరకు వెలుగు చూసిన లావా శిలలను మన్నె ఆలియా, కటకం మురళి, వేణుగోపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితర ఔత్సాహికులు గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యు ల వల్లనే ఆ శిలలు బయటి ప్రపంచానికి తెలిసి వాటిపై స్థానికంగా కొంత అవగాహనకు వీలు కలిగింది. వాటి పుట్టుపూర్వోత్తరాలపై అధ్యయనం జరగాల్సిన అవసరం ఉంది.

– శ్రీరామోజు హరగోపాల్, చరిత్ర పరిశోధకులు

తలకు మించిన భారం

● భారీగా పెరిగిపోయిన బాలుడి తల
● రూ.15 లక్షలు–రూ.20 లక్షలుంటేనే శస్త్రచికిత్స
● సాయం అందించాలని ప్రజావాణిలో తల్లి వినతి



కుమారుడితో ప్రజావాణికి హాజరైన హారిక

ఖలీల్‌వాడి: ఎనిమిదేళ్ల ప్రాయం.. హాయిగా ఆటపాటలతో సాగిపోవలసిన తరుణం. భారీగా పెరిగిపోయిన శిరస్సుతో తీవ్ర అనారోగ్యం.. శిరోభారంతో వేదన పడుతున్న తన ఎనిమిదేళ్ల కుమారుడికి వైద్య సాయం అందించాలని బాలుడి తల్లి వేడుకుంటోంది. వివరాలివి. ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బొడ్డు హారిక, రాము దంపతులకు ఇద్దరు కవలలు జన్మించారు. వీరిలో ఒక బాలుడు అనారోగ్యంతో చనిపోయాడు. మరో కుమారుడు శివకుమార్‌కు ఐదు నెలల వయసులో శిరస్సు పెరగడం ప్రారంభించింది. దీంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని నీలోఫర్, నిమ్స్‌లో బాలుడికి వైద్య పరీక్షలు చేయించారు. తలలో నీరు చేరిందని, ఆ వయసులో తల మెత్తగా ఉండటంతో తొలగించడం వీలుకాదని అప్పట్లో వైద్యులు స్పష్టం చేశారు. ఇప్పుడు తల గట్టిపడి శస్త్రచికిత్సకు అనువుగా ఉందని, ఇందుకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. అప్పటికే రూ.8 లక్షల వరకు ఖర్చు చేశామని, అప్పులు ఎక్కువ కావడంతో తన భర్త బతుకుదెరువు కోసం ఇటీవల గల్ఫ్ వెళ్లాడని తెలిపింది. తాను గ్రామంలో కూలి పనులు చేసుకుంటానని వివరించింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించింది. దయగల దాతలు ఎవరైనా ఆర్థిక సహాయం చేసేందుకు 7569144233 సెల్ నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది.

చెత్త వేసొస్తానని పారిపోయి.. చెట్లపొదల్లో నిద్రపోయి..

మున్సిపల్ ట్రాక్టర్‌లో చెత్తవేసి జంప్ అయిన ఖైదీ
● గాలించిన పోలీసులు, పరకాల జైలు అధికారులు
● భార్య నిజాయితీతో పోలీసులకు చిక్కిన వైనం



పరకాల శివారులో పాషాను పట్టుకున్న జైలు అధికారులు, పోలీసులు

పరకాల: చుట్టూ పచ్చనిపొలాలు.. పంటకాల్వల్లో ఉరకలేస్తున్న జలాలు.. ఆ పక్కనే చీమ చిటుక్కున్నా వినిపించేంత నిశ్శబ్దం అలుముకున్న చెట్ల పొదలు. ఆ పొదల్లో ఓ వ్యక్తి ఆదమరిచి నిద్రపోతున్నాడు. ఏదో అలికిడికి ఉలిక్కిపడి లేచి చూసేసరికి చుట్టూ సాయుధులైన పోలీసులు. తప్పించుకోబోయి చివరికి పోలీసులకు చిక్కాడు. జైలు సిబ్బందిని నమ్మించి పారారైన రిమాండ్ ఖైదీ చివరికి అతడి భార్య ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులకు పట్టుబడ్డాడు. 2019లో మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికపై అత్యాచారం కేసులో ములుగు జిల్లా ఏటూరునాగారం గ్రామానికి చెందిన సైకిల్ మెకానిక్ షేక్ గౌస్ పాషా అలియాస్ చోటు(22) కరీంనగర్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. బెయిల్‌పై బయటకు వచ్చి తిరిగి కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతుండటంతో ఈ ఏడాది మార్చి 18న పోలీసులు అతడిని అరెస్టు చేసి పరకాల సబ్‌జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలు సిబ్బందితో సన్నిహితంగా ఉంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో మున్సిపల్ వాహనంలో చెత్తవేయడానికని తాజాగా సోమవారం తెల్లవారుజామున 6.20 గంటలకు జైలు గేటు దాటి వచ్చి పరారయ్యాడు.

భార్య ఇచ్చిన సమాచారంతో...

పరారైన తరువాత భార్యకు నిందితుడు ఫోన్ చేసి ఉంటాడని జైలు అధికారులు పసిగట్టి పరారీ విషయాన్ని ఆమెకు ఫోన్‌ద్వారా తెలియజేశారు. అతడు తిరిగి జైలుకువస్తే శిక్ష తక్కువగా ఉంటుందని, లేకపోతే మరింత ఎక్కువ కాలం శిక్ష అనుభవించాల్సి వస్తుందని చెప్పారు. కొద్దిసేపటి తరువాత అనుకున్నట్టే గౌస్ పాషా ఇతరుల సెల్‌ఫోన్‌తో భార్యకు ఫోన్ చేశాడు. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆ నంబర్ లొకేషన్ గుర్తించి అయ్యప్ప గుడి వద్దకు చేరుకున్నారు. అతడు అదే ప్రాంతంలో ఉంటాడని భావించిన పోలీసులు ఆ చుట్టుపక్కల పంటపొలాలు, కాల్వలు, చెట్లపొదలలో గాలించారు. చివరకు ఓ పంటకాల్వ సమీపంలోని చెట్లపొదల్లో నిద్రపోతూ పోలీసులకు చిక్కాడు.



సారూ.. బడిలో మంచినీళ్లు లెవ్వు

ప్రజావాణిలో ఆరో తరగతి విద్యార్థి ఫిర్యాదు

జగిత్యాల టౌన్: 'సారూ మా బడిలో తాగేందుకు మంచినీళ్లు లెవ్వు. మూత్రశాలలు పనిచేయడం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నం. మీరైనా జోక్యం చేసుకోండి' అని ఆరో తరగతి విద్యార్థి ప్రజావాణి ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన రాజమల్లు కుమారుడు పి.విశ్వాంక్ ప్రభుత్వ ఓల్డ్ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. తమ పాఠశాలలో మూత్రశాలలు శిథిలమయ్యాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఒకటి, రెంటికి బడి సమీపంలోని పబ్లిక్ సులభ్ కాంప్లెక్స్‌లోకి వెళ్తున్నామని, అక్కడ నిర్వాహకులు పైసలు వసూలు చేస్తున్నారని తెలిపాడు. తమతోపాటు ఉపాధ్యాయులదీ ఇదే పరిస్థితి అని వివరించాడు. అసలే పేదవాళ్లమని, తాముపైసలు చెల్లించలేకపోతున్నామని వాపోయాడు. ప్రస్తుతం ఎండాకాలమని, దాహంతో తపిస్తున్నామన్నాడు. ప్రజావాణి ద్వారా జిల్లా సంక్షేమాధికారి నరేశ్‌కు వినతిపత్రం అందజేశాడు.

మృతదేహం ఇచ్చేందుకు 4లక్షలు అడిగారు

● నిమ్స్ వర్గాలపై మృతుని బంధువుల ఆరోపణ
● చివరికి మంత్రి హరీశ్‌రావు కార్యాలయ సిబ్బంది చొరవతో అప్పగించినట్టు వెల్లడి



తోకల పవన్‌కళ్యాణ్ (ఫైల్)

అశ్వాపురం: నిమ్స్‌లో చికిత్స పొందుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అంబేడ్కర్ నగర్‌కు చెందిన తోకల పవన్ కళ్యాణ్(24) సోమవారం మృతి చెందగా, మృతదేహం ఇచ్చేందుకు ఆస్పత్రి వర్గాలు రూ. 4లక్షలు డిమాండ్ చేసినట్టు మృతుడి బంధువులు ఆరోపించారు. కళ్యాణ్ తలలో గడ్డ ఏర్పడడంతో వికలాంగుడైన ఆయన తండ్రి వెంకటేశ్వర్లు పది రోజుల క్రితం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి వైద్య ఖర్చులకు దాతల సాయం కోరారు. ఈ విషయమై మార్చి 26న 'ఆపన్న హస్తం అందించరూ' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా, స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాలతో ఆయన కార్యాలయ సిబ్బంది, అధికారులు నిమ్స్ వైద్యులతో మాట్లాడారు. యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని, బిల్లు విషయంలో ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఆ వెంటనే సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.5 లక్షల ఎల్‌ఓసీకి సిఫారసు చేశారు. అయితే, ఎల్‌ఓసీ మంజూరులో ఆలస్యం జరుగుతుండగా ఆరోగ్యం విషమించి పవన్ మృత్యువాత పడ్డాడు. మృతదేహం అప్పగించేందుకు డబ్బులు అడిగిన విషయాన్ని మంత్రి హరీశ్‌రావు పీఆర్‌ఓ దృష్టికి 'సాక్షి' తీసుకెళ్లగా ఆయన నిమ్స్ బాధ్యులతో మాట్లాడారు. దీంతో మృతదేహాన్ని అప్పగించినట్టు మృతుని కుటుంబసభ్యులు తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ బస్ పాస్‌లో శ్లాబ్ విధానం రద్దు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు పాస్‌ల జారీలో శ్లాబ్ విధానాన్ని ఆర్టీసీ ఎత్తివేసింది. ఇక నుంచి కిలోమీటర్ల వారీగా పాస్‌లను జారీ చేయనుంది. గతంలో 51 కిలోమీటర్ల దూరం ప్రయాణించే వారు కచ్చితంగా 55 కి.మీ.కు చెందిన శ్లాబ్‌తో పాస్ కొనాల్సి ఉండేది. ఇప్పుడు ఎన్ని కి.మీ. దూరం ప్రయాణం చేయాల్సి ఉందో అంతే దూరానికి పాస్‌ను అందిస్తారు. గతంలో పాస్ ఉన్న ప్రయాణికులు టోల్‌గేట్ దాటాల్సి వస్తే టోల్ చార్జ్ విడిగా చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ రుసుమును కూడా పాస్ ధరలోనే కలిపి వసూలు చేయనున్నారు. ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు, కేటగిరీలో రోజూ ప్రయాణించాల్సిన వారు ఈ పాస్‌లు పొందనున్నారు.

651 ఔషధ ధరలపై కేంద్రం సీలింగ్

వాటి ధరలు 7 శాతం వరకు తగ్గే అవకాశం



సాక్షి, హైదరాబాద్: అత్యవసర ఔషధాల జాబితాలో ఉన్న 651 రకాల మందుల ధరలపై కేంద్ర ప్రభుత్వం సీలింగ్ విధించింది. దీంతో ఈ ఔషధాల ధరలు దాదాపు 7 శాతం వరకు తగ్గాయి. ఈ మేరకు ఔషధ ధరల నియంత్రణ సంస్థ, నేషనల్ ఫార్మాస్యూటికల్స్ ప్రైసింగ్ అథారిటీ ట్విటర్ వేదికగా వెల్లడించాయి. నిజానికి ద్రవ్యోల్బణం కారణంగా వీటి ధరలు 12.12 శాతం పెరగాల్సి ఉండగా.. ఈ సీలింగ్ నిర్ణయంతో వీటి ధరలు 6.73 శాతం దిగొచ్చాయి. ఏప్రిల్ 1 నుంచే ఈ ధరలు తగ్గాయి. దీంతో ఔషధాల ధరల పెరుగుదల ఎక్కువగా ఉన్నప్పటికీ... ఈ తగ్గింపుతో వినియోగదారులు ప్రయోజనం పొందనున్నారని కేంద్రం తెలిపింది.

ఆ మందులు ఏవంటే..

జ్వరానికి ఉపయోగించే పారాసెటమాల్, డయాబెటిస్ నియంత్రణ ఔషధాలు మెట్ఫార్మిన్, గ్లిమెపిరైడ్, టెల్మిసార్టాన్, యాంటీ బయోటిక్ ఔషధం అమోక్సిసిలిన్, క్లావులానిక్ యాసిడ్ వంటి మందుల ధరలు తగ్గాయి. అధిక శాతం మంది ప్రజలు వినియోగించే అత్యవసర ఔషధాలతో ఆరోగ్యశాఖ ఓ జాబితాను రూపొందించింది. ఈ జాబితాలో మొత్తం 870 రకాల ఔషధాలున్నాయి. ఈ మందుల ధరలను జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ పర్యవేక్షిస్తోంది. అయితే మందుల టోకు ధరల సూచీ ఆధారంగా ఏటా ఏప్రిల్ 1న ఈ ధరలను సవరిస్తుంటారు. అలా 2022 సంవత్సరానికి ఈ సూచీ 12.12 శాతం పెరిగింది. దీంతో షెడ్యూల్డ్ ఔషధాల పరిధిలోకి వచ్చే 857 రకాల మందులను 12.12 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్రం కూడా ఆమోదం తెలిపింది. కానీ ఈ జాబితాలో 651 ఔషధాల ధరలపై కేంద్రం తాజాగా సీలింగ్ ధరను నిర్ణయించింది. దీంతో వీటి ధరలు సగటున 6.73 శాతం దిగొచ్చాయి. ప్రభుత్వం ప్రకటించిన సీలింగ్ ధరను మించి విక్రయించేందుకు అనుమతులు ఉండవు. కాగా, దీనిపై ఇంకా అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు తమకు రాలేదని తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ఛైర్మన్ సంజయ్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీకి చమురు భారం తగ్గింది

భారీ ఊరట
● బల్క్ డీజిల్ ధరను లీటరుపై రూ.4.72 తగ్గించిన చమురు కంపెనీలు
● ఇక ప్రైవేటు బంకుల నుంచి కొనుగోలు నిలిపివేత
● నెలకు దాదాపు రూ. 9 కోట్లు ఆదా



సాక్షి, హైదరాబాద్: చమురు భారంతో అల్లాడుతున్న ఆర్టీసీకి భారీ ఊరట లభించింది. ఆయిల్ కంపెనీలు బల్క్ డీజిల్ ధరను భారీగా తగ్గించాయి. దీంతో గత ఏడాదిగా ప్రైవేటు బంకుల్లో డీజిల్ కొంటున్న ఆర్టీసీ, ఇప్పుడు మళ్లీ ఆయిల్ కంపెనీల నుంచే బల్క్ డీజిల్ కొనటం ప్రారంభించింది. మూడు రోజుల క్రితం వరకు ప్రైవేటు బంకుల్లో లీటరు డీజిల్‌ను రూ.97.82కు కొన్న ఆర్టీసీకి ఇప్పుడు బల్క్ రూ.93.10కే అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆర్టీసీకి ప్రతి లీటరుపై రూ.4.72 చొప్పున ఊరట మిగులుబాటు కానుంది. రోజుకు ఆరున్నర లక్షల లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తున్న ఆర్టీసీకి ఇది పెద్ద ఊరటనే చెప్పాలి. మొత్తంగా నెలకు రూ.9 కోట్ల మేర ఆర్టీసీకి ఆదా అవుతున్నట్టు అధికారుల అంచనా.

ఏడాదిగా అదే భారం..

గతేడాది ఫిబ్రవరిలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర పెరిగిందన్న కారణంతో ఆయిల్ కంపెనీలు బల్క్ డీజిల్ ధరను భారీగా పెంచిన విషయం తెలిసిందే. దీంతో బల్క్ డీజిల్ కొనుగోళ్లు నిలిపివేసి, ఎక్కడి డిపోలు అక్కడి ప్రైవేటు బంకుల నుంచి కొనుక్కోవాలని ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని బంకులు బయటి వాహనాలకు వసూలు చేసే ధర కంటే ఆర్టీసీకి రూ.1 నుంచి రూ. 2 వరకు ధర తగ్గించి విక్రయించటం మొదలు పెట్టాయి. ఈ తరుణంలోనే నగరానికి చెందిన కొందరు చమురు కేటుగాళ్లు, కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్ తెచ్చి ఆర్టీసీకి అమ్మటం ప్రారంభించారు. తెలంగాణలోని బంకులతో పోలిస్తే, కర్ణాటకలో లీటరుపై రూ.10 వరకు ధర తక్కువగా ఉంది. దీంతో భారీ ట్యాంకర్ల ద్వారా అక్రమంగా చెక్‌పోస్టులు దాటిస్తూ ఆర్టీసీకి స్థానిక బంకుల పేరుతో అమ్మటం ప్రారంభించారు. అయితే అక్రమ రవాణాతో రాష్ట్రానికి రావాల్సిన పన్నులు ఎగ్గొట్టినట్టు ఆర్టీసీలోని కొన్ని డిపోలపై ఆరోపణలు వెల్లువెత్తాయి. కొన్ని జిల్లాల్లో కలెక్టర్లకు కూడా ఫిర్యాదులు అందాయి. దీంతో కర్ణాటక డీజిల్ కొనొద్దని ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేశారు. అయినా కొన్ని డిపోల్లో ఆ దందా కొనసాగింది. ఇప్పుడు బల్క్ డీజిల్‌ను చమురు కంపెనీలు రిటైల్ కంటే రూ.4.72 మేర తగ్గించటంతో ఇక ప్రైవేటు దందా పూర్తిగా ఆగిపోయిందనే చెప్పాలి. కాగా, బల్క్ డీజిల్ ధర త్వరలో మరింత తగ్గే అవకాశం ఉందని అంటున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.